కందుకూరి స్వీయ చరిత్ర సంగ్రహము
(శ్రీ కందుకూరి వీరేశ లింగం గారు)

సంగ్రహ కర్త

చిరువోలు విజయ నరసింహారావు ఎం .ఎ

రాజమహేంద్రవరం

(6-7-2023)

ఓం

శ్రీ కందుకూరి వీరేశలింగం (స్వీయ చరిత్ర సంగ్రహము)

శ్రీ కందుకూరి వీరేశ లింగము గారు ఆంధ్ర దేశమున బుట్టి,ఆంధ్ర భాషకు,సంఘమునకు,దురాచార బాధితులకు వారికి గొప్ప సేవ యొనర్చిన—సంఘ సంస్కర్తగా పేరొందిన మహనీయులు. అట్టి విశిష్ట వ్యక్తి తన జీవిత చరిత్రను వ్రాసి ప్రకటించుట ముదావహము . ఇదియే ఇట్టి రచనా ప్రక్రియలో ప్రథమ మైనది. వీరనేక కవితా ప్రక్రియలను ప్రప్రథమముగా చేసి చూపిరి. ఈ రచనచే మనకు వారి పరిశ్రమయు,పట్టుదలయు,నాటి వ్యతిరేకులతో తామొనరించిన పోరాట పటిమయు,ఆనాటి ఆచార వ్యవహారములును,సంఘ పరిస్థితులను,వారు స్థాపించిన సేవా సంఘముల చరిత్రయు,వారి వివిధ రచనల వృత్తాంతమును,సాకల్యముగా మనకు ప్రదర్శింప జేసిరి. తన చరిత్ర తెలుపుటలో వారెట్టి స్వార్థమునకు,పక్ష పాతమునకు,సత్యమును వక్రీకరించుటకే మాత్రము యత్నించి యుండలేదని స్పష్ట మగును. ఈ గ్రంధము నందలి వివిధ విషయములను వీలైనంతగా పరిశీలించి,కొన్ని సత్యములను విశదీకరించ యత్నించెదము. ప్రతి చిన్న సంఘటనను కూడా వారు వివరించి చెప్పుట కడు ప్రశంశనీయము.

ఈ గ్రంధమును వారు ఈశ్వర ప్రార్థనముతో ఆరంభించిరి. దయా సత్య ధర్మ స్వరూపుడైన పరమేశ్వరుని వారు ప్రార్థించి,తన రచనా కార్యమును ఆత్మ శ్లాఘపరత్వము లేక, సత్య ప్రకటన మొనరించి నిర్విఘ్నముగా పూర్తి చేయుటకు వలయు శక్తిని ,ప్రో త్సాహమును ప్రసాదించమని వారా సర్వేశ్వరుని వేడు కొనిరి. గర్వము లేకుండా తనను ముందుకు నడుపుమని స్వామిని వారర్థించిరి. దీని వలన వారి ధర్మ నిరతియు,కార్య సాధనా తత్పరతయును,సత్య ప్రకటన ప్రయత్నమును మనము గ్రహించి యభినందించ వలయును. వీరి గ్రంథమును రెండు భాగములుగా ప్రకటించిరి.

మొదటి భాగము —1 వ ప్రకరణము—బాల్య దశ—-1848–1860
2 వ ప్రకరణము—విద్యార్థి దశ —1860—1870
3 వ ప్రకరణము—ఉపాధ్యాయత్వ,పత్రికా విలేఖరిత్వ దశ —1870—1880
4 వ ప్రకరణము—స్త్రీ పునర్వివాహ సంస్కార ప్రయాస దశ —1880—

రెండవ భాగము —1వ ప్రకరణము—పుర మందిరాదిక నిర్మాణ దశ
2 వ ప్రకరణము—-గ్రంథ కర్తృత్వ దశ
3 వప్రకరణము— విశ్రాంతి దశ
4 వ ప్రకరణము—అసహాయ దశ

మొదటి భాగము

మొదటి భాగము—(1 ప్ర)పని చేసి చూపవలెనన్న ఆశయమే కాని ,దానిని వివరించి చెప్పి కీర్తి నాశించు నుద్దేశ్యము తనకు లేదట .

జన్మ స్థలము—నన్నయ పుట్టిన గోదావరీ తీర మందలి రాజమహేంద్ర వరము.తండ్రి గారి స్వగృహము. 1848 స0 ;ఏప్రిల్ 16న–. కీలక నామ సం:శుద్ధ త్రయోదశి ,భాను వారము –జన్మ దినము. గృహము చాలా పెద్దది. పెత్తండ్రి గారితో కలిసి ఉండేవారు. ఆ గృహ నిర్మాత వారి తాత గారు. సంస్థానాధీశుల దగ్గర దివానుగా నుండెడి వారు. పెక్కు కావ్యములను,శైవ గ్రంధములను కృతిగా

బడసిన వారు. తాత వీరేశలింగ నామధేయుడు. ధర్మాత్ముడు. భూదానాదులు చేసి,కీర్తి బడసిన వాడు. మనుమడు గారాబము గాను, సుకుమారము గాను పెరిగిన వాడు.వీరి తాత గారి స్వస్థలము ఏలూరు. పూర్వులు వీర శైవులై, లింగ ధారు లైనను, వీరి తాత గారు లింగ ధారణ మాని,వైష్ణవులతో సత్సంబంధము నంగీకరించిరి. ఆ సంస్కారమే వీరేశ లింగము గారికి వచ్చినది. వీరికి మొదట జాతకము లందు నమ్మకము కలిగినను,తరువాత ఆ నమ్మకమును వదిలి వేసిరి. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. వీరి పూర్వులు నెల్లూరు మండలము నందలి కందుకూరు వారై యుందురు. తాత గారి జనని—అక్కమ్మ గారు. భార్య—కామమ్మ గారు. జ్యేష్ఠ పుత్రుడు—వెంకట రత్నము గారు. ద్వితీయ పుత్రుడు—సుబ్బారాయుడు గారు. వీరు ద్వితీయ పుత్రుని ద్వితీయ పుత్రులు. ధనము సంపాదన తగ్గి పోయిన తరువాత,వీరి తండ్రియు,పెత్తండ్రియు ఉద్యోగములను చేయ సాగిరి. వీరి నాలుగవ ఏట తండ్రిగారు పరమ పదించిరి. అందుచేత ,వీరు తమ పెత్తండ్రిగారి పెంపకమున నతి గారాబముగా పెరిగిరి. కొంత చదువు నక్కడక్కడ నేర్చినను ,సంస్కృ తాంధ్రములను చక్కగా గ్రహించ గలిగిరి.పెత్తండ్రి గారే ఇంగ్లీషును నేర్పిరి. 1860 లో వీరు మండల పాఠశాలలో ఇంగ్లీషు నేర్చుటకై చేరిరి. వీరి శరీరము బలహీనముగా,పీలగా నుండెడిది.వీరు చదువు నందు శ్రద్ధ లేకున్నను,రెండు మూడు సార్లు చదువగానే,అన్ని పాఠములను చెప్పగలిగెడి వారు. వ్రాత యందును వీరు కుశలులే.

బ్రహ్మోపదేశము తరువాత త్రికాల సంధ్యావందనమును, సహస్ర గాయత్రిని శత వారములు పైగా చేసెడి వారు. గోదావరీ తీరమున సూర్యునకు సాయంసంధ్యలో అర్ఘ్య ప్రదానమును చేసి, మార్కండేయ స్వామి ,వేణుగోపాలస్వామి దేవాలయములకు పోయి,శ్రద్ధతో నర్చించెడి వారు.శ్రోత్రి య బ్రాహ్మణ వేష ధారణమును ,శివ రాత్రికి జాగరణములు చేసెడి వారు. ఋషులవలె తప మాచరింపవలెనని చింతించెడి వారు. భారత,భాగవత గ్రంధము లందలి కొన్ని ఘట్టము లందు వీరి కత్యంత ప్రీతి యుండెడిది. వీరికా పిన్న వయసులో దేహ బలమెంత తక్కువగా నుండెడిదో,బుద్ధి బలమంతా ఎక్కువగా నుండెడిది . వీరికా పిన్నవయసు నందున్న గ్రహణ,ధారణా శక్తు లసాధారణ మైనవి.కాని ,శ్రమపడి యలవాటు వారి కుండెడిది కాదు.

2. రెండవ అర్ధ సంవత్సరము నందు పాఠశాలలో చేరినను,చివరి పరీక్షలో అందరి కంటే ప్రథముడిగా నిలిచి,బహుమానము నందుకొనిరి. ఇంటి వద్ద గల పలు తాటాకు గ్రంథములను వారు శ్రద్ధగా చదువ గలిగిరి. వారికి ఆంధ్రము నందత్యంతాభిమాన ముండెడిది. ఇంగిలీషు చదువ నందుకు తల్లిగారు కోపించి,ఇతర ఉపాధ్యాయుల దగ్గరకు వారిని పంపి,చదివించి నారు.వారు పాఠశాలలోనూ ఆంగ్లమునందు ప్రావీణ్యమును కలిగి యుండెడి వారు.వారు ఏక,ద్వి సంధాగ్రాహులై,గువారి బుద్ధి కుశలత కుద్యోగ శీలత తోడు పడిన పక్షమున నత్యధిక ప్రయోజనము చేకూరెడిది వీరికి పురాణము లన్న నమ్మకము. తానును తప మాచరించి, గొప్ప శక్తులను సంపాదించవలెనని ఆశించెడి వారు. మరి ముగ్గురితో కలిసి,హిమాలయముల కేగి,తపస్సు చేయ తలపెట్టి,ఆది లోనే ఆటంకమును పొందిరి. నాటి వారి కందరికిని ఆచార పిశాచము లావేశించి,యుండెడివి . నాడు బాల్య వివాహములు లేవు.

వివాహము నాటికి వీరి వయసు 12 సం :లు. భార్యకు 8 ఏళ్ళు. ఆమె కాతేరు వాసి. దగ్గర చుట్టము తాలూకు పిల్ల. పేరు బాపమ్మ. వీరి తల్లి గారీ పేరును రాజ్య లక్ష్మీగా మార్చి వైచిరి. 1861లో గృహస్థాశ్రమము నందు వీరు ప్రవేశించిరి. వీరి తల్లికి ,పెత్తల్లికి ఇంటిలో పోరు ఉండెడిది. ఆభిజాత్యము, ఆగ్రహము అధికమై —చదువు మృగ్య మగుట వలన తరచుగా నిండ్లలో ఈ రీతిగా కలహములు సంభవించు చుండెడివి. కావున స్త్రీ లందరు విద్యావంతులు కావలెనని వీరు ప్రథమము

నుండియు ఆశించెడి వారు. వీరి తల్లి కోపించి,కలహించినను,అది త్వరలో మరచి కలసి మెలసి మసలు కొనెడిది. ఆమెకు పరోపకార చింత ,దయా గుణమధిక మగుటచే వీరికిని ఆ సద్గుణము లలవడినవి. వీరి తండ్రి గతించిన తరువాత,పెత్తండ్రి గారు నిస్సంతు గాన ,వీరిని తన పుత్రునిగా భావించి,ప్రేమను పంచి,సకల సహాయముల నొసగి పెంచెడి వారు. 1862లో స్త్రీల కలహములు నాపుటకు ఆస్తి పంచి నట్లుగా పత్రములు వ్రాసి చూపించి,చివరకు ఆస్తిని వీరికే దక్కు నట్లు చేసిరి.

వీరి పెత్తండ్రి గారు పేరు చోట్ల నుద్యోగము చేయుట కేగినను,వీరి తల్లిగారు పొదుపుగా నిల్లు నడిపి, అప్పులు లేకుండు నట్లుగా చేసి,సమర్థ వంతముగా గృహ కృత్య నిర్వహణమును గావించినది. ఆంధ్ర భాష యందలి ప్రేమ చేత తమ ఇంట కానరాని వసుచరిత్ర పఠనకు తన జీతమును పాఠశాలలో కట్టక, దుకాణము నందు కట్టి,ఆ పుస్తకమును చదువగా మొదలిడిరి. పాఠశాలను మానుటను తెలిసికొన్న తల్లి వీరిని మందలించి,ఆ పుస్తకమును కొని ఇచ్చి,వీరిని తిరిగి పాఠశాలకు పంపెను. వీరికి శైశవము నుండియు దగ్గు,అజీర్ణాతిసార దోషములు బాధింప సాగినవి.దేహ దార్ఢ్యత తక్కువ. బక్క చిక్కి పోయి, ఉండెడి వారు. వైద్యములు సాయపడలేదు. ఏదో రీతిగా కూరగాయల వైద్యము వీరిని రక్షించ గలిగినది. 1865లో వ్యాధి నెమ్మదించెను. ఆలస్యముగా పాఠశాలలో చేరినను,మిగిలిన వారి కంటే వీరికి వంద మార్కు లెక్కువగా వచ్చినవి. ప్రథముడుగా నిలిచి, తరువాత కాల మంతయు జీతము కట్ట నక్కర లేకయే చదువు సాగించ వచ్చునను బహుమానము వీరికి లభించినది. వీరు 4 వ తరగతిలో ఉండగా అందరి ఆదరాభిమానములను సంపాదించు కొనగలిగిరి. విద్యార్థు లందరు వీరిని అధికముగా ప్రేమించు నట్లుగా చీటీలు వ్రాసి,వీరికి బహుమతి వచ్చునట్లుగా చేసిరి.

వీరి వయస్సు 18 దాటకున్నను తనకు 19 సం . ల వయసుగా తెలిపి,సర్వ కళాశాల పరీక్షను వ్రాసి,వీరు ద్వితీయ స్థానమున నిలిచిరి. నాటి ఉపాధ్యాయులను వీరి నతిగా ప్రేమించి,గౌరవించెడి వారు. తెలుగు,లెక్కలు ,ఇంగ్లీషు పాఠములను వారు తరగతుల వారికి వీరిచే బోధింప జేసెడి వారు. దాని వలన వీరి యందభిమానము పెరిగెను. వీరికి జ్ఞాపక శక్తి అధికము. ఏ విషయమునైనను ఒక సారి వినగానే గ్రహించి,ఇతరు లడిగినచో చెప్ప గలిగెడి వారు. వరుసగా రెండేళ్లు ప్రథముడిగా నిలిచిన వీరి కనేక పుస్తకములు బహుమానముగా వచ్చినవి. 1867లో వీరు 5 వ తరగతి యందుండెడి వారు. పెత్తండ్రిగారు పరమ పదించగా వీరికి చదువు సాగలేదు. ఆదాయము సరిగాలేదు. కావున తల్లిగారు వీరిని ఉద్యోగము నందు చేరమని వత్తిడిని చేయ సాగిరి. ఎంత యత్నించిననూ సరియైన ఉద్యోగము లభించక,తిరిగి వీరు చదువు సాగించ వలసి వచ్చినది. 1868 లో మరల పాఠశాలలో చేరినను,వీరి చదువు సాగ లేదు.పెత్తల్లి వీరి ఇంటి భాగము నమ్మగా, వీరి తల్లి వ్యాజ్యము వేసి, ఓడిపోయి,ఖర్చులు ఎక్కు వయ్యెను.

యీవరకే వీరికి తెలుగునందు కవిత్వము వ్రాయు శక్తి లభించెను. పద్యముల ననేకము వ్రాసిరి. భక్తి యధిక మగుటచే మార్కండేయ శతకము,శ్రీ వేణు గోపాల శతకమను రెండు గ్రంధములను వ్రాసిరి. దోషము లుండునని వీరా పుస్తకములను ప్రకటించలేదనిరి. వీరికి శివ కేశవుల యందు సమాన అభిమానము కలదు. వేదాంతమందెక్కువ అభిరుచి ఉండెను.మంత్ర ప్రభావమును నమ్ముటచే గాయత్రి,ఆంజనేయ,శ్రీరామ జపములను తీవ్రముగా చేసెడి వారు.వీరికి దయ్యములను చూడవలెనను ఆశ మిక్కుటముగా నుండుటచే, చాలా సార్లు అర్ధ రాత్రమున స్మశాన వాటిక లందు సంచరించెడి వారు. కానీ, దయ్యములు కాన రాలేదు. వీరికి ఆది నుండియు స్వంత ఆలోచనయే ప్రధాన మైనది. ఇతరుల అభిప్రాయములను లెక్కగొనెడివారు కాదు. వీరు కేశవ చంద్ర సేన్ గారి

ఉపన్యాసములను కొన్నిటిని చదివిన తరువాత –వీరు సత్యము లని నమ్మిన యనేక విషయములందు సందేహము కలిగెను. అప్పుడొక అధ్యాపకుని ద్వారా బ్రహ్మ సమాజ మతము నందలి సిద్ధాంతములను గ్రహించి, వానిపై వీరు మిత్రులతో చర్చించి,వేరొక సమాజమును వీరేర్పరచుకొనిరి. 1869 లో వీరికి దగ్గును,దౌర్బల్యమును హెచ్చయ్యెను. వీరా యేడు సర్వ కళాశాల ప్రవేశ పరీక్షలో కృతార్థులు కాలేదు.

వీరందరూ పోవు త్రోవను పోక, తన వ్యక్తిత్వమును తెలుపు ప్రత్యేక రచనలను చేయ వలెనని తలచెడి వారు. అందుచేత, వీరు నిర్వచన,నిరోష్ఠ్య ,అచ్చతెనుగు—ఈ మూడును కలసిన కావ్య మొక్కటి వ్రాయ సమకట్టిరి. అదియే శుద్ధాంధ్ర నిర్వచన,నిరోష్ఠ్య నైషధ కావ్యము. రసిక జన మనోరంజనమను మరొక మిశ్ర ప్రబంధమును కూడా వీరా కాలమునందే రచించిరి. నెలకు 20 రు/లు వేతనంపై ఇంగ్లీషు నందుత్తర ప్రత్యుత్తరములు జరుపుటకు వీరొక ఉద్యోగము నందు చేరిరి. ఆ ఉద్యోగమ నిచ్చిన కామరాజు గారు వేశ్య నుంచుకొనుటచే, వేశ్యా వృత్తిని గర్హించు వీరా ఉద్యోగమును మొదటి నెల జీతమును గ్రహించి నంతనే విరమించు కొనిరి. తరువాత బారో దొరకు,కెప్టెన్ హాలెట్టు దొరకు తెలుగు బోధించుటకు 30 రు .ల జీతముపై చేరిరి. 1869 లో వీరు పరీక్షకు పోలేదు. 1870 లో బారో దొర ప్రకటించు చుండిన గోదావరీ విద్యా ప్రబోధిని అను మాస పత్రికను వీరు తెలుగులో వ్రాయు చుండిరి. 1870 లోనే వీరు సర్వ కళాశాల ప్రవేశ పరీక్ష యందుత్తీర్ణు లైరి. 16–20సం /ల మధ్య మిత్రుల ద్వారా మంచి కానీ,చెడు కానీ అలవాట్లు ఏర్పడుట సహజము. వీరును, ఆ ఇంట నుండ వచ్చిన వీరి బంధువుల కుమారుడును సమ వయస్కు లగుటచే కలసి ఆట లాడెడి వారు. అందు చీట్లాట,చదరంగముమొదలైన ఆటలు కలవు. ముందు ఊరికే ఆడినను తరువాత డబ్బుతో ఆటలాడ మొదలిడిరి. అలా ఆడుచు ఒకనాడు వీరిని బంధు మిత్రు డొకడు వేశ్యా గృహమునకు కొని పోయెను. వెంటనే వీరు తెలివి తెచ్చు కొని, అతనితో ఆట లాడుటను మాని వేసిరి.

(1870—1880) (3) 1870 లో బారో దొరగారు కళ్లికోటకు బదిలీ యైరి. 1871 లో వీరు ప్రథమ శాస్త్ర పరీక్ష తరగతిలో చేరినను,తరువాత అవి మూయబడుటచే,వీరి చదువు ఆగి పోయెను. 1871 లో వీరు రాజమహేంద్రవరం ప్రభుత్వ మండల పాఠ శాలలో సహాయోపాధ్యాయుడుగా చేరిరి. పక్షపాత రహితముగా వారీ ఉద్యోగమును చేసెడి వారు. సహ ఉపాధ్యాయుని తమ్ముని తప్పు చేసినందుకు దండించుట వారి నిబద్ధతకు తార్కాణము. ఆ పనిని తన మిత్రుడును,ఆ విద్యార్థియు సమ్మతించిరి.హర్షించిరి. బాలురకు నీతి వర్తన,మంచితనముకూడా వీరు బోధించెడి వారు.

న్యాయవాది కావలెనన్న ఆశయముతో వీరు 1871 లో దండ శాసనోన్నత పద పరీక్ష (క్రిమినల్ హయ్యర్ గ్రేడు) కు పోయి, ఉత్తీర్ణులైరి. (1872 లో). ఆ నాటికి వీరికి మూఢ నమ్మకములు పోయి,దయ్యాలు,జ్యోతిష సాముద్రికములను వీరు నిరసించిరి. వీరి తల్లిగారు దయ్యము తనకు పట్టినదని నమ్మి,మంత్రగానిచే నయము చేయించు కొనెడి వారు.ఒకసారి మంత్రగాని మోసమును,లోటుపాట్లను వీరు బయట పెట్టి,నిరూపించి,తల్లిగారి కున్న అనుమానమును నివృత్తి చేసిరి. 1872 లో కోరంగిలో 30 రు .ల జీతముపై ఇంగ్లీషు పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా జేరిరి. అచ్చట చేరుటకు వీరు అమావాస్య నాడు బయలు వెడలిరి. బందరు నుండి వెలువడు పురుషార్థ ప్రదాయినికి గ్రంధములను వీరు వ్రాసి,పంపెడివారు. వీరి మూడవ రచనయైన శుద్ధాంధ్ర ఉత్తర రామాయణమును ప్రారంభించిరి. వీరి అచ్చ తెనుగు సభాపర్వమును కొక్కొండ వెంకట రత్నము పంతులుగారు మదరాసు నుండి ప్రకటించిరి. ఆంధ్ర భాషా సంజీవినిలో ప్రకటించ బడినది.

వీరు కోరంగిలో నుండగా,విశేష పరీక్షలలో ఒకటియగు రెండవ తరగతి భాషాతరీకరణ పరీక్ష (ట్రాన్స్లేషన్ లోయర్ గ్రేడ్)కు 1872లో ఇంగ్లీషు ,తెలుగు భాషలయందు కృతార్థులైరి.1874 లో వీరు తిరిగి ధవళేశ్వరంలోని ఆంగ్లో దేశ పాఠశాల యందు 44 రు .ల జీతముతో ప్రధానోపాధ్యాయునిగా చేరిరి. స్త్రీలను విద్య నేర్వ రాదని వ్రాయుచున్న కొక్కొండ వెంకట రత్నము పంతులు గారి వాదమును వీరు ఖండించి,స్త్రీల పక్షమున వాదించుచు,పురుషార్థప్రదాయిని యందు వ్రాయుచుండెడి వారు. కొన్ని ప్రత్యుత్తరములను పద్య రూపమున కుడా వ్రాయు చుండెడి వారు. ఈ వాదనల యందు అసలు విషయ విమర్శను వీడి,అన్యోన్య దూషణమునకు దిగుట పరిపాటిగా నుండెడిది. పంతులు గారి దూషణము కటువుగా నుండగా, వీరి దూషణము కించిత్తు మార్దవముగా నుండెడిది. వారు కృతి విమర్శనీ సమాజము పేరున వీరేశలింగము గారి కృతులను విమర్శించగా, వీరు గుణాగుణ ప్రదర్శనీ సమాజమను పేర వానిని తరచు ఖండన చేసెడి వారు. తరువాత కాలమున వారి ఆ కలహ రచనలకు సిగ్గుపడి పోయిరి. అయినను,వీరిరువురు పరస్పర సుహృద్భావముతో ఉత్తర ప్రత్యుత్తరములను జరుపు కొనుచుండెడి వారు.

1875 లో వీరు సంక్షేప లేఖన పరీక్ష యందు (ప్రిసైజ్ రైటింగ్)ఇంగ్లీషు భాషలో కృతార్థులైరి. ఈ పరీక్షను రాజమహేంద్రవరమున వ్రాయు సందర్భమునందు మెట్కాఫ్ దొర గారి పరిచయ భాగ్యము వీరికి కలిగెను. కుప్పు స్వామి శాస్తుల వారు చెప్పుటచే మెట్కాఫ్ దొరగారి ఒక వాక్యార్థ విషయ సందేహమును సంతృప్తి కరముగా వీరు తీర్చుట చేత, వారు సంతుష్టులై,వీరి యందు సదాభిప్రాయము నేర్పరచుకొనుట జరిగినది.వీరు ప్రవేశ పరీక్షలలో నుత్తీర్ణు లగుట చేత సబ్ మేజిస్ట్రేట్ పదమున కర్హు లైరి. మరొక పరీక్ష వ్రాసిన,వారికి డెప్యూటీ కలెక్టర్ పదవి లభించెడిది. సివిల్ హయ్యర్ గ్రేడ్ పాసయిన వీరికి సబ్ జడ్జ్ పదవియు దొరకెడిది.వీరికి న్యాయవాద విషయిక ఉద్యోగము నందు ఇష్టము లేదు. అందులో న్యాయమునకు సరియైన నిర్ణయము దొరకదని వారి అభిప్రాయము. సాక్షుల వాఙ్మూలము పైననే సత్య మాధారపడుట వారికి నచ్చి యుండలేదు. పాప కార్యముల కంతగా నవకాశము లేని అధ్యాపక వృత్తి యందే వారి కభిమాన ముండి ,అందే కొనసాగ వలెనని నిశ్చయించుకొనిరి.

స్త్రీ విద్యాభివృద్ధిని గూర్చి చేయు తమ ప్రచారమునకై స్వంత పత్రిక నొకటి స్థాపించ దలచి,1874లో వివేక వర్ధని యను 4 పేజీల మాస పత్రికను వీరు ప్రారంభించిరి. అది చెన్నపట్టణము నందలి కొక్కొండ వారి ముద్రాక్షర శాల నుండి ముద్రించబడెడిది . తరువాత శ్రీధర ముద్రాక్షర శాలయందు 17 పేజీలు గల పుస్తకముగా వెలువడ జేయ బడినది. ఈ పత్రిక ద్వారా నీతిని,భాషాభివృద్ధిని ,దేశాభివృద్ధిని చేయ దలచినట్లు వారు పద్యమున ప్రకటించిరి. తెలుగు భాషలో మృదువైన,సులభ శైలిని,సలక్షణమైన వచన రచన జేయుట ,జనులలో గల దురాచార దుర్వర్తనములను ఖండించి ,యధిక నీతి మంతులను చేయుట,జనుల ద్వారా వీరట్టి యభివృద్ధి సాధింప నెంచిరి.శక్తి వంచన లేక విద్య,వ్యవహారములు,కులాచార విషయములు,నీతి విషయము లందు నానా ముఖముల కృషి చేయుటతో పాటు,రాజ్యాంగ విషయములను వీరు చర్చించి,తగు రీతిగా ప్రగతి సాధింప నుద్యుక్తు లైరి. పన్నులు,దోషులను దండించు న్యాయ శాస్త్ర శాసనములు,ఉద్యోగులు లంచములు గొనుట,వేశ్యా వృత్తి,పోషణ నిరాదరణము,సత్ప్ర వర్తన,పరిశుద్ధ మత సిద్ధాంత బోధ మొదలైనవి చర్చించ బడినవి. ఆస్తిక్యము,వివేకము,సత్యాహింసలు–వీనిని గూర్చి ఉపన్యాసములీ వివేకవర్ధని యందు ప్రకటింప బడెడివి. 3 సీసపద్యములలో వీరు తమ అభిప్రాయములను వ్యక్తీకరించి,3 ప్రతులలో ప్రకటించిరి. అందుచేత, రాజకీయోద్యోగులకు,శృంగార

నాయకులకు,పూర్వాచార పరాయణులైన పామర జనులకు ఈ పత్రిక యెడల కోపము సహజముగా వచ్చెడిది. బాలికల విద్యను గూర్చి,వీరు ధవళేశ్వరములో చేయు ప్రసంగముల వలన ఈ ఉద్యమమునకు ఊతము వచ్చెను. విద్యాధికులును ఈ విషయమై ప్రోత్సాహమును జూపిరి.అందు చేత 1874 లో ఒక బాలికా పాఠశాల స్థాపితమై ,చందాల ద్వారా నడిచి,తరువాత అభివృద్ధి చెంది,అవిచ్ఛిన్నముగా సాగు చుండెను.

వీరు పలు పద్యముల నలవోకగా గద్యము వలెనే చెప్పగలుగుటచే కొందరు వీరి నష్టావధానమును చేయుమని కోరిరి. ప్రథమ ప్రయత్నము నందు వీరు సఫలీకృతు లైరి.మరొక సారి చేయు మనగా,తరువాత వారాంతమున చేసెద నని చెప్పెను.ఆ వార్త అందరికిని తెల్ల మయ్యెను. నాడు వీరి మిత్రులగు వావిలాల వాసుదేవ శాస్త్రిగారు పద్యముల ద్వారా వీరిని ప్రశంసించిరి. సంస్కృతమున అనుష్టుప్ శ్లోకములు చెప్పగలిగినను,వారికా భాష యందంత పాండిత్యము లేదనుకొని,ఆ ప్రయత్నమును మానుకొనిరి. తరువాత కాలమున,వీరష్టావధాన ప్రక్రియను చేయుట మానివేసిరి.

వివేక వర్ధని పత్రిక కారు మాసములు వచ్చినవి. దుర్నీతి నివారణకును,వేశ్యల సంగతిని,పోషణను మాన్పించుటకును,లంచముల నిచ్చుట,అంగీకరించుట యను అలవాట్లను విరమింప జేయుటకును ఈ పత్రిక బహు విధముల పాటుపడుచుండెను. ఈ విషయములలో వారొక న్యాయవాదిని విమర్శించుచు –పత్రిక ద్వారా ప్రకటించిరి. దాని కతడు కోపించి, ప్రత్యపకారము చేయ నెంచి,తగిన సమయమునకు వేచి చూచు చుండెను.వీరి ఉప విలేఖరి మీద పరువు నష్టము దావా వేస్తానని బెదిరించగా, వీరేశలింగము గారు తాము సిద్ధమే నని తెలిపి,తమ కృత్యమును సమర్థించు కొనిరి. ఈ కార్యక్రమము వలన వీరి కనేకులలో కొందరు తమతో గల స్నేహ భావమును వీడి,విరోధించి,శత్రుపక్షము వారైరి. 1875 లో మిత్రులైన బసవ రాజు గవర్రాజు గారి ఆహ్వానముపై వారు స్థాపించు రాజమహేంద్రవర దేశ పాఠశాలా సమాజ ప్రారంభ దినమున రమ్మనగా వారు ధవళేశ్వరమునకు వచ్చి,"ఐకమత్యము"ను గురించి ఉపన్యసించిరి. (15-8-1875). వీరును ఆ సమాజమునందు సభ్యత్వమును స్వీకరించిరి.

అధికారులు,వారి క్రింద పనిచేయువారు లంచములను స్వీకరించుటను ఉద్యోగ లక్షణముగా తలచెడి వారు. పురుషులు వేశ్యలను పోషించుటయే మగతనముగా భావించెడి వారు. న్యాయాధిపతులను,న్యాయ వాదులను ఇట్టి కృత్యము లందుత్సుకతను కలిగి ఉండెడి వారు. మంచి పనులకు ,పేద పాఠశాలలకును చిల్లి గవ్వ నివ్వని వారు ఈ వేశ్యలకు నజరానాలు ఇచ్చుట తమకు గౌరవముగా తలచెడి వారు. పేద వారైనను అప్పులు చేసియో, వస్తువుల నమ్మియో—వారికి తరచు సమర్పించెడి వారు. కొందరు తరచుగా నీ వేశ్యల నృత్యములను ఏర్పరచి,క్రింది ఉద్యోగులను పిలిచి,ఆ వేశ్యలకు ధన సమర్పణ చేయించెడి వారు. అందులో కొంత వారు స్వీకరించి,మిగిలిన పైకమును మాత్రమే వేశ్యలకంద జేసెడి వారు. వివాహము లందు భోగము మేళములను పెట్టుటకు కూడా వీరి పత్రిక ద్వారా నిరసించి చెప్పి,ఆ యా దురాచారములను ఖండించెడి వారు. తరువాత వీరు అధ్యాపక వృత్తిని వీడి,పత్రికను నడుపుటయందును,గ్రంథ రచనము నందును తమ కర్తవ్యముగా భావించి,చేసి,సంఘ సంస్కరణము,భాషా సేవ నొనరింప నుద్యుక్తులైరి. విలేకరిగా సంపాదన చాల కున్నను,తమ గ్రంథముల ద్వారా లభ్యమైన ధనము కొంత చేయూత నీయ గలదన్న ధైర్యము వారిని ముందుకు నడిపినది. వీరి వ్యాకరణమునకు 200/రు .లు.నీతి చంద్రిక,విగ్రహముల ద్వారా 1000/రు .లును లభించినవి. ముద్రా యంత్రమును

కొనవలెనని –దానికి వలయు ధనమును 6 గురు మిత్రుల నుండి చందాలు వేసికొని ప్రయత్నించిరి. ఇందుకు వారి మిత్రులు శ్రీ చల్లపల్లి రంగయ్య గారు తోడ్పడిరి.

తరువాత,వేసవిలో వీరు మదరాసున కేగిరి. వీరి నీతి చంద్రిక,విగ్రహ రచనను మెచ్చి,బహుజనపల్లి సీతారామాచార్యుల వారు మొదలగు పండితులు–వీరికి సన్మాన మొనరించి,రజిత పాత్రను బహూకరించిరి.వీరికి వలయు సరుకులను,సదుపాయముల నన్నియు ఉచితముగా నేర్పాటు చేసిరి. ముద్రణా యంత్రమును,ముద్రణ అక్షరములను కొని,రాజమండ్రికి తరలించుటకు వీరికి మదరాసు మిత్రు లెంతయో సహకరించిరి. తరువాత వీరు ధవళేశ్వరము లోని అధ్యాపక వృత్తిని విరమించుకొని ,1876 లో రాజమహేంద్ర వరమునకు తిరిగి వచ్చిరి. తమ ఇంటి యందే ముద్రణా యంత్రమును నెలకొల్పి,వివేక వర్ధని పత్రిక నచట నుండియే ముద్రించెడి వారు. ఆదాయము పనివాండ్ర జీతములకే సరి పడక పోయెడిది. స్వంత ధనమును వెచ్చించ వలసి వచ్చెడిది. అందు చేత కొందరు మిత్రులు దూరమైరి. నరసాపురము మిత్రుడగు మీర్ షుజాయతల్లీ ఖాన్ సాహెబ్ గారు "విద్వన్మనోహారిణి"అను తెనుగు మాస పత్రికను ప్రారంభించి,1875 లో దానిని వివేక వర్ధనితో కలిపి వేసిరి. అందలి ఇంగ్లీషు భాగమును వారు వ్రాయగా,తెనుగున వీరు వ్రాసెడివారు. 1876 జులై నుండి వివేక వర్ధనిని పక్ష పత్రికగా ప్రచురింప మొదలిడిరి. హాస్య సంజీవని అను నొక యనుబంధ పత్రికను కూడా ఆ నెల నుండే ప్రారంభించి, హాస్య ప్రియుల నలరింప సాగిరి. వీరికి ప్రత్యర్థిగా శ్రీ కొక్కొండ వెంకట రత్నం పంతులు గారు హాస్య వర్ధని యను పత్రిక నారంభించిరి.(1875). వీరి బ్రహ్మ వివాహ మను రచన హాస్య సంజీవని యం దే ప్రకటించిరి. అట్టి రచనా ప్రక్రియ కదే ఆరంభ మగుటచే పలువురు అభిమానులు దానిని చదివి,యానందింప సాగిరి. వీరా కాలమున ఒకసారి బందరుకు పోవుట తటస్థించినది. అచట నొక బ్రాహ్మణ బాలిక బ్రాహ్మ వివాహమును మొదటి నుండి తుద వరకు అప్పగించుట ,వీరి నాశ్చర్య పరచిన ది. దాని వలన,ఆ రచన కానాడు ఎంత ప్రాచుర్యము లభించిందో తెలియ వచ్చును. దురాచార దుర్నీతి భంజనకై హాస్య సంజీవనియు వివేక వర్ధని వలె అత్యంత ఉపయోగకర మైనది.

స్త్రీ విద్య కూడదని కొక్కొండ వారు వ్రాయగా,దానికి ఖండనగా వీరు హాస్య సంజీవని యందు హేతు బద్ధముగా స్త్రీ విద్యను,అభివృద్ధిని సమర్థించుచు రచనలు చేసెడి వారు. "పురుషులకు విద్య కూడదు"అని కూడా నిరూపించి వ్రాసెడి వారు. 1876 లో వీరు తిరిగి రాజమహేంద్ర వరము నందలి రాజకీయ పాఠశాలలో నెలకు 20/రు .ల ఆంధ్ర ద్వితీయోపాధ్యాయ పదము నందు చేరిరి. 1877 లో ఆ పాఠశాలలో పట్ట పరీక్ష తరగతి కూడా ప్రారంభింప బడెను. ఈ కాలమున వీరి కింకెందరో మిత్రు లేర్పడిరి. శ్రీ బుర్రా రామలింగం గారు,చల్లపల్లి బాపయ్య గారు,ఏలూరి లక్ష్మీ నరసింహం గారు ,న్యాయవాది చిర్రావూరి యజ్ఞన్న శాస్త్రి గారు,బసవరాజు గవర్రాజు గారు —ఇత్యాది మిత్రులు వీరి పత్రికా రచనకు ప్రోత్సాహ మొసగిరి. కొందరు వీరిని దుష్ట చతుష్టయమని కూడా హాస్యము చేసెడి వారు. 1878 జనవరి వివేక వర్ధని పత్రికలో వివాహాదుల యందు తాంబూలమునకు వచ్చువారు వసూళ్లు వేయు దురాచారమును ఖండించుచు,తీర్మానమును వ్రాసిరి. కొందరీ తీర్మానము నంగీకరించియు,వారా తీర్మానము నతి శీఘ్రముగా నతిక్రమింప దొడగిరి. ఈ రెండు ప్రత్రికలును ప్రతి వాదుల ప్రచారమును నిరసించి, ఖండించు పాత్రను చక్కగా పోషించు చుండెడివి. పంచ రత్నములను పేరున వీరి ఖండన వివరములను పంచ విషయిక విమర్శనగా ప్రకటించిరి. అవి సదాచార ప్రతిష్ఠాపన కైన మంచి హేతు రత్నములై యున్నవి.

వాలెస్ దొర గారానాడు మండల న్యాయాధిపతిగా నుండెడి వారు. ఆనాడు కొందరు పరీక్ష యందుత్తీర్ణులు కాని కొందరికి న్యాయవాద పట్టాల నొసగిరి. అది తప్పని, అనర్హుల నట్లు ప్రకటించుట దోషమని వివేక వర్ధని యందు వీరు వ్రాసి ప్రకటించిరి. అధిక ధనమును లంచముగా స్వీకరించి ఇట్లు చేయుట తగని పని యని వీరు వాదించిరి. ఆ ప్రకటన పత్రికాధిపతి కావలెనని వ్రాసిన గర్వ కార్యమని తెలిపి,కొందరు న్యాయాధిపతికి కోపమును తెప్పించిరి. అందుచేత,వారు సదరు పత్రికాధిపతి యైన వీరిని తమ ఎదుట హాజరు కావలెనని తాఖీదును పంపించిరి. వీరు మధ్యాహ్నము వారి కచేరీకి పోయి —ఏ సెక్షన్ల ప్రకారము వారిని పిలిపించారో తెలుపుమని కోరిరి. వారు ఆ రాతలను పత్రికలో వ్రాసినది మీరేనా చెప్పుమని అడిగిరి. ముందుగా తమ రడిగిన దానికి సమాధానమును చెప్పినచో, వారు బద్ధులైనచో జవాబు చెప్పగలమని వీరేశలింగము గారు పలికిరి. ఏమీ తేల్చకయే న్యాయమూర్తి వీరిని తిరిగి పంపి వేసిరి. దానికి వీరి ప్రత్యర్థు లందరు అవాక్కులైరి. వీరికే శిక్ష పడబోగలదని తలచిన వారందరికీ అసంతృప్తి కలిగించినదీ విషయము.

శ్రీ పోలూరు శ్రీరాములు గారు డిస్ట్రిక్ట్ మునసబు. వారి వియ్యంకుడు చిత్రపు కామరాజు గారు. వీరిరువురును లంచముల నాస్వాదించి,పేదలను సైతము బాధించుటకు వెనుకాడని వారు కారు .న్యాయవాదు లుదహరించు సెక్షన్లు సరియైనవి కాక,వారు తెలిపిన సంఖ్యలు వారు చెల్లించ బోవు రూపాయలను తెలుపును. ఎవరెక్కువ ధనమును చెల్లించిన,వారి కనుకూలముగా న్యాయ మూర్తి తన తీర్పును వెలువరించుట ఆ నాడు అలవాటులో నుండెను. కొన్నిటి తీర్పులను చిత్రపు కామరాజు గారిచే చిత్తు వ్రాయించి,సదరు న్యాయమూర్తి శుద్ధ ప్రతులను వ్రాసి,తీర్పులను వెలువరించు విధానము నమలు చేయు చుండిరి.ఈ విషయ సత్యమును సేకరించిన వివేక వర్ధని వారు దీనిని బట్ట బయలు చేసి,నిరోధింప యత్న మొనరించిరి. అందుచేత,కామరాజు గారు వ్రాసి,చించివేసి పారవైచిన తీర్పు కాగితపు ముక్కలను సంపాదించి,శ్రీ వీరేశలింగము గారే స్వయముగా మరొక న్యాయవాది సహాయముతో అతికించి,ఆ తీర్పును చదివి చూచిరి. అట్టి 4–5 లేఖలను తయారు చేసి,కొన్నిటిని విచారణ నిమిత్తము న్యాయ శాలలో ప్రవేశ పెట్టిరి. అయినను వేరొక లేఖను జాగ్రత్తగా తమ దగ్గర జాగ్రత్త చేసికొని యుంచిరి. లంచము నిచ్చిన వారు సాక్ష్య మిచ్చుటకు ఎవరును ముందుకు రాలేదు. ఆ లేఖలను విచారణ సమయమున తప్పించుటకై శిరస్తా దారు కచేరీలో దొంగతన మైనదని చూపించిరి. కానీ,తరువాత విచారణలో ఆ కాగితములు సరిగానే యున్నవనియు,మరి ఎవరి తప్పిదము లేదని అప్పటికా వ్యవహారమును ప్రత్యర్థు లాపు చేయించ గలిగిరి. తరువాత ఆ దొంగతనమును గూర్చి వీరేశ లింగము గారు పోలీసు అధికారులకు అభియోగమును పంపి,వారి నందరిని అరెస్టు చేయించి జైలులో బంధింప జేసిరి. తరువాత,వీరేశలింగము గారు తమవద్ద నున్న అతికించిన తీర్పు కాగితమును మండల న్యాయాధీశులైన వాలేసు దొర గారికి చూపి,ఆ వ్రాత చిత్రపు కామరాజు గారిదే నని నిరూపించ గలిగిరి.సదరు న్యాయవాదికి శిక్ష పడునట్లు చేయ గలిగిరి. పోలీసువారు యువతులతో చేయు దుష్కర్మలను వెలికి తీసి,వారికి తగిన శిక్షను పడునట్లు చేయుటలోను వీరు కృతకృత్యులైరి. ఈ విధముగా సంఘములో జరుగు దుష్కృత్యములను,దురాచారములను,మోసములను,అవినీతిని ప్రతిఘటించి,సంస్కరించు ప్రయత్నములో వీరి వివేక వర్ధని పత్రిక,హాస్య సంజీవని చాలా ఉపయోగపడినవి. ధనాశచే ప్రతి పక్షము వారికే సాయ పడుచు,ఎవరికే రకమైన ఆశ చూపించ దగునో,ఆ రీతిన వారి కందజేసి, తమ దుష్ట కార్యములను ఫలవంతము చేసికొను వారెక్కువైనారు. వీరు తమ వద్ద నున్న చిత్తు వ్రాత ప్రతిని ఇచ్చివేసిన అధిక ధనమొసంగెదమని ఆశ చూపినను,

వీరు లొంగక పోయిరి. ఈ వ్యవహారములో విచారణను చేపట్ట వలసినదని చెన్నపురి దొరతనము వారు ఉన్నత న్యాయ సభకు వ్రాయగా —ఈ విచారణ జరుగుట సిద్ధించెను. శారీరక బలము తక్కువైనను,సంఘము నందు సాయపడి,సాక్ష్యమును చెప్పువారు కరవైనను,ధన బలము గల ప్రత్యర్థులు ఎక్కువ యున్నను— న్యాయ ధర్మ పరిరక్షణకు వీరు తమ పత్రికను సాధనముగా చేసికొని,నిర్మొహమాటముగా చెడును చెండుచు, నిరంతర యత్న మొనరించుట మాన లేదు. తమకు న్యాయ రక్షకుడును, సత్య పోషకుడగు పరమాత్మయే తప్పక సాయపడు నని జయము కలిగించునని నమ్మిన దృఢ విశ్వాస మొక్కటియే వారిని ముందుకు నడిపించ గలిగినది.

1878 లో వీరు స్థాపించిన ఏకేశ్వర ప్రార్థనా సమాజమును పలువురు హేళన చేసినను,అందలి ప్రార్థనా విషయములను ,విధానములను తెలిసికొన్న వారు చాలా మంది దీనిలో సభ్యులై,--దీనికి అభివృద్ధిని చేకూర్చిరి. అందులో శ్రీ పార్థ సారథి నాయుడు గారు కీర్తనలను పాడగా,వీరు చిన్న ధర్మోపదేశములను వ్రాసి,చదివెడి వారు. దురాచారముల కలవడిన వారును,ఈసమాజ ప్రభావము వలన సంస్కరింప బడి,సదాచారముల నలవరచుకొనుట శుభ పరిణామమై యొప్పినది.(ఉదా– శ్రీ నండూరి జగ్గరాజు గారను నియోగి బ్రాహ్మణుడు,విధవలతో సంబంధి).కొందరు పెద్దవారైన స్త్రీలును దీని యందు ప్రవేశించిరి. వ్యాపారులు సహితము తమ దుకాణములను మూసి, ఈ ప్రార్థనల యందు పాల్గొనుట ముదావహము. ఈ సమాజము ద్వారానే పూర్వాచార పరాయణులలో మార్పు కలిగి,కుంటికి,గ్రుడ్డికి చేయునదే ఉత్తమమైన దానమను జ్ఞానమును బడసిరి. బీదలకు రాత్రి పాఠశాలలను స్థాపించుట మొదలయినవి. ఈ రీతిగా వీరి కార్య క్రమములు,వీరి పత్రికల ద్వారా దురాచార నిర్మూలన యత్నములు,సత్య ధర్మ పరిరక్షణ సంస్కరణలు ఆచరణ సాధ్య మైనవి. వీరి సంకల్ప బలము,ఈశ్వర కృపా విశ్వాసము,కార్య నిరతి—సఫలీకృతమైనవి.

4)1880-1890=అతి బాల్యవివాహములు,అతి వృద్ధ వివాహములు ,కన్యాశుల్కము –మొదలగు వాని యనర్థములను బోధించుటకై బ్రాహ్మ వివాహము ప్రకటించ బడినది. దానిని చదివినన వారికి కేవలము వేడుక కలిగినదే కాని ,మరే ప్రయోజనము చేకూర లేదు. ఆచరణ లేక,ఉపన్యాసముల వలన ఫలితము లుండవు. వీరును ,మరి ఇరువురును సంస్కరణలు చేసి చూపించ వలెనని తలచినను ,అందుకు వలయు మార్గము కానరాలేదు. బాల్య వివాహములను మాన్ప వలెనన్నను అట్లు పెండ్లి చేయకుండా ఉంచిన మాత్రమున ఫలమేమియు లేదు. ఎవరిని దీనికి బద్ధులను చేయ వలెనో–అదియును లభ్య పడలేదు. పిన్న వయసు వారిని వృద్ధులకిచ్చి వివాహము చేయుట నాపిన గాని కార్యము సిద్ధించబోదు.పూర్వాచార పరాయణులు,పీఠాధిపతుల మాట వినెదరు. కాని ,ఆ పీఠాధిపతు లిట్టి పనులను ప్రోత్సహించుటకు ముందుకు రారు. వీరి మిత్రుడు (శ్రీ బసవరాజు గవర్రాజు గారు)బాల్య వివాహము చేయనని వాగ్దానము చేసినను, వారి కకాల మరణము సంభవించి,ఆ కార్యము నెరవేర లేదు.శాఖా భేదము లేకుండా వివాహములు చేయించెద మన్నను,అదియు సంభవము కాలేదు. నియోగి,వైదీకుల మధ్య సంబంధములు చేయుద మన్నను ,మొదట ముందుకు వచ్చిన వారు —బంధువుల నిరోధ విరోధములచే నా కార్యమునకు సిద్ధ పడ రైరి.అట్టి వివాహములును చేయించు వారు ,సంభావనలను గ్రహించు వారును కానరారైరి. సంస్కార ప్రియులను ప్రోత్సహించు వారు లేకపోగా,వారిని హేళన చేయు వారెక్కువగా నుండిరి. ఆ నాడు వివాహమున కాహ్వానించుటకు గృహ యజమానులు స్వయముగా పోయి,పిలిచిన గాని బంధు గణము వచ్చెడి వారు కారు. శుభ లేఖలను పంపి,ఆహ్వానించుటను

వీరు ప్రవేశ పెట్టిరి. కొందరు ఆమోదింపక పోయినను ,మరి కొందరీ విధానమును సులభాచారణీ యమని అంగీకరించి,ఆదరించిరి.

శవములను మోయించుట,సరిగా పాతి పెట్టక పోవుట వలన అనర్ధములు కలుగు చుండగా, దీనిని సంస్కరింప వలెనని వీరు ప్రయత్నించిరి. ఒక బాల శిశువు మృత దేహమును కర్ర పెట్టెలో పెట్టి, ఆ యజమాని తన తోట లోనే పాతి పెట్టించి నాడు. ఆ పని నా రీతిగా చేసినందులకు ,వారి బంధువులును,మిత్రులను అనేక విధములుగా దూషించిరి. చిట్ట చివరకు వితంతు వివాహములు చేయుటయే నొక గొప్ప సంస్కారము కాగలదని యుద్దేశించి, దాని సాధనకై యత్నము లొనరించ మొదలిడిరి. బలహీనుడుగా నున్న శరీరమును కలిగియు,సంకల్ప బలముచే దీనిని సాధింప నుద్యుక్తుడు కావలసిన సమయ మాసన్నమైనదని వీరు తలచిరి. 1874 లో చెన్నపురిలో వితంతు వివాహ ప్రోత్సాహమునకై ఒక సమాజ మేర్పడి చాలా మందికి ప్రకటనలను పంపిరి.అవి వీరికి చేర లేదు.కానీ, మరి రెండు సంవత్సరములకే ఆ సమాజము విశ్రమించెను. 1875 లో స్త్రీ పునర్వివాహమును గూర్చి శ్రీ పరవస్తు వెంకట రంగా చార్యులు గారొక చిన్న పుస్తకమును వ్రాసి, ఆ పని శాస్త్ర సమ్మత మని ప్రకటించిరి. దానిని ఖండించ వలసినదిగా శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు వీరి కొక లేఖను వ్రాసి,తమ వాదనను ప0ప వలసినదిగా కోరిరి.కానీ,వీరి మనో భావము వేరుగా నుండెను.

బందరు నుండి వెలువడు పురుషార్ధ ప్రదాయినిలో సౌఖ్యార్ధి యను పేరున వితంతు వివాహమును గూర్చి వ్రాయ బడిన లేఖను వీరే వ్రాసి యుందురని తలచి, బ్రహ్మశ్రీ ధర్మవరపు రామకృష్ణాచార్యుల వారు బళ్ళారి నుండి వీరేశలింగము గారి కొక జాబును వ్రాసిరి. అట్టి వాదమును, స్త్రీ విద్యను గూర్చి ప్రజలు సద్భావముతో నుండక పోవుటచే, అప్పటికా వాదమును వాయిదా వేయదగునని దాని సారాంశము. వీరు అటులనే యోచించి,,తమ ప్రయత్నమున కనుకూల సమయము కొరకు వేచియుండి, అనుకూల సమయము రాలేదని చింతించ దొడగిరి.అదే సమయమున వీరి మిత్రులైన శ్రీ చల్లపల్లి బాపయ్య గారు స్త్రీ పునర్వివాహ విషయమున కృషి చేయుదమని ప్రోత్సాహ వాక్యములు పలికిరి.అటులయిన వారు తమ బంధువుల నిర్బంధమును లెక్క గొనక, ఈ కార్యక్రమములో తమ వెంట నడిచి,తప్పక ప్రోత్సహించెదరా– యని యడుగగా వారు సరే నని చెప్పిరి. అంతట,సభ ఆహ్వాన పత్రికను వ్రాసి అందఱకును పంపుట జరిగినది. అట్టి మహత్కార్యము భగవత్ప్రేరణయే నని వీరు నమ్మి యుండిరి. మానవుడు శక్తి వంచన లేక శ్రద్ధగా పని చేసి,ఫలితామా పరమాత్మపై నుంచుట ధీర లక్షణమని వీరు భావించిరి. ఈ విషయమును శాస్త్ర సమ్మతముగా తెలుపగల విషయములను నిర్ధారించు పొత్తములు వీరికి లభ్యము కాలేదు. కేవలము వీరి వద్ద మనుస్మృతియు, యాజ్ఞవల్క్య స్మృతియును ,పరాశర స్మృతియును మాత్రమే కలవు. ఇతర పండితులు వేరు పుస్తకములను వీరికి చూపించుటకు నైనను,వీరి కిచ్చుట కంగీకరించ లేదు. ఈ విషయమై పురుషార్ధ ప్రదాయిని లోను తత్వ బోధిని లోను వచ్చిన రెండు ఉపన్యాసములు మాత్రమే వీరికి లభ్యమైనవి. వీటి సహాయమున తమ మేధ కనుగుణముగా వీరొక ఉపన్యాసమును వ్రాసి, శ్రీ విజయనగర మహారాజు గారి బాలికా పాఠశాల మందిరమున 1879 లో ఆగస్టు మూడున మొట్టమొదటగా చదివిరి. దాని వలన పండితుల క్రోధాగ్ని మండినది. ఎవరికి విజయమో చూడ నెంచి,ప్రజలు చాలా మంది ఆ హాలులో హాజరైరి. శ్రీ శంకరాచార్య స్వామి యొద్ద పండితులుగా నున్న శ్రీ అద్దే పల్లి కృష్ణ శాస్త్రులు గారు కూడా తమ పాండిత్య ప్రభావముతో వీరిని బహు విధములుగా

దూషించిరి. పై వారము తమ ఖండనను చదివెదమని నాటి సభను చాలించిరి. అప్పటి నుండి ఎవరు మాట్లాడినను,ఈ స్త్రీ పునర్వివాహ విషయ చర్చలే కొన సాగినవి.

తరువాత వీరికి 30 కి పైగా స్మృతులు లభ్యములై,తమ వాదనను సమర్ధించు శాస్త్ర సమ్మతి విషయ సంగ్రహణము సమకూరినది. వాదన బలపడ గలిగినది. ఈ విషయమున సంస్కృత పండితులగు శ్రీ బాపయ్య పంతులు గారు వీరి కన్ని విధముల తోడుగా నిలిచిరి.పై వారము వీరిని కాకినాడకు పిలిచి ,తగిన ఖండనను తెలుపలేక,సభను మరునాటికి వాయిదా వేసిరి. ఆ సభ ఆలయ ప్రాంగణములో జరుప వలెననిరి. అయినను సమయమునకు ఎవరు హాజరు కాలేదు. ఆలస్యముగా వచ్చి,వీరితో వాదనకు దిగి, వీరి జవాబును విననీయక,దాట వేసిరి.కొందరు వీరిపై దౌర్జన్యమునకు దిగ నారంభించిరి. దైవ కృప చేత వీరి శిష్యు లనేకులు అచట నుండుట
చేత వీరిని కాపాడ గలిగిరి. కాని ,పలు ప్రదేశముల నుండి పండితు లనేకులు వీరి వాదనను ఖండించుచు,కొన్ని ఖండన గ్రంధములను వ్రాసిరి.అక్టోబరు 12 న వీరు తమ ద్వితీయ విజ్ఞాపనము నుపన్యసించి,ప్రకటించిరి. ప్రతి వాదుల వాదనల కుత్తరములను వీరు వివేక వర్ధనిలో ప్రకటించుచు వచ్చిరి. కొన్ని సభలలో వీరి వాదనలను విపరీతార్ధముతో ఖండించుచు, పలువురు పండితులు తమ వాదనల నేక పక్షముగా తెలుప జొచ్చిరి. వీరిపై దౌర్జన్యములు,కాకినాడ లోనే కాక, రాజమహేంద్రవరము ,చెన్నపురిలో సైతము జరిగి,దైవ కృప చేత వీరు భంగ పడక తప్పించు కొనగలిగిరి. ఈ స్త్రీ పునర్వివాహ సమాజమున వీరును మరి 5 గురు మిత్రులను మాత్రమే ప్రధమముగా నుండిరి. వారు ప్రతి వాదముల ప్రచారము తరువాత,ఈ విషయమును ఖండించువారి స0ఖ్య తరుగు జొచ్చెను. కొందరి యోచన ఈ విషయము యొక్క సంస్కరణాభిలాషను మెచ్చ మొదలిడినది.

అందు చేత,కొందరు తల్లిదండ్రులు తమ విధవ కుమార్తెలకు తిరిగి వివాహము చేసి,వారి జీవితములను చక్కదిద్ద సమకట్టిరి. కొందరు భోజనమునకు వచ్చి,సాయపడెద మని తెలిపిరి.కానీ,ఈ కార్య సాధన నిమిత్తము వీరి దగ్గర నొక్క కాసైనా నిధిగా లేదు. అదే సమయమున వీరి అభిమానులైన శ్రీ బారు రాజారావు గారు,శ్రీ పైడా రామకృష్ణయ్య గారు ఈ పని నిమిత్తము రు 30,000/ల నిచ్చి,ప్రోత్సాహ పరచిరి. దీని తరువాత మరి రెండు సం !!లకు గాని ప్రధమ వితంతు వివాహము జరుప బడ లేదు. అంత వరకును సకల విధములైన వ్యయములను శ్రీ వీరేశ లింగము గారే తమ స్వధనముతో నిర్వహించిరి. వితంతు బాల లెచట నుండిరి ,వారి నెటుల రాజమహేంద్రవరమునకు చేర్చవలెను ,వారిని వివాహ మాడు వరుడెవడు?,వారి వారి తల్లిదండ్రులను,వధూ వరులును ఈ వివాహముల కంగీకరింతురా, ఈ విషయ సేకరణ ,రవాణా ఖర్చులు ,వివాహమునకు ఖర్చులు,విందు-మంత్రములు,మేళములు మొదలగు వాని కగు ఖర్చులు చాలా ఎక్కువగానే ఉండెడివి. వివాహ సమయమునకు ముందుగా వరుడో ,వధువో ఆ పెండ్లి వలదని మరలి పోవుటయు సంభవమే. వివాహము తరువాత,వారి చదువు,పోషణ ,నివాసము నిమిత్తమగు సకల వ్యయములను వీరే భరించ వలసి వచ్చెడిది. ఈ వ్యవహారములను చక్క దిద్దుటలో వీరేశలింగము గారనేక కష్ట నష్టములకు,అవమానములకు లోనైరి. కాని ,ఈ విషయములో వారి విద్యార్ధులు అనేక సార్లు అనేక విధములుగా సహాయ పడిరి.

ఇట్టి బృహత్కార్యమును నిర్వహించుటకు రాజులకు సైతము కష్ట మనగా, వీరి వంటి నలుగురైదుగురు మిత్రుల కిది ఎంత దుర్లభమో తెలియ దగును. క్రొత్త న్యాయవాది గారు న్యాపతి సుబ్బారావు పంతులు గారు ,కాకినాడ సబ్ జడ్జి శ్రీ కంచి కృష్ణ స్వామి రావు పంతులు గారు

–వీరికా సమయములో తోడ్పడిరి. రాజమహేంద్రవరము డిస్ట్రిక్ట్ మున్సబు గారును అనేక విధములుగా సాయ పడ సాగిరి. వీరతి త్వరలో నొక వితంతు వివాహ మొనర్చి ,మంచి ఆరంభమును చేయ వలెనని ఆంతరంగిక సమాజముగా నేర్పడి,పథకములు వేయ సాగిరి. ఈ విషయము నెరింగిన శిష్ట చాందస దుష్ట విప్ర లొక సభను మార్కండేయ స్వామి ఆలయములో జరుప నెంచి,వీరి నా సభ కాహ్వానించిరి. ఆ సమయమున వీరికి హాని తలపెట్టుటను గ్రహించి,వీరి విద్యార్థు లనేకులు వీరిని రక్షించి,బయటకు కొనిరా గలిగిరి. అందు చేత,కక్షలు,కలహములు,ఖండన లధిక మైనవి. 1880–1881 లో విద్యార్థులొక సమాజమును స్థాపించి,సంఘ సంస్కరణ చేయ నెంచిరి. అదే సమయమున శ్రీ శంకరాచార్యులవారు విజయ నగరము నుండి రాజమహేంద్రవరమునకు వచ్చు వార్త తెలియ వచ్చెను. వారు శాస్త్ర బోధల కన్నను పాదపూజలు,మంత్ర బోధలకే ఎక్కువ ప్రాధాన్య మిచ్చుట జరుగు చుండెడిది. అందు చేత,ఇట్టి అకృత్యములను,డాంబికాచారములను ,ధన వ్యయమును గూర్చియు,అనేక వివరములను వీరి వివేక వర్ధని పత్రికలో వ్రాసి,ప్రజల కన్నులు తెరిపించ యత్న మొనర్చిరి. దీనికి కినిసిన పండితులు ప్రతీకార చర్యలకు పాల్పడ యోచింప సాగిరి. స్వాముల వారి శిష్యు లొకరు స్త్రీ పునర్వివాహ విషయమును గూర్చి ఒక అభిప్రాయమును వారు తెలిపిరని చెప్పి, బహుజనాభిప్రాయము అవల0బనీయమని తెలిపిరి.

1880–1881 లో వీరి ప్రార్థనా సమాజము ఉచ్చ దశ యందుండెను. అందు ధర్మోపన్యాసముల నిచ్చుటకు వీరేశలింగము గారే ప్రముఖులై యుండిరి. వీరి ఉపన్యాసములను వినుటకై వందల మంది జనులు వచ్చెడి వారు. శ్రీ ఏలూరి లక్ష్మీ నరసింహము గారొక ఆస్తిక పాఠ శాలను ప్రారంభించిరి. కానీ,అందు ఆస్తిక మత వ్యాపనము జరుగ లేదు. ప్రార్థనా సమాజమునా ఆస్తిక పాఠశాల యందే నడిపెడువారు. 1881 మార్చిలో శ్రీ పండిత శివనాధ శాస్త్రి గారు ఉత్తేజకరము లైన మతోపన్యాసముల నిచ్చి,జనుల యందుత్సాహమును పైకి తెచ్చిరి. విద్యార్థులలో సత్కార్య ఉత్సాహము హెచ్చయినది. చాలా మంది ఏకేశ్వరారాధన చేయ సాగిరి. వారే రాత్రి పాఠశాలలను ప్రారంభించి, పేదలకు,పని వారికి పాఠ ములను చెప్పెడి వారు.నాటి విద్యార్థులే తరువాత ప్రముఖులైరి. చివరకు విద్యార్థుల పాఠశాల యొకటియే మిగిలెను. బీదల కన్నదాన కార్యక్రమములును జరుప బడుచుండెడివి. వీరి శాస్త్ర పాఠశాలా విద్యార్థు లిన్నీసుపేటలో నొక బాలికా పాఠశాలను స్థాపించిరి. (1881 లో)దానిని రాజా వారి సత్రములో నిర్వహించెడి వారు.ఆ పాఠశాలకు కొంత ధనమును సహాయముగా నిప్పించి,శ్రీ వీరేశలింగము గారే ప్రోత్సహించిరి. తరువాత నా పాఠశాలను దొరతనము వారు చేకొని,స్థిరపరచి,బాలికా విద్యాభ్యాసమును అభివృద్ధి పరచిరి.

కులాచార,రాజకీయ కుతంత్ర దురాచారములను వినోదకర భాషణల ద్వారా వెల్లడించి,సంస్కరణ చేయ వలెనని వివేక వర్ధని క0తర్భాగముగా హాస్య సంజీవనిని వారా కాలమున ప్రకటించు చుండిరి. వ్యవహార ధర్మ బోధిని నొక దానిని విద్యార్థులు ప్రదర్శించి,ఎల్లరకు వినోదమును,విజ్ఞానమును పంచి ఇచ్చిరి. మరికొన్ని నాటకములను వ్రాసి,ప్రదర్శింప వలెనని విద్యార్థు లాశించినను ,తల్లిదండ్రుల అంగీకారము లేఖను–విద్య కవరోధము కలుగు ననియు,ఆ ప్రయత్న మంతటితో ఆప బడెను. కాని ,1881 చివరిలో చమత్కార రత్నావళి యన బడు రెండు నాటకములు ఆఖరి సారిగా ప్రదర్శింప బడినవి. ఇవి ఉద్యోగస్తులను, పెద్ద వారిని విమర్శించున వగుటచే వారి కోప తాపముల కివి గురి కాక తప్ప లేదు. విద్యార్థుల సంఘ సంస్కరణ సమాజమున మిక్కిలి ఉత్సాహముతో పని చేయ సాగెను. త్రాగుడు,సిగరెట్టు ,పొడుము,చుట్టల వినియోగమును వీరు ఖండింప సాగిరి. కొందరు బాల వితంతువులు వితంతు వివాహ పునర్వివాహో త్సాహులై,వీరిని

సంప్రదింప యత్నించు చుండిరట. అందు చేత,పలు సంప్రదాయ వాదులు వితంతువులకు బలవంతముగా తల గొరిగించుట, బ్రహ్మచారులకు త్వరగా వివాహములు చేయుటకు పేగిర పడ జొచ్చిరి. వీరును ఆ వితంతు స్త్రీ సంరక్షణకై యథాశక్తి ప్రయత్నింప సాగిరి. ఎందరు ప్రో త్సహించినను మొదటి వితంతు వివాహ విషయము నందు ముందునకు వచ్చు వారు మాని వెనుకంజ వేసి,రెండవ వివాహమునకు సహకరించెద మని తెలిపిరి. అయినను,వితంతు బాలికల వివరములను,వారికి తగిన వరుల సమాచారమును రహస్యముగా సేకరించ యత్న మొనరించుచునే వీరుండిరి.

వీరి మిత్రుల లేఖ ద్వారా నొక బాల వితంతువు సమాచారము తెలిసి,ఆమెను వీరేశలింగము గారి గృహమునకు చేర్చుటకు బహు విధములుగా రహస్య యత్నములు జరిపి,సఫలీకృతులగుట వలన కార్యము కొంత వరకు నెరవేరినది. ఆమెను తీసికొని రాబోయిన వారర్ధ రాత్రమున నామెను తన ఇంటి నుంచి తరలించి,ఎవరికి తెలియ నీయక,మధ్యలో తిండి కూడా మానుకొని,రాజమహేంద్ర వరమునకు చేర్చ గలిగిరి. వరుడు శ్రీ గోగులపాటి శ్రీరాములుగారు . విశాఖ పట్నములో ఆరక్షక శాఖ యందు ఉద్యోగి. వానికి వివాహ దినమునకు ఆ శాఖ వారు శలవు నీయలేదు. వీరేశలింగము గారు తన మిత్రులైన చెన్నపురి ఐ. జి గారి చేత లేఖను వ్రాయించి,వరునకు శలవును మంజూరు చేయించి పంపిరి. ఈ రీతిగా ప్రథమ వితంతు (1)పునర్వివాహము 11-12-1881 న రాజమహేంద్రవరములో జరుప బడినది. ఆ వివాహమునకు ఈ సమాజ సభ్యులు చాలా మంది హాజరు కాక పోయిరి. బంధువులు వ్యతిరేకతా బలమే అందులకు కారణమై యున్నది. ఒకరిని వారి అన్నదమ్ము లిద్దరును గదిలో బంధించుట యొక కారణము. అద్దె ఇంటి వారు తమ యజమానులు ఖాళీ చేయవలెనని నిర్బంధించుట మరి యొక కారణము.ముఖ్యముగా శ్రీ బసవరాజు గవర్రాజు గారి ధైర్య సాహసములు మెచ్చుకో దగినవి. తమ ఇంటి వారును ,బంధువులును ఎంత రోదించి విరోధి0చినను వారి పట్టు సడల నీయక,ఈ కార్య క్రమమునకు తమ పూర్తి సహాయమును అందించి,ధన్యు లైరి. వీరి అకాల మరణము 1888 లో సంభవించుట మిగుల శోచనీయము. ఆ వివాహము సహ పంక్తి భోజనము చేసిన వారందరును వెలి వేయ బడిన వారే. అయినను,కొందరు వారి నెదిరించి,ఈ సంస్కరణోద్యమమమునకు తోడుగా నిలిచిన వారైరి.కొందరు విధి లేక,ప్రాయశ్చిత్తము నొనరించుకొని,తమ కుటుంబములతో నిలిచిరి.

శత్రు పక్షము వారెంత కైనను తెగించి,మితి మీరి వీరిపై ప్రతి చర్యలకు,దూషణములకు,శారీరక హింసకు యత్నించిననూ,కృపాకరుడైన పరమాత్మ యాశీస్సులు వీరికి కలుగుటయును,అత్యంత విశ్వాస పాత్రులగు పలువురు దృఢ కాయులైన విద్యార్థు లెల్ల ప్పుడును వీరి కండ దండల నంద జేయుట వలన వీరి కపజయము తప్పి పోవుచు వచ్చెను.విద్యార్థులు తమ ప్రాణములకు సైతము లెక్కజేసెడి వారు కారు. పురోహితులను,వంట బ్రాహ్మణులను,మేళము వారిని ,ఇతర పని వారిని నిరోధించి,వితంతు వివాహ కార్యములకు రాకుండా ప్రతి పక్షము వారు ప్రయాస పడ జొచ్చిరి.తుదకు వేశ్యలను కూడా పోరాదని భయపెట్ట సాగిరి. అయినను,వీరేశలింగముగారీ వేశ్య మేళములను సమర్థించెడి వారు కాదు. ప్రథమ వివాహ సమయమున మిగిలిన సభ్యులీ వేశ్యా మేళము లేక పెండ్లికి శోభ రాదనగా,వారి ఇంటి బయటవరకే వారిని రానిచ్చి,లోనికి రానీయక,నిషేధించిరి. ప్రతి పక్షము వారి నెదుర్కొనుట కధిక ధనము ననేక విధములుగా వీరికి వెచ్చించ వలసి వచ్చు చుండెను. అయినను, వీరు వెనుదీయక,సమర్థ వంతముగానే ఎదిరింప సాగిరి.ప్రతి నెలకు జీతము విధముగా వీరు కొందరిని వంట బ్రాహ్మణులను,నీళ్ల బ్రాహ్మణులను ,భోజనములు చేయువారిని, పురోహితులను

కుదుర్చుకొని,ఖర్చునకు వెనుదీయ లేదు. అయినను,వారిని వైరి పక్షము వారు భయ భ్రాంతులను జేసి, వెడలగొట్ట యత్నించిరి. ఈ వివాహమును చూచుటకు పలువురు యూరోపియన్లు వచ్చిరి. దక్షిణకై భటులు నిలువ బడిరి.ఎస్ .పి .గారు , జాయింటు మాజిస్ట్రేటు గారు స్వయముగా వచ్చిరి. వంట వారిని కూడా పోలీసుల రక్షణలోనే యుంచు కొనిరి. అందు చేత,నీ ప్రథమ వితంతు వివాహము నిర్విఘ్నముగను, వైభవముగను జరుప బడినది. తరువాత నాలుగు దినములకే ద్వితీయ వివాహము కూడా జరిగినది. అనేక వార్తా పత్రికలీ వివాహ వార్తలను వ్రాసి,ఉగ్గడించినవి. పలువురు వీరికి హార్దికాభినందనలను పంపిరి. పండెండేండ్ల వయసు గల నొక బాల వితంతువు నామె తల్లి వీరి కడకు తెచ్చి,వివాహము చేయింపుడని వేడు కొనెను.వరుని ఏర్పరచి,విషయమును రహస్యముగా నుంచినను,వరుని తండ్రి తెలిసికొని,గోల చేయగా,నాతని కట్టడి చేసి,కార్యమును పూర్తి చేయించ గలిగిరి. దీనికి చాలా మంది పెద్దలు హాజరై,పలు విధములుగా సాయ పడిరి. వితంతువు తల్లి ఆమె భర్త యనుమతి లేకనే ఈ వివాహము చేయించిన దన్న అభియోగమును తెప్పించ దలచినారని వీరికి ముందుగా తెలిసి,వారిని తెప్పించి , సభల కెక్క కుండ తప్పించి, సరి జేసుకొన గలిగిరి.దీనికిని ప్రతి పక్ష సభ్యులు వీలయినన్ని విధములుగా ఈ సమాజ సభ్యులను పలు బాధల పాలు జేయ సాగిరి. ఉద్యోగస్తులను బదిలీ చేయించ వలెనని వేడు కొనిరి.

(2) ఇట్టి దురవస్థల నధిగమించి, 4 రోజులకే జరిగిన ఆ ద్వితీయ వివాహ సభ్యులందరకును వీరేశలింగము గారింటనే వసతి,పోషణ కల్పించిరి. వీరి మాతామహి సహితము కోపించి, వేరు కాపరమున కేగిన దైనను తరువాత వీరి కృత్యముల వలన అభాగినులకు జరుగు లాభములను గణన చేసికొని ,తిరిగి వీరి ఇంటికే వచ్చి, వేరుగా వంట చేసికొని,జీవింప సాగినది. సుమారొక ముప్పది మందికి శ్రీ శంకరాచార్యులవారి నుండి బహిష్కరణ పత్రిక లందినవి.సభ చేసి,ఆ పత్రికలను ప్రకటించగా, చాలా మంది భయపడి,ప్రాయశ్చిత్తములు చేయించుకొనిరి.అయినను,పలువుర నుండి అభినందనలుగా ఉత్తరములును,పత్రికలును రాసాగినవి. చెన్నపట్టణమున కొక సారి వచ్చి,ఈ వితంతు పునర్వివాహములను గూర్చి,ఉపన్యాసముల నొసగి,వీరిని సమాజ కార్యక్రమాభి వృద్ధికి చేయూత నిమ్మని,ఆహ్వానించిరి. నల్లగొండ వెంకట్రామయ్య గారిని వెంట గొని,శ్రీ వీరేశలింగము గారు చెన్నపురికి బయలు వెడలిరి. అచ్చటచ్చట దీర్ఘోపన్యాసము చేసి,కొందరికి కోపమును తెప్పించ గలిగిరి. కొందరు కొట్ట బోయినను,చెన్నపురి వారు వీరిని రక్షించిరి. స్వాముల అభియోగ పత్రముల తరువాత పలువురీ వితంతు వివాహ ప్రక్రియకు దూరముగా పోయిరి. కొందరు భయపడి,యథోచిత ప్రాయశ్చిత్తముల నంగీకరించిరి. ధన సహాయము కూడా రాకుండా ఆపు జేయ బడినది. తిరిగి వీరికి దుర్దినములు వచ్చేనా యను అనుమానము కలుగ సాగినది. అయినను,కొన్ని పత్రికా ముఖముగా ప్రకటన లిచ్చి చందాలను సేకరించ వలెనని ప్రయత్నములను సాగించిరి. ఇంతలో విశాఖ పట్టణములో నున్న గోగులపాటి శ్రీరాములు గారికి అస్వస్థత ఏర్పడి చాలా ప్రమాదకరముగా నున్న దన్న వార్త తెలిసెను. అందు చేత,తనకు నమ్మకముగా సాయ మొనర్చు వారి నిరువురను శ్రీ వీరేశలింగము గారు అతని వద్దకు పంపి,తగిన వైద్యమును చేయించి,స్వస్థత చేకూరు వరకు నచ్చటనే యుండి,చూడ వలసిన దని పంపిరి. దైవ కృప చేత అతనికి ఆరోగ్యము చిక్కెను. అతనే ప్రథమ వితంతు వివాహ వరుడగుట చేత, ఏమైనా ప్రమాద మేర్పడిన, జనులందరు ఆ వితంతు వివాహము వలననే ఈ కీడు జరిగినదని వాదించు బాధ ఈ రీతిగా దైవముచే తొలగింప బడెను. పెళ్ళిన వారు పురోహితుడైన శ్రీపాద రామ

సోమయాజులు,శ్రీ నల్లగొండ కోదండ రామయ్య గారును. వీరు తంతి ద్వారా ఆరోగ్య వార్తను వీరికి పంపి సహాయ పడిరి.

వివేక వర్ధని ద్వారా అవినీతి,దురాచారముల ఖండన వార్తలు ప్రచురింప బడగా, కోపించిన ప్రత్యర్థులు కుట్ర చేసి,వీరి ముద్రణా యంత్రమునకు ధనము నిచ్చిన వారిని పురికొల్పి,సొమ్ము వాపసు కావలెనని పోరాడు నట్లుగా చేసిరి. ఆ బాధను తప్పుకొనుటకై వీరేశలింగము గారే రు 1250/లను ఇచ్చి,ఆ ముద్రణా యంత్రమును కొని,స్వాధీన పరచు కొనిరి.కాని ,శ్రీ శంకరాచార్యులవారి శిష్యుల ప్రతి ఘుటన అధికమై, కష్ట పెట్ట బడు చున్నది. దీనికి తిరుగుబాటు చేసి,ఎదుర్కొన దలచి,విద్యార్థులు కొందరొక స్వామి శిష్యుని పట్టి తెచ్చి,అతడొక బ్రాహ్మణ వితంతువుతో రహస్య కాపురమును సాగించుటను వెల్లడించి ,గోల చేసిరి. అందుచే ,స్వాముల వారి శిష్యులను,విద్యార్థులను కలహ మేర్పడెను. పరస్పర నిందలు,దెబ్బలాటలు కూడా జరిగినవి. విద్యార్థుల బల మెక్కువగుటచే,శిష్యులు బలహీనులై స్వామి వారిని తిరిగి పేరొక యూరికి పంపి వేసిరి. చెన్నపురి వారి ఆహ్వానముపై వీరేశలింగము గారు అచట కేగి, వితంతు పునర్వివాహ సమాజ వాదమును పలు చోట్ల నుపన్యాసముల ద్వారా తెలుప సాగిరి. ప్రతి చోట పురాతనాచార సంప్రదాయ వాదుల నుండి ప్రతి ఘటన చర్య లధికము కాసాగెను. సహ పంక్తి భోజనము చేయుద మన్న వారును హాజరు కాలేదు. కొన్ని చోట్ల వీరిని దండించ యత్నించిరి. కాని , తృటిలో తప్పుకొని రక్షింప బడినారు. కొన్ని చోట్ల వీరు ఆవేశము వచ్చి,అతి హాస్యము గాను,తీవ్రముగాను ప్రతి పక్షులను ఖండించి,శ్రోతల కెల్లరకును ఆనందమును కల్పించిరి. కొందరు వీరి వాదమునకు,యత్నమునకు సంతసమును వెలి బుచ్చిరి.ఆ సందర్భమున, స్త్రీ పునర్వివాహ శాస్త్ర స0గ్రహమను —ఉపన్యాసము నొక పొత్తముగా వ్రాసి,ముద్రణ చేయించిరి. చెన్నపురి వారిచే వస్త్రములను,ప్రయాణ ఖర్చుల ధనమును బహుమతిగా బడసి,వీరు తిరిగి, క్షేమముగా రాజమహేంద్రవరమునకు చేరిరి.

తిరిగి వచ్చిన తరువాత,శ్రీరాములు గారికి గర్భాదానము చేసి, ఆయనను పత్నీ సహితముగా విశాఖ పట్టణమునకు పంపి వేసిరి.సమాజ విషయ చర్చకై ఒక చోట వారి మధ్య అభిప్రాయ భేదము లనేక ముండుట సహజము కదా. వితంతు వివాహ ప్రోత్సాహులకై యొక గృహమును విత్త మిచ్చి,శ్రీ రామకృష్ణయ్య గారు కొని ఇచ్చిరి. వీరి ఇంట నున్న వంట బ్రాహ్మణులలో ఒకరు దొంగ. పలు వస్తువులు తరచుగా మాయమగు చుండెడివి .అతని నొకసారి ముద్రాక్షర శాల పని వాడొక డాతనిని దొంగగా గుర్తించి,పట్టుకొని,దండించగా పలు వస్తువులు తిరిగి దొరికినవి. రామకృష్ణయ్య గారిచ్చిన నూరు రూపాయల వ్యయ పట్టికను వీరు ప్రకటించిరి. దీని వలన,వారితరు లిచ్చిన సొమ్ము నెంత జాగ్రత్తగా వెచ్చించెడి వారో మనకు తేట తెల్ల మగును.ఇప్పుడు సమాజమున కెట్టి ధనము లేదు.దాతలును లేరు. మరి ధనము లేక,కార్యక్రమము లెట్లు సాగునో తెలియ రాలేదు. కొందరు సొమ్మొసగి,మరి వితంతు వివాహములు జరుగని పక్షమున ధనమును తిరిగి ప0ప వలసినదిగా వ్రాసిరి. వివాహములు జరిగినచో,ఒక్కొక్క దానికి వెయ్యి రూపాయల నిచ్చెద మనిరి. వ్యయముల క్రింద నెలకు రు 75/లు చొప్పున జూన్ నుండి ఇచ్చెదమని చెప్పిరి. మొదట తమ వితంతు

పుత్రికలకును ,చెల్లెన్డ్రకును వివాహము చేయించుడని యర్థించిన వారే– మారు మాటాడక,వీరిని తిట్ట సాగిరి. వీరిపై కోపగించు కొనిరి. పెద్దిభొట్ల యజ్ఞన్నగారి ఉత్తరము ద్వారా తెలుపబడిన అతని చెల్లెలిని తమ శాఖ వానికి (వైదిక వరునకు)తాడూరి రామారావు గారు స్వశాఖది యైన మాధ్వ వితంతువును పెండ్లాడుటకు అంగీకరించిరి. కాని ,కార్యము కావలసిన నాటికి వీరిద్దరూ వెనుకకు తీసిరి.ఆ

వితంతువులు చదువు కొన్న వారగుటచే వారి తోనే ఉత్తర ప్రత్యుత్తరములు వ్రాసిన విషయము బయట పడి ,కార్య భంగము కాక మానదు. కనుక,వారిని తమ దరికి తేగలిగిన నమ్మక స్థుల యవసరము వచ్చెను.దీనికి తగిన వారుగా పెద్దాపురము పోలీసు ఇన్స్పెక్టరైన గుమ్మిడిదల మనోహర రావు గారు,కాకినాడ యందున్న పెండెకట్ల లచ్చిరాజు గారు సమర్థులుగా తోచిరి. వారి సాయమున కాకినాడ బాలికను రాజమహేం ద్రవరమునకు తరలించిరి. అమె ఇల్లు వీడి పోగానే ఇంటి వారామెను వెదకి,నగ లెత్తుకొని పారిపోయినదని అభియోగమును తెచ్చిరి.ఆమెను అరెస్టు కాకుండా చూచుటకై వీరేశలింగము గారు కాకినాడ పోయి, ఎస్.పి గారి నుండి ఆమెకు వారెంటు జారీ కాకుండా ఆపి వేయించ గలిగిరి. ఇక వరుని కొని తెచ్చు కార్యము మిగిలి యున్నది. అతనిని కలిసి,తమ వెంట రమ్మనగా నతనికి అభియోగ విషయము తెలియుట చేత రానని చెప్పెను. పట్టుబట్టి అతనిని తమ వెంట గొని తెచ్చిరి. కాని ,అతనిని ఋణ ప్రదాతలు బాధించి,తమ బాకీ నిమ్మని,వేధింప సాగిరి. వారికి 200/రు .లు ఇచ్చి,వరుని ఋణ విముక్తుని జేయ గలిగిరి. వధువు వారు బాలికను తీసికొని పోయితిమని అభియోగమును తెచ్చితిరి కానీ,రాజకీయ వైద్యు లామెకు 16 స0!!లు దాటిన దని నిర్ణయ పత్రము నిచ్చిరి. ఇదే సమయమున మొదట వితంతు వివాహము చేసికొన్న శ్రీరాములుకు ,భార్యకు సరిపడక పోయెననియు, ఆమె తల్లి ఇతనిని బాధించి, వేధించు చున్నదనియు, తెలియ వచ్చెను. వెంటనే చెన్నపురి నుండి తిరిగి వచ్చుచున్న గవర్రాజు గారిని వీరు కలసి,కాకినాడ నుండి విశాఖ పట్టణమునకు పోయి, శ్రీరాములు సంసారమును సరి చేసి రావలెనని పంపిరి. వారందుల కంగీకరించి,ఆ కార్యమును చక్కపెట్టి తిరిగి వచ్చిరి. పలు విధములైన వాదములు,దూషణలు,ఆటంకములను దాటి,ఈ మూడవ వితంతు వివాహము 22-10-1882న నిర్వహింప గలిగిరి . (3)--ధన మధికముగా వ్యయ మయ్యెను. ఆయుధ ధారు లైన రక్షక భటులు వెంట యున్నను,పల్లకీపై కొందరు రాళ్లను వేసి,అల్లరి చేసిరి. తరువాత డిసెంబరు లో అభియోగములు కొట్టివేయ బడినవి.మొదటి మూడు వివాహములును నియోగి,మాధ్వ బ్రాహ్మణులలో జరిగినవి కానీ,వైదిక బ్రాహ్మణుల యందు జరుగక పోవుటచే —వారది గొప్ప ప్రతిష్టగా భావింప జొచ్చిరి.కాని ,వీరెట్లయినను ఒక వైదిక వితంతు వివాహమును జరిపింప యత్నింప సాగిరి. కాకినాడలో ఉత్తమ కుటుంబము నందొక బాల వితంతు వుండెననియు, వెంకటప్పయ్యగారు ఆమె అన్నతో మాట్లాడిరనియు తెలిసినది. ఆమెకు వివాహమాడు ఉత్సుకత గలదని ,ఆమె ఇంటి యెదుట నున్న తంజావూరి చలపతిరావు గారామెతో మాట్లాడి,గ్రహించిరి. ఒక పెళ్లి పల్లకీ ఊరేగింపులో నుండగా నా చిన్నదానిని బయటకు రప్పించి,రాజమహేంద్ర వరమునకు తెచ్చి,వీరేశ లింగము గారింటికి చేర్చిరి. ఆమె తరఫు వారు బాలిక తప్పించుకొని పోయినదని గ్రహించి,వారి బంధువులైన రాజమహేంద్రపుర వాసి తనికెళ్ళ జగన్నాధముగారికి, పోలీసులకు తంత్రీ వార్తను పంపిరి. కాని ,వారెవ్వరును ఈ విషయమై జోక్యము కలిగించుకొనక,ఊరకుండిరి. మరునాడు,ఆమె తల్లి,మేనమామ రాజమహేంద్రవరమునకు వచ్చి,బంధువుల ఇంట దిగి, మూడవ నాడు వీరేశలింగము గారి ఇంటికి వచ్చి,కూతురును రమ్మని కోరి,యేడువ సాగిరి. ఆమె అందుల కంగీకరించ లేదు. పులవర్తి శేషయ్య యను నొక వైదిక విద్యార్థిని సంప్రతించి, ఈమె నాతని కిచ్చి,3-1-1883 న నాలుగవ వితంతు వివాహమును (4) జరిపించ గలిగిరి.

మదరాసు సమాజము వారి ఆహ్వానముపై వీరు పదముగ్గురు బయలు దేరి,రెండు వితంతు వివాహముల నచ్చట జరిపించుటకై వెడలిరి. ఇందులో రెండు జంటలు కాబోవు వారు, వారి తల్లి దండ్రులు,మరి ఇతరులును గలరు. వారి కొక పాత ఇంటిని అచట వసతిగా నేర్పరచిరి. ఆహ్వానించిన

శ్రీ రఘునాథ రావు గారి దర్శనమునకై మూడు రోజులు తిరిగి,పేచియుండి –వారిని కలసి,ఆహ్వానములు వివాహములకై పంపమని చెప్పిరి. వారు చేవ్రాలు వ్రాసి ముద్రి0పించి,పంచి పెట్టిరి. సకల విధములైన అలంకరణలను చేయించిరి. కాని ,తల్లి రెండవ కుమార్తెకు పెండ్లి చేయ నన్ను0దు వలన ఒక వివాహ మాగి పోయెను. అచట ఒక్క వివాహము మాత్రమే (8 వదిగా) జరిగినది.ప్రచార మధికముగా జరిగెను. చదివింపుల క్రింద 17 జతల బట్టలు వచ్చినవి. నూతన దంపతులచే కచ్చా్ప పేశ్వరుని మందిరమున నభిషేకమును చేయించిరి. ఇంత వైభవముగా జరిగిన ఈ వివాహమున కనేక విద్యార్థులు వచ్చిరి. కాని ,శ్రీ రఘునాథరావు గారు రానే లేదు. 8-6-1883 న జరిగిన ఈ పెండ్లికి రు 850/లు ఖర్చయినవి. మిగిలిన 150/రు .లను వీరి కందజేసిరి. తరువాత,శ్రీ ఆర్కాటు నారాయణ స్వామి గారి పిలుపు మేరకు వీరు బెంగుళూరున కేగి,అచట దిండిలో ఒకటియు,పట్టణములో నొకటియు –రెండు ఉపన్యాసములను వీరేశలింగము గారు చేసిరి. అచటి ఆరువేల నియోగు లందరు నేకమై,వీరిని శ్లాఘించి సత్కారములు చేసిరి. తిరిగి,మద్రాసు వచ్చి,అందరిని తోడ్కొని,క్షేమముగా రాజమహేంద్రవరమునకు వచ్చిరి. ఈ వివాహమునకే ఎక్కువగా వ్యయ మైనది.పెళ్ళికి 850/రు .లు ,ప్రయాణము 331/రు .లు పెండ్లి కూతురు మాన్యము విడిపించి,ఇచ్చుటకు 200/రు .లు సంబంధము కుదిర్చినందుకు 40/రు .లు, తెచ్చినందుకు 40/రు .లు నగలకు 200/రు .లు పెరసి–1671/రు .లు ఖర్చయినది.

13-8-1883 న రెండవ కోమటి వివాహము జరిగెను. ఇది 9 వ వివాహము. 5-1-1884 న పులవర్తి శేషయ్య గారి ద్వారా చేసికొన్నది 10 వ వివాహము. వరుడు శ్రీ నల్ల గొండ కోదండ రామయ్య,ప్రథమ శాఖ వాడు. తాటిపాక నుండి వధువు వైదికి కన్య.(1) శాఖా భేదమును లెక్క చేయక, జరిపించి బడినదీ వివాహము.

1 వ వివాహము —--- గోగులపాటి శ్రీరాములు గారు.
2 వ వివాహము —---రాచర్ల రామచంద్రరావు గారు
3 వ వివాహము —---తాడూరి రామారావు గారు
4 వ వివాహము—---పులవర్తి శేషయ్య గారు
5 వ వివాహము —--ముంజలూరి గోపాల కృష్ణయ్య గారు
6 వ వివాహము—---సలాది రామయ్య గారు
7 వ వివాహము—----బోడా శ్రీరాములు గారు
8 వ వివాహము —----తణుకు చలపతిరావు గారు
9 వ వివాహము—----సలాది రామయ్య గారు
10 వ వివాహము—--నల్లగొండ కోదండరామయ్య గారు
11 వ వివాహము —--కొమ్మరాజు గోపాలం–పున్నమ్మ గారు

వీరేశలింగము గారి శరీరము బలహీనముగా నుండుటచే విశ్రాంతికై వేసవి కాలపు శలవులలో నరసాపురమునకు పోయిరి. వెంట వారు పెంచుతున్న శ్రీరాములు గారి శిశువును తోడ్కొని పోయిరి. అక్కడి సెంట్రల్ స్కూలులో వితంతు వివాహమును గూర్చి యొక్క ఉపన్యాసమును వ్రాసి, చదివినారు. బందరులో మరి వివాహములు జరుగ గలవని సూచన చేయగా,వీరు పైడా రామకృష్ణయ్య గారి కొక లేఖను వ్రాసిరి.వారు ఆరోగ్యము అనుకూలముగా నుండక పోవుట చేతను,వేడి 110 డిగ్రీలు ఉండుట వలనను అచటి కప్పుడు రావలదని వ్రాసిరి. అయినను వారి లేఖను లెక్కింపక,ఒక పురోహితుని వెంట గొని, వీరు బందరున కేగిరి. ఎవరో పెండ్లి వారు వీరి

కుచితముగా విందు భోజనము నేర్పాటు చేసిరి.వితంతు వివాహములను ప్రోత్సహించు పెద్ద లందరును ముఖము చాటు వేసిరి. అచ్చట వీరు వల్లూరి జమీందారు గారి విశాల భవనము నందు ఒక దీర్ఘోపన్యాసమును చేసిరి. పలువురా సభకు వచ్చిరి. ఎవరును అల్లరి చేయక ,శాంతముగా వచించిన దంతయు చక్కగా విన్న వారైరి.నాడు పామర జనుల బారి నుండి వీరు క్షేమముగా తప్పించు కొన గలిగిరి.

వీరి వితంతు వివాహ విషయిక విజ్ఞాపనముల మీద నొక ఖండన గ్రంథమును శ్రీ వడ్లమన్నాటి వెంకటాచలం పం0తులు గారు వ్రాయించిరి.వారితో చర్చ చేసి,పరాశర స్మృతి ఆధారముగా వారి ప్రతిపాదనల నన్నింటిని వీరు ఖండించిరి. ఓడి పోయినను వారే గెలిచామను వాదనతో ,వారు చర్చను ముగింపు చేసిరి. అయినను, వెంకటాచలం గారు వీరిని తగు రీతిని సన్మానించి,రాజమహేంద్రవరమునకు పంపిరి. కొందరు వీరిని వ్యతిరేకించి ,ఏక పక్షముగా వ్యవహరించు చున్నారని అభియోగమును తెల్పిరి. అట్లు చేసినది వీరి అనుయాయులు,నమ్మకస్థులుగా నున్న పులవర్తి శేషయ్యయే యగుట శోచనీయము.అందు వలన,వీరు 22-6-1884 న నొక క్రొత్త సమాజమును ప్రారంభింప జేసిరి. ఇది పూర్వ సమాజము యొక్క అనుబంధమే ననియు, సమాజ సభ్యులను కూడా తెలుపుచు తీర్మాన మొనరించిరి. శ్రీ పైడా రామకృష్ణయ్య 10000/రు .లు గారు ఇచ్చి యుండిరి. మొదటి రెండేండ్లలో 8 వివాహములు జరుపబడినవి. చెన్నపట్నపు వివాహమునకు 1671/,మాస వ్యయములు 1768/,గృహములకు 1116/,పాత్ర సామానులు ,వైద్యములు 320/,మొత్తము 8921/రు .లు ఖర్చు గావించ బడినది.తరువాత,చందాలు లేక పోవుటచే ఖర్చులను వీరే భరించు చుండిరి.

తరువాత,వీరు తిరిగి మదరాసునకు పోయి,ఆచట నున్న రఘునాధరావు గారిని కలిసి కొనిరి. వారు ప్రాయశ్చిత్తము చేసికొన లేదని అరచి చెప్పిరి. కాని ,వారి మాటలు కేవలము ప్రగల్భములే నని చెంచెల రావు గారు తెలియ జేసిరి.కొందరు విద్యార్థు లొక వృద్ధుని వీరి కడకు తెచ్చి,పరిచయము చేసిరి. అతడు చిత్తూరు నందొక గ్రామమున ఇద్దరు బాల వితంతువులు కలరనియు,వరులు కూడా సిద్ధముగానే యున్నారనియు పలికెను. 25/రు .లు ఇచ్చిన తల్లిదండ్రులను,వధూ వరులనుతమ కడకు తెచ్చెదనని యతడు తెలుపగా,అతని మాటలను నమ్మి,రొక్కము నొసగి పంపి వేసిరి. నాలుగైదు దినములలో నా వృద్ధుడు చెప్పిన విధముగానే వధూ వరులను బంధు సహితముగా తీసికొని వచ్చెను. తమ కడ నున్న వేయి రూపాయలతో నీ రెండు వివాహములను జరుపగా వీరు నిశ్చయించు కొనిరి. కాని ,రఘునాధరావు గారు , చెంచెలరావు గారు అప్పటి కచ్చట నా వివాహములు చేయ వలదని వారించిరి. నాటికి వారి మాటల నంగీకరించి,ప్రయత్నము నాపి వేసిరి. వేరు తావుల య0దీ వివాహములు జరుప నిచ్చెదరా యని పలువురకు వ్రాయగా,బళ్ళారి నుండి సభాపతి ముదలియారు గారు సమస్త వ్యయములను వహించి,తమ దగ్గర ఈ వివాహములును జరిపించెదమని వీరి నాహ్వానించిరి.వీరికి సమయము చాలక,వధూ వరులను శ్రీ మన్నవ బుచ్చయ్య గారి కప్పగించిరి. 1000/రు .ల నిచ్చి,బళ్లారికి పంపి ,వివాహము చేయించమని చెప్పి,పంపిరి. 12-2-1885 న చిత్తూరు సుబ్బారావు గారు పెద్ద పిల్లను,జటప్రోలు రామారావు గారు చిన్న పిల్లను వివాహ మాడిరి. (11-12)

ధనము పూర్తిగా వెచ్చించ బడెను . సమాజ కార్యములకు ధన మావశ్యకము . కనుక చందా లను సేకరించక తప్పదాయెను. అందుచే వీరు ప్రకటనలను పత్రికా ముఖమున చేసి,విజ్ఞాపనలను పంపిరి. (మే 1885 లో). వీరు ఉపన్యాససముల నొసగుచు,చందాల

పుస్తకమును వెలికి తీయగానే –పలువురా సభ నుండి వెడలి పోయిరి. పైడా రామకృష్ణయ్య గారి ఔదార్యమును కూడా నుగ్గడించి ,చందాల నొసగుడని వేడుకొనుటయు,ఈ సత్కార్యమునకు దోహద పడి, బాల వితంతువుల సంస్కరణకు చేయూత నీయు డనియు , విన్నవించడ మైనది. బండ్లపై ఇంటింటికి తిరిగినను ఫలిత మెక్కువగా కాన రాలేదు. శ్రీ పిఠాపురము రాజా గారి దత్త పుత్రుడు 200 రు .లు, చెంచలరావు,రఘునాధ రావు గారలు చెరి 100 రు .లు వేసియు ,ధనమీయలేదు. 25 రు .లు, 20,15,10 రు .లు మరి ముగ్గురు ఇచ్చిరి. ఒకరిని చందా నడుగగా,పని తొందర మీద నున్నానని తిరిగి లోపలకు పోయెను. వీరు దాని నవమానముగా భావించి,కోపించిరి. వెంటనే తిరిగి రాజమహేంద్ర వరమునకు వచ్చిరి. ఖర్చులు మినహాయించి,మిగిలిన ధనమును వీరు సమాజమున కిచ్చి వేసిరి. ఈ సమాజ సభ్యులే నెల చందాల నొసగిరి. అనేకులు పెద్ద మొత్తములను కూడా దయచేసిరి. న్యాపతి సుబ్బారావు గారు 300 రు .లు ,వాడ్రేవు చలమయ్య గారు 200 రు .లు,కంచి కృష్ణ స్వామి, సి . నాగోజీ రావు,ఆత్మూరి లక్ష్మీ నరసింహము శెట్టి గారు 100 రు .లు చొప్పున 50,25–ఇచ్చినది, ముగ్గురు ,15/ చొప్పున ఇద్దరు,10 /చొప్పున నలుగురు—ఇచ్చిరి. బెంగుళూరు వాసి– న్యాయాధిపతి ఏ.రామచంద్ర అయ్యరు గారు వివాహ మొకటికి ఆరు నెలలకు 100/రు .లు చొప్పున పంపుతూ,ఆరు నెలలకు 100/రు .లు చందా నిచ్చు చుండిరి. తరువాత,ఏ.సభాపతి ముదలియారు గారు వివాహమున కొక్కింటికి 100/రు .ల ను పంప సాగిరి. (బళ్ళారి నుండి). ఈ ధనముతో నెల జీతముల నిచ్చుచు,వివాహములు చేసికొన్నవారికి సహాయము చేయుచు,ఇతర వివాహములును చేయించ బడు చున్నవి. 20-12-1885 న 13 వ వివాహము జరిగినది. వరుడు పటానేని వెంకయ్య గారు . దీని ఖర్చు 300 రు .లను రామకృష్ణయ్యగారు రహస్యముగా పంపించిరి. ఇతడు మొదట ఉపాధ్యాయుడై,తరువాత కరణముగా పని చేసిరి. తరువాత గల వితంతువునకు స్వజాతి సంబంధము దొరకక,వివాహ మాగి పోయినది. పైడా రామకృష్ణయ్య గారు అనారోగ్యముచే మరణ సమయ మాసన్న మగుటచే,వీలునామా ద్వారా సమాజమునకు మరియొక 10,000 /రు .లను అంద జేసి ధన్యులైరి.

వితంతు బాలికలను తెచ్చెదమని ధనము గ్రహించి,మోసము చేసి పారిపోయిన వారి వలన కొంత నష్టము సంభవించు చున్నది. అట్టి వారిలో రావి గుర్వావధాను లొకడు . కొందరు విద్యాధికులును ఇట్టి దుశ్చర్యలకు ప్రయత్నించెడి వారు.కలకత్తా నుండి కొంత ధనమును పంపుడని తంత్రీ వార్త రాగా, దానిపై వీరు విచారణ జరిపి,అది మోస తంత్రి యని తెలిసికొని, అభియోగము తేవలెనని అనుకొనిరి గాని,అది వృధా ఆయాస మని విరమించు కొనిరి. పది మందితో కూడిన వ్యవహారము లందు కలహముల వలన మనస్తాప మేర్పడుట సహజమే కనుక,ఇట్టి విషయముల నెంత మాత్రము గణింప నక్కర లేదు. అవివేకము చేత చేసిన దుశ్చర్యలు క్షంతవ్యములు. దుస్స్వభావముచే చేసినవియు కొంత వరకు క్షమింపదగినవే. లోకోపకారుల మనియు,స్వార్ధ త్యాగుల మనియు ప్రకటించి,ధనాశచే మోసగించు వారి యకార్యము లెన్నటికిని క్షమార్హములు కానేరవు. సమాజాము నందుండి,వీరి కండగా నుండి,వీరి సహాయమును ప్రతి సారి పొందు చున్న కొందరు వీరిపై అభియోగములను మోపి,బాధించుట వీరికి మనస్తాప కారక మయ్యెను. వీలయినంత వరకు సూక్ష్మముగా వెల్లడించి,అట్టి అపవాదము లన్నియు,సత్య దూరములని పలు సార్లు వీరు నిరూపించి,శాంత చిత్తు లైరి. వరదల వలన ఇళ్లు పాడు కాగా,శ్రద్ధ లేక బాగు చేయించుకోని వారును ,ఈ రీతిగా నిందలు వేయుట శోచనీయము కదా.

విద్య లేని వారి కంటే విద్య కలవారు చేయు హాని ఎక్కువగా నుండును. పని చేయుట తక్కువ తనముగా భావించి,సోమరి పోతులుగా నున్న వారన్న వీరేశలింగము గారికి కోప మెక్కువ. అట్టి వారికి సాయపడుట దోషమని వీరి భావన. అట్టి వారిని ప్రోత్సహించుటయు పాపమని వీరి తలపు. బలము గల వాడయ్యును,పనికి సోమరియైన పంచమ వివాహ వరుడు ముంజులూరి గోపాలం తనకు ముద్రణాలయములో పని ఇచ్చి,తగిన జీతము నిమ్మని కోరగా,వీరు అంగీకరించ లేదు. అతనికి ఎవరి సిఫారసు కూడా వీరంగీకరించక పోయిరి. తన భావములను నిష్కర్షగా నరచి, ప్రకటించుట వీరి స్వభావము.అయినను,కష్టములనుండిన వారెట్టి వారైనను సాయ పడుట వీరి నైజము.గోపాలము గారి భార్య జబ్బుపడగా ,పూర్తి వైద్యమును ,ఇతర సదుపాయములను వీరే సమకూర్చి, ఆదు కొనిరి. కొందరు వీరి మధ్య అభిప్రాయ భేదములను కల్పించవలెనని తలచి,వీరి మీద వారికిని,వారి మీద వీరికిని చాడీలు చెప్ప సాగిరి. కానీ ,దాని వలన వారి కాశించిన ఫలితము దక్క లేదు.

మూడవ వివాహ వరుడైన రామారావు గారికి 1300/రు .లు ఇచ్చెదమని వీరు వాగ్దాన మొనరించిరి కానీ,వివాహ ఖర్చుల వలన ధనము మిగులక ఇవ్వలేక పోయిరి. ఆ ధనమును రామకృష్ణయ్య గారిచ్చెదమని వాగ్దానము చేసియు,మరి మూడు సం . ల వరకీయ లేక పోయిరి. దానిని గూర్చి వ్రాయగా,వారప్పటికే పలు దఫాలుగా రు 1505/లను ముట్ట చెప్పినట్లును ,మరి ఆశపడి యడుగుట యన్యాయ మనియు వారు వ్రాసినారు. మరి కొందరు తమకు పలు విధములుగా ధనము రావలసి యున్నదని అభియోగములను సమాజము వారికి పంపిరి కానీ, వాని నన్నిటిని తిరస్కరించిరి. మదరాసు నందు కట్నముగా లభించిన 17 బట్టల చాపులను పలువురికి పంచి ఇచ్చి,నాల్గింటిని తమవద్ద తదుపరి వివాహములకై నిలువ యుంచు కొనిరి.మరి కొందరు వీరియందు అకారణ వైర భావము నేర్పరచుకొని,సమయానుకూలముగా నిందింప సాగిరి. పగలు ప్రతీకార వాంఛను పెంచును కదా.వీరొక ఉపన్యాసములో ఇట్టి దుర్బోధలను వినక, సద్భావముతో మెలఁగి,సత్కార్యమునకు తోడ్పడ వలెననియు,అనాలోచిత ఆవేశములతో కార్య విఘాతములు కల్పించుట యుక్తము కాదనియు ,శాంతిగా యోచించి,సహాయ పడుట బుద్ధి మంతుల కవసర మనియు—వ్రాసి,ప్రకటించిరి.

విద్య లేనివారు సహకరించినను,విద్యాధికులు తమ చిన్న చిన్న కష్టములను పెద్దవి చేసి,ఘోషించుట యధిక మయ్యెను. వితంతు వివాహములు చేసికొన్న వారి కెవరికిని సొంత ఇళ్లు లేక పోవుటచే, వీరే వారందరికీ వసతి,విద్య,వైద్యము –ఇతర విధము లైన పలు సదుపాయములను కల్పించి,ఆ ఖర్చులను వీరే స్వయముగా భరించు చున్నారు.ఎవరి కెట్టి కష్టము సంభవించినను ,వీరును,గవర్రాజు గారును స్వయముగా విచారించి,సాయము నంద జేయు చుండిరి. పులవర్తి శేషయ్య గారు వీరితో వైర భావము చూపినను,వాడు వీరి దరికి జేరి ఏడ్చిన మీదట,అతని భార్యకు వచ్చిన జబ్బును వైద్యుని రప్పించి,దగ్గర నుండి,బాగు చేయించిరి. అతని భార్య మరణము తరువాత,తన శిశువును వీరే పెంచ సాగిరి. అతడు మరొక వివాహము చేసికొని,వీరి తోట లోనే సుఖముగా జీవించు చుండెను. వీరికి సాయ పడిన పైడా రామకృష్ణయ్య గారు 28-3-1886 న కాలధర్మము నందిరి. వారి సాయమును గూర్చి,వీరేశలింగము గారు 1887 లో మొదటగా శ్లాఘించి ,వారి మరణ శాసనమును ప్రకట పరచిరి. అప్పటికి వివాహములైన వారందరికిని ,వారు వారు నివసించు చున్నగృహములను వారికే ఇచ్చి వేసిరి. రామకృష్ణయ్య గారి మరణానంతరము వారు వ్రాసిన రెండు మరణ శాసనములను రాజమహేంద్రవరమునకు తెచ్చి,3-4-1886 న కార్య నిర్వాహక

సంఘము వారు కొన్ని నిర్ధారణలను చేసిరి. ఆ ప్రకారము వీనిని రిజిస్టర్—లేఖారూడ్యము చేయించిరి.అందరును చేవ్రాళ్ళు వ్రాసిరి. 9-4-1886 న మరికొన్ని నిర్ధారణలు చేయ బడినవి. వ్యయములను గూర్చిన లెక్కలను వీరేశలింగము గారే చూచు కొను చుండెడి వారు. ఇంకను ధనము కావలసి వచ్చుచుండెను. వివేక వర్ధని ద్వారా పలు సంఘ దురాచారములైన లంచముల అక్రమములు చేయు వారిని హెచ్చరించి, ఖండించుట జరుగుచునే యున్నది. ఆ కాలమున నొక న్యాయమూర్తి రాజమహేంద్రవరమునకు వచ్చెను. అతను లంచముల నిరు పక్షము వారి నుండి గ్రహించి, న్యాయ పరిశీలన చేసి ,న్యాయ మెవరి పక్షమున నుండిన ,వారు తక్కువ ధన మొసగినను పక్షమున తీర్పు నిచ్చి, ప్రతి పక్షము వారిచ్చిన అధిక పైకమును వారికి తిరిగి ఇచ్చి వేయు చుండిరి. ఈ విషయమును గూర్చి హాస్య సంజీవనిలో సంభాషణలను వ్రాయగా,నతడు ఆరు నెలల వరకు లంచములు గైకొనుట మానెను. వేరే తావుకు బదిలీకి యత్నించిననూ,సఫలము కాలేదు. తరువాత,తిరిగి లంచముల కలవాటు పడి యథాప్రకారముగా స్వీకరింప సాగెను.తిరిగి దీనిని గూర్చి,వ్రాయగా నతడు శలవుపై నేగెను. ఈ సమయముననే క్రొత్త ముద్రణా యంత్రము 1885లో రాజమండ్రికి తెప్పించ బడెను.

ఆత్మూరు లక్ష్మీ నరసింహము గారు లంచములకు బదులు ధాన్యము ,ఇతర గృహావసర వస్తువులను స్వీకరించెడి వారు. ఇతర వ్యాజ్య వ్యవహారములను పరిష్కరించుటకై వివిధ ఖర్చుల క్రింద కొంత ధనమును పుచ్చుకొనెడి వారు.దీనిని ఖండించ వలెనని వివేక వర్ధని 31-3-1886 న వచ్చు సంచికలో దంభాచార్య విలసనమను ప్రహసనమును ప్రకటించిరి. దంభాచార్యులు,జంబుకేశ్వర శాస్త్రి,స్వామి శాస్త్రి—ఇందలి పాత్రలు. వారి లక్షణములను భాషణల ద్వారా ప్రథమ భాగములో ప్రకటించగా,ఆ పాత్ర భాషణములు లక్ష్మీ నరసింహం వగైరాల నిత్య చర్యలను ప్రత్యక్షంగా చూపించి,దోషారోపణలను వెల్లడించి,హేళన చేయుట జరిగినది. దీనిని చదివిన వారికి విపరీతమైన కోపము వచ్చినది. ఆ పత్రిక ప్రకటన ప్రతులను దగ్ధము చేసిరి. వారిని దూషించి,అభియోగము హెచ్చి, కోర్టుకు లాగెద మని బెదిరించిరి. పత్రిక అధికారికి నోటీసు పంపించిరి. ఒకరి నొకరు నిందించు కొనుచు ఉత్తర ప్రత్యుత్తరములు సాగినవి. రామ కృష్ణయ్య గారిచ్చిన 10 వేల ధనమును ఈ లక్ష్మీ నరసింహము గారిని ట్రస్టీగా నియమించుట వలన, వీరేశలింగము గారిపై వివేక వర్ధని ప్రకటన వలన కలిగిన కోపముతో ఆ ధనమును వితంతు వివాహ సమాజమునకు సరియైన విధముగా నుపయోగ పడ నీయక,వివిధ కుట్రలను,కుతంత్రములను ప్రయోగించ సాగెను. ఆ వ్యవహారమును దీటుగా నెదుర్కొని,నీతి బద్ధముగా సమాజము నందలి ప్రధాన సభ్యుల సహాయముతో ప్రత్యామ్నాయ ప్రక్రియను వీరేశలింగము గారు సలుప సాగిరి. చివరకు ఆ లక్ష్మీ నరసింహము గారిపై కోర్టులో దావా వేయుటకు వీరు నిర్ణయించు కొనగా, ఉభయులకూ మిత్ర సములైన శ్రేయో భిలాషులు సద్ది చెప్పి,ఆ ప్రయత్నము నాపించిరి.ఆయన లిఖిత పూర్వకముగా క్షమాపణ ఇచ్చిన తరువాత –ఆవ్యవహారము సద్దు మణిగి పోయినది. అయినను,నరసింహము గారు ఆ వితరణ ధనమును విపరీతార్థములు తీసి,తన ఇచ్ఛ వచ్చిన రీతిగా ఖర్చు చేయ నెంచిరి. కాని ,ఆ యత్నములను సాగ నీయక, వీరు సమాజము ద్వారా సభల నేర్పరచి, తీర్మానముల నామోదించి,వ్యవహారమును సక్రమముగా జరిపించుటకు నిర్ణయము చేసిరి. ఆ యా నిర్ధారణలు వలన వీరేశలింగము గారు సమాజ నిర్వహణ శాశ్వత సభ్యత్వమును సంపాదించ గలిగిరి. ఒకసారి దాత ఇచ్చిన ధనము నుపయోగించు వితంతు వివాహ సమాజము రాజమండ్రి యందున్నది కాదను వాదనను లక్ష్మీ నరసింహము గారు వెలి బుచ్చగా, దానిని కూడా సమాజము వారు

ఖండించి,సత్యమును స్థాపించ గలిగిరి. ధనముపై వడ్డీ నంతటిని వితంతు వివాహ వధూ వరులకు సమానముగా పంచ వలెనను తీర్మానమును కూడా ఖండించి,భావి యందు జరుగబోవు వివాహములకు కూడా దీని నుపయోగించి వలెననియు,ఉచిత ధన సహాయము లబ్ధి దారులను బద్ధకస్తులుగా మార్చ గలదనియు,వాదించి గెలిచిరి. ధర్మ కర్తకు తోడుగా మరి ఇద్దరు ధర్మ కర్తలను చేర్చ వలెనను వాదన కూడా తీర్మానించ బడినది. ధనమును నిలువ చేయుటనునది ప్రభుత్వ బ్యా0కుల యందే జరుప వలెనన్ననది మరియొక తీర్మానము.

1886,1887 స0.లలో సమాజము ద్వారా ఒక్క వితంతు వివాహమైనను జరుప బడలేదు. కొందరు తాము నివసించు గృహముల వాటాకు తగాదా పడగా,వారికి న్యాయ సమ్మతముగా నా ఏర్పాట్లు సరి చేయ బడినవి. 1887 లో చివరగా వీరేశలింగము గారి ద్వారా వసూలైనది రు .742-12-4,చందాలద్వారా రు 1585-4-0(మొత్తము రు 2328-0-4).నెల జీతముల క్రింద ,ధనము దానము పోగా –మిగిలినది రు 212-13-4. ఈ సమయమునందే వితంతు వివాహ దంపతులలో కొందరికి విపత్తు ఏర్పడినది. 1888-7-6 న కొమ్మరాజు గోపాలం,వల్లూరి పున్నమ్మకు వివాహము జరుప బడినది.(11వది).వీరి పెండ్లికిరు 1001+ 200–వధువు నగల క్రింద ఖర్చయ్యెను.వీరికి నెలకు 2/చొప్పున ధనము నొసంగ సాగిరి. వీరికి వసతిగా నింటి నిదివరకే ఇచ్చి యుండిరి. 1888-10-17 న కోదండ రామయ్య గారికి ద్వితీయ వివాహము జరుప బడినది. దీనికి రు 75/ లు ఖర్చయినవి. 29-3-1889 న ఒక కోమటి వివాహము జరుప బడెను. పురోహితుని,వంట బ్రాహ్మణుని పంపి వేయుటచే ఇక ముందు నెల జీతము లిచ్చు భారము సమాజమునకు తప్పినది. ఇతర ఖర్చులను వీరేశలింగము గారే భరించసాగిరి. 1892 లో రెండు వివాహములు, 1893 లో రెండు వివాహములు చెన్నపట్టణము వెళ్లునప్పటికి – 1907వరకు 10 వివాహములు జరిపించ బడినవి.వీరికి ఇళ్ల నిచ్చు తీర్మానం లేదు. ప్రతి పెళ్ళికి రు 100/వరకు నిచ్చు చుండిరి. తనకు కావలసి వచ్చిన ధనమును వీరు మిత్రులైన న్యాపతి సుబ్బారావు పంతులు గారి వద్ద పుచ్చుకొను చుండిరి. వడ్డీ వలదని,వీరు తిరిగి ఇచ్చి నప్పుడే వారా బాకీని స్వీకరించెడి విశాల సౌహార్ద హృదయులై యుండిరి. 27 వ వివాహము చేసి,వీరేశలింగము గారు చెన్నపురికి వెడలిరి. అక్కడ 35 వ వివాహము జరుగు చుండగా నరసింహము గారు ,సోమయాజులు గారు వీరిని చూడ వచ్చిరి. ధనము తరిగి పోవుటచే,వివాహ ఖర్చులను నూరు నుండి యేబదికి,కొన్నింటిని ఇరువదికిని తగ్గింప బడినవి. తరువాత వరులే వివాహ వ్యయములను భరించుటకు ముందుకు రాసాగిరి. 1881–1890 వరకున్నది ప్రయాస దశ. ఈ కాలమున వీరు యుదయము పది నుండి– సాయంత్రము 5 వరకును పాఠశాలలో పనిచేసెడి వారు. ఆ కాలమున వీరు ఉబ్బసము దగ్గు చేత బాధ పడుచుండియు,పాఠశాల పనులు మానక,విద్యార్థి సంఘములకు పోయి,ఉపన్యాసము లిచ్చుట,పాఠశాలలందు కార్య నిర్వాహక సంఘ సభ్యుడుగా చురుకుగా పని చేయుట,మహమ్మదీయుల విద్యార్థి భోజన గృహము నడుపుట ,పారిశుధ్యవిచారణ సంఘ సభ్యత్వము,తాలూకా స్థల నిధి సంఘము,మండల నిధి సంఘము లందును సభ్యుడుగా నుండి,యనేక కార్యక్రమములను శ్రద్ధగా,దీక్షగా నిర్వహించుచుండెడి వారు. ఆ సమయము నందు పలు ప్రజోపయోగ తీర్మానములను,కార్మికుల వేతన నిర్ణయములను,ప్రజలు చెల్లించ వలసిన పన్ను రొక్కమును ,వీధి దీపముల సౌకర్యములను ,కార్మికుల కష్ట నష్టముల పరిష్కారమునకు —ప్రయత్నించి ,సఫలీకృతులైరి. రోడ్లను ఆక్రమించి నిర్మించు పనుల నెదిరించి,వీలైనంత వరకు నిరోధించిరి.

ఆసుపత్రులందు రోగుల బాధలను,వారి కిచ్చు పాలను,రొట్టెలను గూర్చిన యన్యాయమును వెలికి తీసి,వాటిని నిరోధింప గలిగిరి. వైద్యుని యక్రమములను పట్టించి,వాని చేత క్షమాపణను కోరు నట్లొనరించిరి. పలు సభలయందు వీరు0డి,దొరల యధికార నిర్ణయములను కాదని,తమదైన న్యాయ నిర్ణయములను ప్రకటించి,చేవ్రాలు చేయుట వీరి కలవాటు. ఆరోగ్యము భంగమగుటచే కొంత బాధ పడు చుండెడి వారు. పలు సభ ల0దు ఎందరో సభ్యు లున్నను వీరి కప్పుడప్పుడు అగ్రాధి పత్యము నొసగి గౌరవించెడి వారు. 29-5-1888 న గోదావరీ మండల సంఘ సభలో 15 మంది సభ్యులు, ఒకరిద్దరు తహశీల్దారు లున్నను,వీరికే అగ్రాసనాధిపత్యము నిచ్చిరి.

వీరు రెండు పాఠశాలలకు కార్య నిర్వాహక సంఘ సభ్యుడుగానే కాక, ఇన్నీసు పేట బాలికా పాఠశాలకు కార్య నిర్వాహకుడుగా నుండిరి. బాలికలు జీతములు చెల్లించకపోవుటచే అధ్యాపకులకు జీతము లివ్వలేక పోవు చుండిరి. దానిని గూర్చి,మోబర్లీ దొర గారికి తెలియ చెప్పి,జీతములను ఇప్పించు పద్ధతి నేర్పాటు చేసిరి. స్త్రీల స్థితిని బాగొనరించ నుద్దేశించి, స్త్రీల విద్య నభివృద్ధి పరుప వలెనని సతీ హిత బోధిని యను నొక మాస పత్రికను వీరారంభించిరి. తరువాత సత్య వతీ చరిత్రము,చంద్రమతీ చరితము, సత్య సంజీవని ,పత్నీ హిత సూచన, దేహారోగ్య ధర్మ బోధిని—యను పుస్తకములను వీరు రచించిరి.తరచుగా సభలలో వారము వారము ధర్మోపన్యాసములను చేసెడి వారు. 1881–1890 నడుమ చమత్కార రత్నావళి,రాగ మంజరి నాటకములను ఇంగ్లీషు నుండియు,రత్నావళి,మాళవికాగ్ని మిత్ర నాటకమును సంస్కృతము నుండియు తెలిగించిరి. ప్రహ్లాద నాటకము, దక్షిణ గోగ్రహణము ,సత్య హరిశ్చంద్ర నాటకములను ,కొన్ని నాటక కథలను,ప్రహసనములను ,ఆంధ్ర కవుల చరితమును వీరు రచించిరి. వితంతు వివాహ విషయమును,ఇతర విషయములను గూర్చి పెక్కు ఉపన్యాసములను వ్రాసి ప్రచురించిరి. పూర్వ కవుల గ్రంధములను కొన్నిటిని సంస్కరించి,ప్రకటించిరి. బాలుర విద్యను వృద్ధి పరచి,చక్కని భావి పౌరులుగా వారిని తీర్చి దిద్ద నుద్యమించిరి. అందుచేత, పాఠశాలల నన్నిటిని, ఒకే ఒక్క పరిపాలక సంఘము క్రిందకు తెచ్చి,చక్కని బోధన చేసి,సరిగా పని చేయుటకు వీలయిన విధానము నేర్పరచిరి. ఈ నూతనోన్నత పాఠశాలకు మందిర మొకటి కట్టుటకు స్థలమును బేర మాడి ,కొనుటకు నిర్ణయించిన సమయమున తహశీల్దారు తమ బంధువులకా స్థలమును ముందుగానే కొని వ్రాయించెను. ,అయినను,వీరా స్థలమునకు పోరాడ ప్రయత్నించి,తిరిగి దానిని స్కూలునకే కొన గలిగిరి. ఇప్పుడా భవనమున్న ప్రదేశమిదియే.ఈ కార్యక్రమము లన్నిటి యందును నిర్విరామకృషి యొనర్చు వీరికి ఆరోగ్య మంతగా సహకరించుట లేదు. అదే సమయమున వీరి కన్ని విధముల నండగా నిలిచిన ముగ్గురు ప్రధాన మిత్రు లకాల మరణము నందిరి. వారే —శ్రీ బసవరాజు గవర్రాజుగారు 16-7-1888 న, సత్తిరాజు మృత్యుంజయరావుగారు ,దేశిరాజు పెద బాపయ్య గారు . ఈ లోటు వలన వీరు చాలా ఖిన్నులై,తన దేహ బలహీనత వలన ముందు కార్యక్రమములను జరుప గలనా యని వేదన పడ జొచ్చిరి. దైవముపై భారమును వేసి, తన కార్య దీక్షను కొనసాగింప యత్నించిరి. మంచి వారిని దైవ మెక్కువ కాలము జీవింపనీయడని చింతించిరి.ఈ భాగము నందు వీరేశలింగము గారు ఇతరులతో చేసిన ఉత్తర ప్రత్యుత్తర వివరములను –మూలములను ఇంగ్లీషు–తెలుగు భాషలలో విపులముగా ప్రకటించిరి.ఇందులకు వారా పత్రములను తేదీల ప్రకార మెంత జాగ్రత్తగా భద్రపరచిరో,వానిని తమ జ్ఞప్తి యందుంచు కొనగలిగిరో–మన మెరుగ గలము.ప్రతి విషయమును శ్రద్ధగా పరిశీలించి,దానికి సంబంధించిన అధికార వ్యవహార పత్రములను ప్రకటించిరి. న్యాయ సమ్మతముగా తీర్మానములను,దస్తావేజులను రచించగల సామర్థ్యము,ప్రావీణ్యము వీరికి

గలదు. వీరి బహు ముఖ ప్రజ్ఞను,నిరంతర సామాజిక సేవా స్పృహను ,స్త్రీ-వితంతు జనోద్ధరణమును,అనాచార ,అక్రమ కార్యములను ఖండించుటను మనము గ్రహించి,శ్లాఘించి,భావి పౌరులకు ప్రోత్సాహముల నందించుట ముఖ్యము కదా. ఆ కాలము నందలి విద్యాధికులును ,అధికారులును,దొరలును,వివిధ రాష్ట్రము లందలి వారును —దేశ వ్యాప్తముగా వీరిని, వీరి దేశ సేవను,భాషా సేవను ఉగ్గడించిరి.

రెండవ భాగము

ఇందలి ప్రథమ ప్రకరణమును 1910 జూనులో వారి భార్య ఉండగా గ రచించిరి. (బెంగుళూరులో). తరువాత మూడు భాగములను బెంగుళూరులో వేసవిలోవెళ్లి నప్పుడు అక్కడే రచించిరి.

మొదటి ప్రకరణము **—1890—1900 —**పుర మందిరాదిక నిర్మాణ దశ

1879 నందు వితంతు వివాహ విషయమున పలు ఉపన్యాసముల నిచ్చుటకు తావు సరిగా దొరకక,బాధ కలుగు చుండెడిది . అందు చేత వీరు రాజమండ్రి నందొక పుర మందిర నిర్మాణమును గావించి,అందు ప్రముఖుల చేత నుపన్యాసముల నేర్పరుప దగు నని యోచన చేసిరి. దానికి తగిన స్థలమును,వలసిన ధనమును సమకూర్చుట యథా విధిగా నొక పెద్ద సమస్యయే యై యుండెను. చందాల ద్వారా నా సొమ్మును సేకరింప ప్రయత్నించగా కొద్ది ధనము మాత్రమే లభించెను. పలువురు ఉచిత సలహాల నిచ్చుట,చేసిన పనులను విమర్శించుట ,కాసైనను విదల్చకుండుటచే నీ యత్నము కుంటు పడ సాగెను. గొప్పవాడైన మక్డనాల్డు దొర గారి పేర నా మందిర నిర్మాణ ముచిత మని వీరేశలింగము గారు భావించిరి.15-8-1880 సం .లో ఈ విషయమును గూర్చి పుర జనుల సభలో నిశ్చయము జరిగి,చందాల వసూలు చేయుటకు, వీరిని కార్యదర్శిగా నియమించిరి. రు 500/లు చందాగా లభించెను. పుర మధ్యమున ధర్మ వైద్యాలయ వీధి యందొక స్థలమును దామరాజు నాగరాజుగారి పేర వీరు కొని యుండిరి. 1887 లో మరొక సభలో వీరు తిరిగి చందాలను సేకరింప యత్నించిరి.కానీ ఫలితము లేక,విసుగు చెందిన వారై 26-3-1889 న ఒక లేఖను వీరు చందాదారులకు పంపిరి. ఇక పుర మందిర నిర్మాణమును తామే నిర్వహించి,వ్యయమును భరించెద మని వారు ప్రకటించిరి. గత పది సం. లుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించ లేదని వారి మనో వేదన. టౌన్ స్కూలు ఎదురుగా దామరాజు నాగరాజు గారి దగ్గర తన స్వంత ధనముతో స్థలమును వీరు టౌన్ హాలు కొరకు కొన్నారు. ఇందు కొరకు తమకు రాగల ఇతర ఆదాయము లన్నిటిని వెచ్చించ తల పెట్టిరి.న్యాపతి సుబ్బారావుగారు రు 500/లు,అజ్జరపు వీరయ్య అప్పుగా నిచ్చినది రు 400/లు —వీనితో ఇటుకలను, కర్రలను కొని,పని వారిచే వీరి ఇంటి వద్దనే పనులను చేయించుట ప్రారంభించిరి. తన పుస్తకాలను అమ్మగా వచ్చినది రు 1000/లు ,సర్వ కళాశాల వారు వీరిని పరీక్షకునిగా నియమించి ఇచ్చిన ధనము మొత్తము మీద రు 7000/లు దొరకి,ఖర్చులకు సాయ మైనవి. నాళము కామరాజుగారు తన స్థలమునుండి 30-40 గజముల నొసగిరి. కర్రలు కోయించుకొనుటకు స్థలమును ఖాజా అహమదల్లా ఖాన్ గారును,కొన్ని కర్రలను తక్కువ ధరలకు మామిడి రామస్వామి గారును ,జూపూడి రామానుజం గారును ,మరి ఇద్దరు,ముగ్గురు–5 కర్రల చొప్పున ఉచితము గాను ఇచ్చి, సహాయ పడిరి. గవర్రాజు గారి భార్య తన స్థలమును రు 153/లకు వీరి కమ్మినది. వెరశి,స్థలము నిమిత్తము రు 653-8-0,మందిర నిర్మాణమునకు రు 5149-15-3లు,
పఠన మందిరము+బిలియర్డ్స్ గదికి రు 1269-0-0లు, మొత్తముగా రు 7072-7-3 లు అయినది. మరి కొంత కలపను తన శిష్యుడైన భద్రాచలం తహశీల్దారు గారు సయ్యద్ వజీరుద్దీన్ సాహెబ్ గారు

29-4-1889 న ఒక ఉత్తరము వ్రాసి, రాజమండ్రి నుండి ముగ్గురు కలప వర్తకుల నుండి సేకరించమని వీరికి వ్రాయగా,వారా కలప కర్రల నుచితముగా పుర మందిరమున కొసగిరి. 1890 అక్టోబరులో దీని గృహప్రవేశము జరిగినది. 23న చెన్నపురి రంగాచార్యులు గారును,నవంబరు 15 న కలకత్తా వాసి శ్రీ శివ నాధ శాస్త్రి గారొక ఉపన్యాసము నక్కడ ప్రసంగించిరి.1896 సంవత్సరాంతమునకు దీనిపై చేసి అప్పులన్నియు తీరి పోయినవి.1897 డిశంబరులో వీరొక నిక్షేప పత్రమును (ట్రస్టీ డీడ్)ను వ్రాసి,రిజిస్టరు చేయించిరి. 13 మంది ట్రస్టీలను వీరు నియ మించి,దాని కొలతలను,కార్య నిర్వహణ విధానమును, ఇతర ముఖ్య షరతులను,అద్దె వసూలు,ఖర్చుల నియంత్రణను—వీరు నిర్దేశించిరి. దాని స్థల వైశాల్యము 1720.చ.గ.లు. పుర జనుల యుపయోగార్థమీ మందిరమును వీరు కట్టినను,తోడు పడుట మాని కొందరు పలు రకములైన (4) వ్యాజ్యములను వీరిపై తెచ్చిరి. వీరి బాల్య మిత్రుడును,సహోద్యోగియు నై శ్రీ ఏలూరి లక్ష్మీ నరసింహము గారే ఈ వ్యాజ్యములను వేసిన వారిలో ఒకరు. వారి అనుచిత ప్రవర్తనలను గూర్చి,వివేక వర్ధనిలో వ్రాసి, వీరు ఖండించుటయే ఆ పనికి మూల కారణము. వారిపై మరి కొన్ని అభియోగములను వీరు తెచ్చి,,వారికి బాధ కలిగించిరి. అందు చేత,నరసింహము గారు వీరిపై 15-7-1890 న వ్యాజ్యమును వేసిరి. దానిని కొట్టి వేయగా,వీరిపై మరొక వ్యాజ్యమును తెచ్చిరి. మహారణ్య పురాధిపత్యమన్న ప్రహసనము తన్ను ఉద్దేశించి ప్రకటించినది వీరేశలింగము గారే ననియు,కనుక వారిని శిక్షింప వలసిన దనియు ఆ వ్యాజ్యము సారాంశము. వీరి తరఫున మిత్రుడైన న్యాపతి సుబ్బారావు గారు పట్టుదలతో వాదింప సాగిరి. ఈ కాలమున వ్యాజ్యములకు కోర్టులకు తిరగ వలసిన పని చేత,వీరు ఒక సం .కాలము శలవు గైకొనిరి. కొందరు సాక్షులు వీరిపై తప్పుగా చెప్పినను, పలు విధములుగా విచారించి,చివరకు 27-7-1891 న వీరిపై వచ్చిన అభియోగములను రెంటిని కొట్టి వేసినారు. ప్రతి పక్షి యొక్క ప్రవర్తనను గూర్చి కొంత మందలింపు కూడా తీర్పులో చేసిరి.

నరసింహము గారు 15-7-1890న వీరిపై మరియొక వ్యాజ్యమును వేసిరి. తనకు మాన నష్టమునకై రు 3000/లు ప్రతి వాదిచే నిప్పించ వలసినదని ఆ వ్యాజ్యము .అది సుమారు 2 సం .ల 9 నెలలు వరకు నడిచినది.దీని తీర్పు వీరి కనుకూలముగా 10 -3-1893 న ఇవ్వబడినది. ఈ అభియోగముల సంపూర్ణ వివరములను ఇంగ్లీషు,తెలుగు భాషలలో స్పష్టముగా నీ చరిత్రలో వీరేశలింగము గారు ప్రకటించుట వీరి వ్యవహార దక్షతను వెల్లడి చేయ గలదు. పుర మందిరమునకు వలెనే వేరొక ప్రార్థనా మందిరమును రాజ మహేంద్రవరము నందు చందాల ద్వారా సేకరించిన ధనముతో నిర్మింప జేసిరి. దానిని గూర్చి 1897 మే నెల సత్య సంవర్ధని యందు వీరు పొందు పరచిరి. మొట్ట మొదటగా రు 100/లు ప్రార్థనా సమాజమున కిచ్చెదనని చెప్పి,తన మరణ శాసనములో శ్రీ టి. శేషాచలం నాయుడు గారు తెలుపగా– ఆ ధనమును వారి సోదరులు శ్రీ వీరేశలింగము గారి కంద జేసిరి. స్థలమును వీరే యొసగిరి. ఆ యోచనను ప్రశంసించి,పలువురు తమ శక్తి కొలది ధన సహాయమును చేసిరి. కొందరు స్త్రీలు కూడా రు3/, 5/లచొప్పున చందాల నొసగిరి. పురుషులతో పాటు స్త్రీలను పరిశుద్ధ ఆస్తిక భక్తి కల వారగుట ముదావహము. ఈ మందిరమునకు పైన మేడ మందిరమును కూడా విశాలమైన హాలుగా కట్టబడినది. అందుకు రెబ్బాప్రగడ పాపయ్యగారు రు 1500/లను ఇచ్చిరి. 17-4-1897 న ఆర్. వెంకటరత్నం నాయుడు గారు బందరు నుండి వచ్చి,దీని గృహప్రవేశమును నడిపించిరి. 1893 స0.ఆరంభమున వీరేశలింగము గారికి రావు బహదూర్ బిరుదమును ఇండియా దొరతనము వారొసగి,గౌరవించిరి. వీరి నభినందించుచు,దేశ వ్యాప్తముగా నున్న పలువురు ప్రముఖులు లేఖలు వ్రాసి, పంపిరి. మెట్కాపు

దొర వారు,కా. రంగయ్యశెట్టి మద్రాసు,ఎన్. పట్టాభిరామారావు,టి.వరద రావు-కలకత్తానుండి,ఎం . బి . శ్రీనివాసయ్యంగారు హెచ్.ఎం . కాకినాడ సాహిత్య సమాజము వారు,చెన్నపురి,ఇతర స్థలముల నుండి ఇంగ్లీషు పత్రికలలో ప్రకటింపబడి,అభినందన వ్యాసములు,ఆంధ్ర ప్రకాశిక 14-1-1893న—మొదలైనవి.

రాజకీయ కళాశాల ప్రధానాధికారి మెట్కాపు దొర వారి అధ్యక్షతన ఒకటి,చెన్నపురి విద్యా విచారణాధికారి డంకను దొర గారి అధ్యక్షతన–వీరికి రాజమహేంద్రవరములో రెండభినన్దన సభలు నిర్వహింప బడినవి. వితంతు వివాహ విషయములను, ఇతర విశిష్ట బోధనలను వీరు పలువురకు సమానముగా చేసినను, పెద్దల కంటే ,పిన్నలే వీరి కనుయాయు లైరి. అందు చేత,వీరి కార్యక్రమముల కండగా నిలిచి, ఫలింప జేసిన ధన్యులందరు యువకులైన వీరి విద్యార్థులే యగుట/యనుట సత్యము. ఆస్తిక పాఠశాల నెలకొల్పబడినను 1889 వరకు ఆ సదుద్దేశము నెరవేరననే లేదు. వీరు కొందరు విద్యార్థుల పై చదువులకుమదరాసు(సైదాపేట)కు పంపుచుండిరి. ఒక పాఠశాలను ఏర్పాటు చేయుటకు వీరు యత్న మొనరింప సాగిరి. న్యాపతి సుబ్బారావుగారిచ్చిన రు 1600/లలో ఇన్నీసు పేట మధ్యమున నున్న విశాలమైన తోటను వాడ్రేవు శ్రీరాములు గారి వద్ద కొన గలిగిరి. పాఠశాల స్థాపనకు,వెంకట శివుడు,మృత్యుంజయరావుల కుద్యోగము నిప్పించుటకు సహాయము నంగీకారముల నొసగు మని వీరు మెట్కాపు దొర వారికి వ్రాయగా, వారు సానుకూలముగా స్పందించి, జవాబు పంపిరి. ఉన్నత పాఠశాలకు బదులుగా వీరిని మధ్యమ పాఠశాలను ప్రారంభించుటకు మెట్కాపు దొర వారంగీకరించిరి.పరీక్ష ప్యాసయిన మృత్యుంజయ రావు గారికి రు 100/లజీతము నిచ్చి,రాజకీయ పాఠశాలలో నుద్యోగ మొసగిరి. వెంకట శివుడు తప్పినందున నతడు మధ్యమ పాఠశాలలో పని చేయుట కంగీకరించెను. గంజాము వెంకట రత్నము గారు తమ పేరున కాకినాడ కాలేజీలో ఒక విద్యార్థికి వేతనము నేర్పాటు చేయుటకు రు 2000 /ల నిధిని పంపి, దానిని కార్యరూపమున పెట్టుటకై వీరేశలింగము గారి కొక లేఖను వ్రాసిరి. వీరు దాని నేర్పరుప శేషగిరిరావను కార్య దర్శిని పంపిరి. 1898 లో చెన్నపురి దొరతనము వారు వీరిని సర్వ కళాశాలా సభ్యునిగా చేర్చినారు. వీరి ఆరోగ్య పరిస్థితి బాగుండక,వీరి వివేక వర్ధనిని నిలుపు జేసిన తరువాత ,1891లో న్యాపతి సుబ్బారావు పంతులుగారు తెలుగులో చింతామణి యను పత్రికను (మాస)వీరి వివేక వర్ధని ముద్రాక్షర శాల లోనే ముద్రి మ్పించుచు వచ్చిరి. దాని వ్యయము నంతయు వారే భరించు చు0డిరి. 1897సం .జూనులో ఏలూరు నందు గోదావరీ మండల సభ జరిగినది.జూను 9 న మండల సాంఘిక సభ కూడా జరుప బడినది.దానికి న్యాపతి సుబ్బారావు గారు అగ్రాధిపత్యము వహించ వలసి యుండగా, కారణాంతరముల వలన వీరేశలింగము గారధ్యక్షత వహించిరి. ఆ సభకు స్త్రీలను కూడా ఆహ్వానించిరి. దీనిని కొందరు ప్రాచీనాచార వాదులు విమర్శించిరి. కొందరు ఖండించినను, దాసు శ్రీరాములు గారు,సత్తిరాజు కామేశ్వరరావు గారు తమ భార్యలను ఈసభకు నిర్భయముగా వెంట గొని వచ్చిరి.

1894 లో వేసవి శలవులలో వీరు చెన్నపురికి పోయినప్పుడు వీరి స్నేహితులైన బుచ్చయ్య(మన్నవ)పంతులు గారి ఇంటి ఎదురుగా పరశు వాకములో నున్నఇంటిని పడగొట్టించి,మేడ ఇల్లుగా కట్టించిరి. అందు వీరు నివసించుటకు తమ నివాసమును చెన్నపురికి మరలింప నిశ్చయించిరి. అందుకు రెండు కారణములు కలవు.

1)వీరి గ్రంథ రచన యధికమై,పలు పుస్తకములు ముద్రణ కెదురు చూచుచున్నవి. వానిని అందముగా నచ్చట ముద్రించి,ప్రచురించుట యొక కారణము.

2)వీరు సంఘ సంస్కార విషయమున రాజధానిలో పని చేయ వలెనని,తలంచుట రెండవ కారణము. ఇందు కొరకై,వీరు రెండు సం .లు శలవు గ్రహించిరి. పుస్తక ముద్రణము ధనముతో కూడిన పని. పరుల ముద్రణాలయములో చేయించుట కధిక ధనము కావలెను. కనుక,వీరాలోచించి,రాజమహేంద్రవరము నందలి తమ ముద్రణా యంత్రమును అమ్మివేసియు,న్యాపతి సుబ్బారావు గారి దగ్గర రు 1000/లను ఋణముగా ధనమును ముద్రణకై సమకూర్చుకొనిరి.ఇంగ్లండు నుండి వీరు ఆవిరి యంత్రమును ముద్రణకై తెప్పించు కొనిరి. ఎప్పటి ధనము నప్పుడే వ్యయము చేయుటచే ,వీరి దగ్గర ధనమేమియు నిలువ లేదు. న్యాపతి వారు చింతామణి పత్రికను నడపలేక,దాని ముద్రణ, ప్రచురణ బాధ్యతలను వీరి కప్పగించిరి. అందుచేత,వీరు చింతామణి ముద్రాక్షర శాలను ప్రారంభించిరి. ఛాన్దసు లెక్కువగా గల రాజమహేంద్రవరము నందే ప్రాచీన యనాచారములను ఖండించి,సంఘ సంస్కరణలను చేపట్టిన వీరు మదరాసు నందు దీనిని విస్తరించి,బహు ముఖ ప్రజలకు చైతన్యమును కలిగించి, ఆధునికతను,నవ నాగరికతను ,సర్వమత సమాదరణమును ప్రబోధింప వీలగునని తలంచినారు. అట్టి కార్యసాధనకు జన్మస్థలమును వీడుటకు వీరు ఎక్కువగా చింతించలేదు.

వీరు రాజమహేంద్రవరము వీడుటకు సన్నద్ధులైరి. అని తెలియగానే అచ్చటను,కాకినాడ లోని రెండు మహా సభలను జరిపి,వీరిని బహుధా ప్రశంసించి,తమ యభిమానమును ప్రకటించి,పంపుట ,దానిని పత్రికల ద్వారా ప్రకటించుట పలువురకు హర్ష దాయక మైనది. వీరు రాజమహేంద్రవరమున నున్న కాలమున మొత్తము 27 వితంతు వివాహములును జరిపించిరి.ఇందులో,19వ వివాహము మాసూరి పురుషోత్తము గారికి– కాకినాడ లోని మాధ్వ వితంతు బాలికకు 6-11-1892 న జరుప బడినది.

వధూవరులను పిలిపించి,మాట్లాడించి,వివాహమును నిశ్చయము చేసిరి. పెళ్లి పీటల మీద నుండి వధువు తరఫు వారు తరలించుకొని పోవుటకు రాగా,వీరి ఆజ్ఞ మీద వారి నందరిని బయటకు తరిమి వేసిరి. బాలిక మైనరుకు వివాహము చేయించి నారని వీరిపై యభియోగమును రాజకీయ వైద్యుడు –ఆమెను 16 యేండ్ల కన్యగా ప్రకటించి,ఆ ఆపదను తప్పించెను. 20 వ వివాహము పిఠాపురము నందు సంస్థానోద్యోగి ఆదిపూడి సోమనాధరావుది . గంజాము నుండి వచ్చిన బాల వితంతువు సీతమ్మను అతడు వివాహ మాడెను. ఆమె వితంతు వివాహ ప్రచారమును పత్రిక లందు చదివి, ప్రోత్సాహము నంది, స్వయముగా ఖర్చులను,కష్టములను భరించి,రాజమహేంద్రవరమునకు వచ్చి,వీరి ఇంటికి చేరి, ఈ వివాహమును చేసికొనుట–ఈ ఉద్యమము సఫలము నంది ప్రేరణ కలిగించుటకు సరియైన ఉదాహరణము. 28-6-1893 న ఈ పెళ్లి జరుప బడెను. వీరు మదరాసు పరశువాకము లోని స్వగృహమునకు చేరి,(1897 డిశంబరులో)తమ పుస్తకముల నన్నిఁ ఉంటిని రెండేళ్ల కాలములో పది సంపుటములుగా ముద్రించి,ప్రకటించిరి. ప్రూఫులను వారే స్వయముగా దిద్దుకొనుట,ఇతర ముద్రణా సంబంధమైన ఒత్తిడులు కారణముగా–-వీరు చింతామణి పత్రికను నడుప లేక,దాని ముద్రణము నాపి వేసిరి. చెన్నపురిలో సంఘ సంస్కరణ సమాజమునకు వీరి నధ్యక్షులుగా చేసిరి. చెన్నపురి పాఠశాల పుస్తక దేశ భాషా సంఘమునందు వీరు ఒక కార్య నిర్వాహక సభ్యునిగా చేర్చుకొన బడిరి.దొర తనము వారి పఠనీయ గ్రంథ సభలో వీరొక సభ్యునిగా చేర్చ బడిరి. సర్వ కళాశాల వారు తమ ద్రావిడ భాషాధ్యయన సభలోను సభ్యులైరి. ప్రభుత్వము వారు ఉపకర గ్రాహులను చేయు తెలుగు పరీక్షలలో వీరి నొక పరీక్షకునిగా

నియమించిరి. సంఘ సంస్కార భోజనములు కొన్ని జరిపినను,వీరందు పాల్గొని,దాని వలన ఎట్టి ప్రయోజనములు లేవని నిరసించిరి.

సంఘ సంస్కరణను గూర్చి,కేవలము ఉపన్యాసము లిచ్చిన మాత్రమున యది యభివృద్ధి కాదనియు,దానికి తగిన ఆచరణను చేసి చూపించ వలెననియు–వీరు వెల్లడించిరి. వితంతు శరణాలయము నొక దానిని స్థాపింప యత్నింప వలెనని,దాని కొక ఇంటిని కొనవలెనని ధన సేకరణను మొదలు పెట్టిరి. యెన్.కె. రామస్వామయ్య గారు డబ్బు పెట్టుబడిని పెట్టెద మనిరి. చందాలు వసూలు చేయ వలెననియు ,రామస్వామయ్య గారి దగ్గర ధనమును ఋణముగా గ్రహించి,ముప్పావలా వడ్డీ చెల్లించ వలెననియు తీర్మానించి, ఇంటిని వెదకుమని వీరి కప్పగించిరి.వీరు వెల్లాల వీధిలో 23 వ నంబరు ఇంటిలో నుండిరి. 29 వ నంబరు ఇల్లు రు 3800/ లకు కొని,దాని పత్రములను వీరు తమ దగ్గర నుంచు కొనిరి. కాని ,ధనము సేకరింప బడక పోవుటచే అమ్మిన వారు తిరిగి పత్రముల నిచ్చి వేయు మని కోరిరి. దానికి వీరంగీకరించ లేదు. తానే స్వయముగా ఏ విధముగా నైనను ధనమును సంపాదించి,ఆ ఇంటిని తమ పేరు మీదనే కొనవలెనను నిర్ణయమునకు వీరు వచ్చిరి. రు 500/లను వీరు ముందుగా నొసగి,మిగిలిన పైకమును మరి మూడు మాసములలో చెల్లించెదమనియు,లేనిచో మొదటి 500 రు .లను వదలి వేసెద మనియు చెప్పగా-ఇంటి వారందులకు అంగీకరించిరి. తరువాత,నా ధనమును ఋణ సేకరణ ద్వారా పొంది,కార్యమును నెరవేర్చ గలిగిరి. కె,వి. కృష్ణారావు గారు ముందుగా నిచ్చిన 500/ రు .లను వీరు తిరిగి చెల్లించగా,వారందుల కంగీకరింపక,మరొక రు 500/ ల నొసగి,మొత్తము రు 1000/లను వితంతు శరణాలయమునకు వారి దానముగా నంగీకరించమని,వీరి కంద జేసిరి.వీరు వీరేశలింగము గారి శిష్యులు.అందు చేత,వీరి యందలి గౌరవ ప్రపత్తులచే వీరి చిత్ర పటమును ,బిలియర్డ్స్ టేబులును పుర మందిరమునకు బహూకరించి,ధన్యులైరి.చందాల రూపమున రు 159/లను ,వీరి స్వంత ధనమును కొంత కలిపి–మొత్తము రు 350/లను వితంతు శరణాలయము మూలధనము క్రింద సమాజ నిధిలో నుంచుటకు వీరొసగిరి.శరణాలయమున కొక స్వంత ఇల్లు నేర్పరచుట యోగ్యమని ఎంచి,పరశువాకము లోని గంగాధరేశ్వర కోవెల వీధిలో నొక స్థలమును 1900 లో కొని, 1902 లో ఇల్లు కట్టి ,పైన మేడను కూడా వీరే వేయించిరి. దీని క0తకు రు1250/లు ఖర్చయినది. దీనిని వారు సమాజము పేర వ్రాసి ఇచ్చెద మన్నను,వారు సహకరించ లేదు. కార్య క్రమములును సాగ లేదు. కాపురము లుండుటకు కాక,ఏదేని ఒక సమాజ కార్యక్రమము లందు జరుగ వలెనని, యోచించి,వీరాయింటిని బ్రహ్మ సమాజమునకు రు 650/లకు అమ్మించి,సొమ్ము నిప్పించిరి. ధనమును రాజా గజపతిరావుగారి ధర్మపత్ని బ్రహ్మ సమాజము వారి కొసగెను.

ఆ తరువాత, వితంతు శరణాలయమును చెన్నపురి యందు స్థాపించి,దానిని వీరు తమ ఇంటి లోనే నడుపు చుండిరి. 3,4 వితంతువు లెప్పుడీ గృహమున వీరితో నుండెడి వారు. వారి విద్య,ఇతర ఖర్చులను వీరే భరించెడి వారు. వారిని కట్టడి చేసి,సత్ప్రవర్తన కలిగి యుండు రీతిగా వీరే తీర్చి,దిద్దెడి వారు.వైద్యము,వస్త్ర సదుపాయములను కూడా చేకూర్చు చుండిరి. ఒక తెలుగు బాల వితంతువును సోమనాథ రావు తమ్ముడైన గోపాల శర్మ కిచ్చి వివాహమును జరిపించిరి. వీరక్కడ నున్న కాలమున వీరి ఇంటిలో 10 వ వితంతు వివాహము జరుప బడినది.(10). తమ్ముని వివాహము వీరు జరిపించి నందుకు న్యాపతి సుబ్బారావు గారును, వారి తల్లియు వీరేశలింగము గారిపై కోపించి,చాలా కాలము విరోధమును ప్రకటించిరి. దైవ కృప వలన,చివరకు వారే పలుకరించి,తిరిగి మిత్రులై చరించ సాగిరి. వీరు సుబ్బారావు గారి కియ్యవలసిన రు 1500/లను, వడ్డీ

క్రింద రు 200/లను చెల్లించి,తమ పత్రములను గైకొనిరి. వీరిపై కోపము వచ్చిన కాలము నందు సుబ్బారావు గారు హైందవాభివృద్ధి యను పత్రికను హిందూసమాజమును ప్రారంభించిరి. దీనిలో వితంతు వివాహములకు విరుద్ధముగా వ్రాయుట,ప్రసంగములు చేయుట జరిగినవి. కొంత కాలము తరువాత పత్రిక నాపు జేసిరి. చెన్నపురిలో జరిగిన 6 వ వివాహము కోకా వెంకట సుబ్బారావు నాయుడు గారిది. 3-1-1901 న జరిగినది. ఇది 33 వ వివాహము. నాయుడు శాఖలో మొట్ట మొదటిది ఇదియే. దక్షిణ భారత హిందుస్థాన బ్రహ్మ సమాజమునకు ,రాజా రామమోహన్ రాయ్ ల రాత్రి పాఠశాలకు –రాజా గోడే గజపతిరావు గారు సం .నకు రు 500/ల నిచ్చెడివారు. కాని , దానిని వారాపు చేసిరి. తరువాత దీనిని గూర్చి వీరేశలింగము గారు వ్రాయగా, వీరి పేరు మీద వారా 500/లను పంపుట మొదలిడిరి. దీనిని తమ మరణ శాసనములో వ్రాసి,శాశ్వత దానముగా దీని నొనరించిరి. వీరి నొక సారి తమ బంగాళా యందు సత్కారములు చేసి,గౌరవించి, —వలదన్నను రు 200/లను ఇచ్చిరి.దానిని వీరు జుబిలీ రూమునకు .లైబ్రరీకి దాన మొసగిరి. వీరు శలవుపై చెన్నపురిలో నుండగా,వీరిని చెన్నపురి రాజధానీ కళాశాలకును,అచ్చట నున్న కొక్కొండ వెంకటరత్నము పంతులు గారిని రాజమహేంద్రవరమునకు బదిలీ చేసిరి. వీరి శలవు ఇంకను రెండు నెలల వరకు నున్నను,వీరిని
వెంటనే నూతనోద్యోగమున చేరమని ఆదేశించిరి.

వారికి ఇంగ్లీషు రాదను నెపమున,వీరికి ఇంగ్లీషు బాగుగా తెలియుట చేతనే బదిలీలు సంభవమై యుండ నోపును. ఆ కళాశాలాధికారి స్థూఅర్టు దొర వారిని వీరు కలిసిరి. అచట కళాశాలలో పరీక్షా గ్రంధములను బోధించుటయే కాక,అన్ని తరగతులకును భాషాంతరీకరణమును కూడా నేర్ప వలసి వచ్చుటచే పని యధిక మయ్యెను. ఇల్లు మూడు మైళ్ళ దూరములో నుండుటచే,చిన్న గుర్రపు బండిని కొనిరి. మరొక పెద్ద బండిని తరువాత కొన్న వారైరి. శేషగిరిరావు గారొక గుఱ్ఱమును వీరివద్ద వదిలి వెళ్లిరి. దానికి సుడులు సరిగా లేవని దానిని అమ్మి వేయుడని వీరికి చెప్పిరి. రు 100/లు కంటే ఎక్కువ ధనము రానందున ,వీరే ఆ గుఱ్ఱమును కొని ,తమ బండికి ఉపయోగించిరి. అది వీరికి నమ్మకముగా చాలా కాలము పని చేసినది. దాని సుళ్ళు సరి లేకపోయినను,వీరి కెట్టి కీడును కలుగలేదు.మూఢ నమ్మకములను వీరు నిరసించెడి వారు.

1898 లో చెన్నపురిలో హైందవ దేశీయ మహాసభ ,సాంఘిక మహా సభ జరుప బడినవి. దానికి వీరి కగ్రాసనాధిపత్యమును, వీరు వలదన్నను నొసగిరి. ఆ సభలో గోవింద రానడే గారు వీరికి “దక్షిణ హిందూ దేశ విద్యాసాగరు”డను బిరుదము నొసగి సత్కరించిరి. 1902--6-14 న కాకినాడ సాంఘిక సభకు,మే 1903 లో బెజవాడ లోని కృష్ణా మండల సాంఘిక సభకు వీరికే అగ్రాధిపత్యము దక్కెను.1903 నందు,చెన్నపురిలో హిందూ దేశాస్తిక మహా సభకును వీరి కధ్యక్షత నిచ్చి, గౌరవించిరి. ఈ సభలో వితంతు వివాహ ప్రస్తావన రాకుండా చేయ వలెనని,పలువురు యత్నించిరి. తరువాత కాలమున నీ సభయే అంతరించెను. 1902 లో గుంటూరు నందు ప్రథమ వితంతు వివాహము జరుప బడినది. విశ్వనాధ శాస్త్రి గారి ఆహ్వానముపై వీరు గుంటూరున కేగి,వారి ఇంటి
లోనే బస చేసి,ఆ ఇంటిలోని వారెల్లరు ప్రతిఘటించినను ,పై వివాహమును 11-10-1902 న జరిపించిరి. వరుడు–బేతపూడి జోగీప్రకాశరావు. వధువు—రాజమహేంద్ర పుర నివాసి వెంకట రమణమ్మ. ఈ వివాహమునకు ఉన్నవ లక్ష్మీ నారాయణ గారు వచ్చి,భోజనము చేసి ఆశీర్వదించిరి. గుంటూరు నందు తదుపరి వితంతు వివాహములు వీరి ఆధ్వర్యము లోనే జరుప బడినవి.

వివాహము నాటి రాత్రి వీరు రచించిన శాకుంతలము నాటకమును వీరేశలింగము గారి గౌరవార్థము ప్రదర్శించిరి.

14-10-1902 న రాజమహేంద్రవరమున మరి యొక వివాహమును వీరే జరిపించిరి. వరుడు–తిరుమెల్ల వెంకట సుబ్బారావు. వధువు—తిరుమలాచార్యుని పుత్రిక వెంకట లక్షమ్మ. వధువు తండ్రి వివాహము నిమిత్తము రు 1200/ల నిచ్చిరి. వివాహము చేయించిన తదుపరి వీరేశలింగము గారు చెన్నపురి కేగిరి. వీరు చెన్నపురి యందును ,రాజమహేంద్ర వరము నందును సంఘ సంస్కార సమాజ మందిరమును కట్టించుటయే కాక,రు 1200/లు ఖర్చు చేసి,స్త్రీలకు ప్రార్థనా మందిరమును కూడా కట్టించి ఇచ్చినారు. 1907 లో వీరు బెంగుళూరునకు వెడలిరి. అచట యరుళు పేట లోని బ్రహ్మ సమాజము వారు వీరిని భార్యా సమేతముగా తమ ఉపాసనా సమయమున రావలసినదని ఆహ్వానించిరి. భక్తులు శ్రద్ధ గల వారనిపించిరి. లింగ ధారులు లింగమును తీసివైచి,ఏకేశ్వరోపాసన పరు లైరి. వారి కొక ప్రత్యేక మందిరమును చామరాజు పేటలో కట్టించి,ఇచ్చెదమని వీరు ప్రకటించిరి. కాని ,అది దూరమగునని వారు చెప్పగా,1908 లో అరుళు పేటలోనే రు 100/లకు ఒక పాత ఇంటిని కొని,దానిని పడగొట్టి,రు 1500/ల నిచ్చి,ఒక నూతన మందిరమును కట్టించి వారి కప్ప జెప్పిరి.

వితంతు శరణాలయ నిర్మాణార్థము వీరు శ్రమించ సాగిరి. మిత్రులు రంగయ్య శెట్టి గారు 1903 నుండి నెలకు రు 10/లను పంపించ సాగిరి. బళ్ళారి నివాసి కోలాచలము వెంకట్రావు పంతులు గారు 1901లో రు 3000/లు,తమ భాగములను వీరికి వ్రాసి ఇచ్చిరి. పోలవరం జమీందారు రు 1000/లు ,చందాల ద్వారా–రు 159/లు ,వెంకట్రావు రు 3000/లు—మొత్తము పది వివాహముల ఖర్చులు పోగా— వీరు మరి కొంత సొమ్మును జేర్చి,రు 2200/ల ధనమును చేకూర్చిరి. వీరి దగ్గర నున్న వితంతువులను విద్యాభ్యాసమునకై దూరమునకు పంపుటచే కొందరు దురలవాట్లకు లోనగుట ,రోగములు బారిన పడుట ,జరుగుటచే–వారికొక పాఠశాలను ,వసతి గృహమును దగ్గరగా కట్టించ నెంచి,కీల్పాకము లోని ఎకరము సరుకు తోటను వీరు తమ భార్య పేరున కొని,చెట్లు నరికించి,నాలుగు గదులు గల ఇంటిని,దానికి వసారా దింపి0చి,వంటలు చేసికొనుటకు మూడు గదులను కట్టించి,వితంతువుల నచటికి తరలించెను. కాని ,వారిపై అజమాయిషీ యవసర మయ్యెను.ఆపని కెవ్వరును ముందుకు రాక పోయిరి. వీరి కక్కడ వాస యోగ్యముగా నుండ లేదు. వదలి వేసిన చెదలు,దొంగల బాధ యుండును.కాన,ఇద్దరు పెద్ద వయసు వితంతువుల నక్కడ నుంచి,రెండు పూటలా వెళ్లి,వారి యోగ క్షేమములను వీరు చూచెడి వారు.వితంతువుల నొక్కరినే దూరమున నుంచి నారని అభియోగములు పలుకు వారే కానీ, మరే ధన సహాయము , మానవ సాయము కానీ వీరి కెవరందించ లేదు.కొంత ధనమును సమాజము వారే మ్రింగి వేసి నారు. ఉద్యోగము నందు పని వత్తిడి ఎక్కువయ్యెను. శరీరమా దుర్బలస్థితికి చేరినది. ధన సహాయము లేదు. అందు చేత వీరు మదరాసు నుండి స్వస్థలమగు రాజమహేంద్రవరమునకు తిరిగి పో దలచిరి. ఉద్యోగమును విరమించి,ఉపకార వేతనమును పొందుటకు నిశ్చయించుకొనిరి. 1904 మార్చికి 50 సం .లు వీరికి నిండును గాన,పదవీ విరమణ కోరి,అర్జీని వ్రాసిరి. వైద్యు డొకడు ఒక స0.రము తక్కువగా తెల్పుటచే— వీరు మరొక వత్సరము ఉద్యోగము చేయవలసి యుండెను. కాని ,దానికి వీరి యంగీకారము లేదు. అ0దు వలన,వీరు వైద్యుని వద్ద నుండి ఉద్యోగమునకు తగిన ఆరోగ్యము తనకు లేదని వ్రాయించి,పదవి నుండి విరమణ బొందిరి. వీరికి రు 24/ల పెన్షను వచ్చునని తెలిపిరి. నాలుగు తరగతుల విద్యార్థులు వీరి నభిమానించుటచే గౌరవించి,వీరితో ఛాయా చిత్రములు

దిగినారు.వీరు పదవి విరమణ నాటికి రు 1000/లను తమ స్వంత ఖర్చులకై నిలువ చేసికొని యుంచిరి.

చెన్న పురి యందు వీరి కమిత గౌరవమును,సుఖమును కలిగె ననుటకు సందేహము లేదు. ప్రతి సభకు వీరినే అధ్యక్షులుగా నాహ్వానించెడి వారు.పలువురు వీరికి పూలదండలు వేసి,మెచ్చు కొనెడి వారు. స్వంత గుర్రపు బ0డిమీద ,భార్యతో సహా సముద్ర తీరమునకు,ఉద్యానవనములకు,పలు సభలకు సుఖము గాను , గౌరవ ప్రదము గాను పోయి వచ్చెడి వారు. పదవి వదలిన తరువాత సుమారొక సంవత్సర కాలము వీరు చెన్నపురి యందే యుండిరి. ఒకసారి వీరు రాజమహేంద్రవరమున కేగి,రెండు,మూడు మాసములు అక్కడ నుండి,పనులు,వసతి చక్క చేసికొని,తిరిగి మదరాసున కేగిరి. ఇళ్ల నన్నింటినీ అమ్మి వేసిరి. ముద్రణాయంత్రమును, ముద్రాక్షరములను మాత్రము వీరు వెంట గొని వచ్చిరి. ఆ యంత్రమును తెచ్చుటకు రు 300/ల నిచ్చి,1905 లో వీరు రాజమహేంద్రవరమునకు తిరిగి వచ్చిరి.

2.. రెండవ ప్రకరణము —గ్రOథ కర్తృత్వ దశ **(1870–1900)**

శ్రీ వీరేశలింగము గారు నాలుగవ తరగతి చదువు నాటి నుండియు చాలా తెలివి గల వారని ప్రతీతి.నాటి వారి గురువులు పాఠములను పిల్లలకు వీరిచే చెప్పించుటచే ఈ అభిప్రాయము నిజ మనిపించెడిది . పై తరగతుల వారును తెలియని వాటి యర్థములను వీరిచే చెప్పించుకొను చుండెడి వారు. వీరు చేసిన తర్జుమా ఇతరుల దాని కంటే గొప్పగా నుండెడి దని కూడా పలువురు ప్రశంసించెడి వారు. అందు చేత, వీరికి మనసు నందు ఉత్సాహము జనించి, ఆంధ్ర భాష యందు మంచి కవిత్వమును వ్రాయ వలెనను అభిలాష మిక్కుటమై,వారు తెలుగు ఛందస్సును నేర్చి,ప్రారంభమున రెండు భక్తి శతకములను కంద పద్యములలో వ్రాసిరి. అవి మార్కండేయ శతకము,వేణు గోపాల శతకము. ఒకదాని యందు మకారము యతిగా నుంచి,రెండవ దాని యందు ర కార ప్రాసము నుంచి ,కష్టతరమైన రచనను వీరొనరించిరి. సాధారణ కవిత కాక, ప్రత్యేకత గలిగి
గుర్తింపు నీయగల రచన చేయవలెనని వీరు నిర్వచన,నిర్యోష్ఠ్య,శుద్ధాంధ్ర నైషధమను గ్రంధమును వ్రాయుట ముదావహము.రసిక జన మనో రంజనమను గ్రంధమును,చిత్రా0గద పరిణయ గాధతో శుద్ధాంధ్ర ప్రబంధము నైదాశ్వాసములతో వీరు రచించిరి.దీనిని సర్వ కళాశాల వారు ప్రథమ శాస్త్ర పరీక్షకు పఠనీయ గ్రంధముగా చేసిరి.శుద్ధాంధ్ర ఉత్తర రామాయణమును రచింపగా,దానిని సైతము పలువురు పండితులు శ్లాఘించిరి. పద్యము లచ్చ తెనుగు నందు కదళీ పాకము,నాతి కఠినముగా పద గుంభనయు,యుక్తి చమత్కారమును కలిగి,రసయుక్తమగు నటుల బహు సరసముగా రచింప బడిన దనుచు, పురుషార్థ ప్రదాయని యందు ప్రకటించిరి. దీనిని 1872 లో వీరు కోరంగిలో ప్రధానోపాధ్యాయులుగా నున్నపుడు వ్రాసిరి. దీనిని గూర్చి వావిలాల వాసుదేవ శాస్త్రిగారు ప్రస్తుతిని వ్రాసి పంపిరి. ఆ కాలముననే వీరు సంగ్రహ వ్యాకరణమును,పద్య రూపమున నీతి దీపికను చేసి ముద్రింపించిరి. పూర్వ వ్యాకరణము లందు స్పష్టత విద్యార్థులకు దొరకదను తలంపున, ఇంగ్లీషు పద్ధతి ననుసరించి,సుబోధకముగా వర్ణ,పద,వాక్య,కావ్య పరిచ్ఛేదములుగా వర్గీకరించి,నూతన వ్యాకరణమును వీరు తయారు చేసిరి. ఉత్తర మండల పాఠశాలా పరీక్షకులైన బ్రాడ్ షా దొర గారు దీనిని పాఠశాలలో నిర్వాహకులచే పెట్టించగా పలు పుస్తకము లమ్ముడు పోయెను. నీతి దీపికయు పలు పాఠశాలల యందుపయోగపడినది. నీతి పద్యములు సులభ బోధకముగా నుండినవి.

స్త్రీ విద్య విషయమై వీరు పురుషార్థ ప్రదాయనిలో జరిగిన వాద ప్రతివాదములుగా పద్య రూపమున వీరు పంపునపుడు బంధ కవిత్వమును,గర్భ కవిత్వమును –ఆశువుగా చెప్పి,వ్రాయ గలిగిరి. అవి 1. మత్తేభ,విక్రీడిత కంద గర్భ సీసము 2. సుగంధి 3. చిత్ర పదమును కలవు. అచ్చతెనుగు పద్యములు,కందము,గోమూత్రికా బంధము కలవు. శుద్ధాంధ్ర భారత మను పేర సభా పర్వమును తెనిగించిరి. వచన కావ్యముగా చిన్నయ సూరి వ్రాసిన నీతి చంద్రిక నందు వలె వీరు సంధి,విగ్రహములను రచించిరి. దాని భాష చాలా ప్రౌఢముగా నుండుట వలన సాధారణ పాఠకుల కది యుపయోగ్యము కాదు. భావ ప్రకటనకే భాష యవసరము కాన నిట్టి కవిత్వము నిక ముందు వ్రాయ రాదని వారు నిర్ణయించు కొనిరి. సరళ వ్యావహారిక భాషను ప్రయోగించి,నవలలు,చరిత్రలు వ్యాసములు వ్రాయ సంకల్పించిరి. వీరి విగ్రహము, కొక్కొండ వారి విగ్రహము గూర్చి కొన్ని వాదోపవాదములు కూడా జరిగినవి.

వీరి విగ్రహమును రంగయ్యశెట్టి గారు తమ కళాశాల పాఠ్య పుస్తకముగా పెట్టించిరి. 8-2-1878 న వీరి నభినందించుచు,వారొక లేఖను వ్రాసిరి. అంతకు ముందు వీరిరువురకును పరిచయమే లేదు. ఈ పుస్తకమును ప్రస్తుతించుచు ,చెన్నపురికి వీరిని పిలిచి,పండితులు సత్కరించి ఫోటో దిగి,ఒక వెండి పాత్రమును బహూకరించిరి. నేటివ్ పబ్లిక్ ఒపీనియన్ అను ఇంగ్లీషు వార పత్రికలో వీరి నభినందించుచు వ్రాసిరి. సర్వ కళాశాల వారీ పుస్తకమును ప్రవేశ పరీక్షకు పాఠ్య భాగముగా నిర్ణయించిరి. దాన వారికి రు 1000/లు లభించెను. రంగయ్య గారి లేఖచే ప్రోత్సాహము నంది,వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ ను తెనిగించ నారంభించి,దానిని విరమించి,స్వీయ వచన రచనగా “రాజ శేఖర చరిత్రమును”వ్రాసిరి. అది 1878లో వివేక వర్ధనిలో ప్రకటితమైనది. దీనిని కల్నల్ మాక్డొనాల్డ్ గారి కంకిత మొసగిరి. దీనిని ఇతర భాషలలో కనువదించ నెంచిరి. దీనిని శ్రీకాకుళము నందున్న అమెరికా క్రైస్తవ మాతాచార్యులైన రెవరెండు హట్చిన్సన్ గారు 1887 లో ఫ్యూచర్ వీల్ (అదృష్ట చక్రము)అను పేర లండనులో ప్రకటించిరి. 30-9-1887 న లండను టైమ్స్ అను పత్రికయు, 1878లో చెన్నపురి హిందూ పత్రిక ఆంగ్లమున ఈ పుస్తకమునకు ప్రశంసను వ్రాసిరి.రాజశేఖర చరిత్రము మొదటి నవలయై, తెలుగు వాఙ్మయమున నూతన శకము నేర్పరచు చున్నదని చెప్పిరి. ఈ ప్రయత్నము జయప్రదమైనది. దీనిని బెంగుళూరులో కన్నడ భాష లోనికి అనువదించిరి. కౌపరను ఇంగ్లీషు కవి రచన “జాన్ గెల్పిన్ “ అను దానిని,అభాగ్యోపాఖ్యానమను హాస్య ప్రబంధమును వీరు పద్యములలో వ్రాసిరి. 1875 లో భారత సంగ్రహమును చెన్నపురిలో వ్రాసి ఇచ్చెదమని వాగ్దానము చేసిరి కాని,పద్య రచనను మాని,వీరు వచన కావ్య రచన యందు దృష్టి పెట్టిరి.కాని ,అచటి వారు తొందర చేయుటచే 1878 లోశుద్ధాంధ్ర భారత సంగ్రహమును రచించి,చెన్నపురికి పంపిరి. దీనిని పరీక్షా పాఠ్య గ్రంధముగా నిర్ణయించిరి. సంధిని వీరు రచించి,మెట్కాపు దొర గారికి అంకిత మిచ్చిరి. దీనిని కళాశాల పఠనీయ పాఠ్య భాగముగా నిర్ణయించిరి. సరళ భాషలో రచనలు చేయగా,పత్రికా ముఖమున వీరు ప్రకటించగా,పలువురు పండితులు పరిహసించి,ప్రతిఘటింప సాగిరి. ఈ నూతన మార్గానుసరణముగా వీరు బ్రాహ్మ వివాహమును రచించి నారు. దాని ననేకులు చదివి,ఆనందించి,అభినందించిరి. దానిని పలువురు పెద్దయ్యగారి పెళ్లి పుస్తక మనెడి వారు. తరువాత,వీరు వ్యవహార ధర్మ బోధినిని వ్రాయగా–దానిని ప్లీడరు నాటకమని ప్రజలు తెలిపెడి వారు.దీనిని సంఘము నందలి అన్యాయములను ఖండించు నుద్దేశము తోనే వీరు వ్రాయుట జరిగినది. కొందరీ ప్రయత్నమును ప్రతిఘటించిరి. అభిప్రాయ భేదము లనేకము లుండుట సహజమే కదా యని వీరు తలంచిరి.

1880 లో ధార్వాడ నాటక సమాజము వారు పాక వేసి,నాటకము లాడిరి. ఆ పాక యందే వీరు రచించిన రత్నావళి నాటకమును (సంస్కృతమున హర్షుని రచన) ,ఇంగ్లీషులో షేక్స్పియర్ గారి కామెడీ ఆఫ్ ఎర్రర్స్ ను,తెనుగున పద్య,గద్య నాటకములుగా ప్రదర్శించిరి.మంచి ఆదరణ వీనికి లభించెను. రత్నావళి నాటికను పాఠ్య గ్రంధముగా నిర్ణయించిరి. మర్చంట్ ఆఫ్ వెనిస్ ను వినీసు వర్తక చరిత్ర మని తెనిగించ నెంచియు,దానిని పూర్తి చేయలేదు. అలాగే,స్త్రీ పునర్వివాహ నాటకమును పద్యములుగా వ్రాయ నెంచి,దానినీ పూర్తి చేయలేదు. అన్నిటి యందలి కొన్ని పద్యము లుదహరింప బడినవి. వీరి వ్రాతలను దూషించుటకు కొక్కొండ వెంకట రత్నము పంతులు గారు హాస్య వర్ధని పత్రికను నడుపగా—దానిని ఖండించుటకు వీరేశలింగము గారు హాస్య సంజీవని నారంభించిరి. పలు వాద ప్రతివాదములు జరుప బడినవి. కొందరు వీరు రచించిన భాగములు ఉత్తమమైనవని శ్లాఘించించు,నుత్తరములను వ్రాసిరి. (రంగయ్య సెట్టిగారు 7-19-1876). ప్రఖ్యాతమైన కాళిదాసు నాటకమగు శాకుంతలమును వీరు తెనిగించిరి.కొన్ని మూల ప్రతులను తెప్పించి చదువగా, వాని యందు పాఠ్య భేదము లుండెను. అయినను వీరు తమ శక్తి కొలందిని యా నాటకమును పూర్తి గావించి, పలువురి ప్రశ0సల నందుకొనిరి. దీనిని పాఠ్య గ్రంధముగా నెంచి, నిర్ణయించిరి. నాటక సమాజముల వారు పలు చోట్ల దీనిని ప్రదర్శించిరి. తరువాత మరి నలుగురైదుగురు దీనిని తెనిగించిరి. అయినను ప్రజాదరణచే వీరి పుస్తకమును పలుమార్లు ముద్రి0ప వలసి వచ్చినది. తరువాత కాళిదాసుని మాళవికాగ్నిమిత్రమును తెనిగించిరి. 1885 న0దారంభించి, 1891లో ప్రబోధ చంద్రోదయమను నాటకమును పూర్తి చేసి,ముద్రి0పించిరి.ఇది అద్వైత మత సిద్ధాంతమును ప్రతిపాదించుట చేయ బడిన వేదాంత నాటకము. దీనిని నంది మల్లయ్య,ఘంట సింగయ్య–కవుల గ్రంధము నుండి గ్రహించినదని సందేహ పడ జొచ్చిరి.కొందరు పండితులు ప్రశ్నించగా,నా యపవాదు వేసిన వారు సిగ్గు పడి మిన్న కుండిరి.1885 లో వీరు ప్రహ్లాద నాటకమును రచించిరి. అందు కొన్ని సంఘ సంస్కరణ ప్రబోధక పద్యములను వీరు జొప్పించిరి. తరువాత నాటకము రాగ మంజరి. ఇది ఇంగ్లీషు కవి షెరిడన్ గారి డ్యూయెన్నా నాటక కథ కనుకరణము. 1885 నందు దక్షిణ గోగ్రహణ కథను పద్య,గద్యాత్మకముగా నైద0కముల నాటకముగా రచించి,వీరు ముద్రింపించిరి.1886నందు హరిశ్చ0ద్ర నాటక రచన మారంభించి,1889 యందు పుస్తక రూపమున ముద్రణ చేయించిరి. దీనిని కొందరు శంకర కవి రచనతో పోల్చి చూచి,వీరిదే యుత్తమ రచన యని (యనవసర)వాదమును లేవ నెత్తిరి.ఈ నాటకమును కూడా సర్వ కళాశాల వారు ప్రథమ శాస్త్ర పరీక్షకు పఠనీయ గ్రంధముగా నెంపిక జేసిరి. అందు వలన వీరు పడిన శ్రమకు తగిన ఫలితములు దక్కినవి.

1889 లో తిర్యగ్విద్వన్మహాసభ ,మహారణ్య పురాధిపత్యము అను రెండు పుస్తకములను వీరు రచించిరి.మొదటిది పురోహితుల దుశ్చర్యల నధిక్షేపించుటకు వ్రాయ బడినది. గవర్రాజుగారి మరణ సందర్భమున వారి కుటుంబము వారికి పురోహితులచే కలిగిన కష్టములు దీనికి ప్రేరణ. భారత భాగము లైన గృధ్ర జంబుకోపాఖ్యానము ,మూషకాసుర విజయములను కలిపి,జంతు పాత్రలతో చేయ బడినదీ గ్రంధము.రెండవదియును యాక్షేప గర్బ నాటకమే. వీనిని లక్ష్మీ నరసింహారావు గారిని గూర్చి వీరు వ్రాసిన వారని వారిపై అభియోగములు తెచ్చెను కాని ,తరువాత నవి వీగి పోయినవి. తరువాత రచన నాటకము 1894 లో కళ్యాణ కల్పవల్లి– షెరిడస్ అను ఇంగ్లీషు రచయిత చేత రైవల్స్ అను ఐదు అంకములు గల నాటకమున కిది తెలుగు సేత.స్త్రీ జన సముద్ధరణకై వీరు 1883లో సతీ హిత బోధిని యను పేర మాస పత్రికను ప్రారంభించిరి. అందు సత్యవతీ చరిత్రమను చిన్న వచన ప్రబంధమును వీరు వ్రాసిరి. దానిని పలువు రాదరించిరి. స్త్రీలు తమ పిల్లలకు

సత్యవతి యని నామకరణమును చేసిరి. దీనిని అరవము,కన్నడము,ఇంగ్లీషు లోనికి తర్జుమా చేసిరి. ఇదియు పరీక్షలకు పఠనీయ గ్రంధముగా నుంచ బడెను.

1887 లో సత్య సంజీవని యను పేర స్త్రీలకు నీతి బోధా రచన జేసిరి. స్త్రీల యెడ మన వారు చేసిన యన్యాయములను తేట పడు రీతిగా వీరు గల్లివర్స్ ట్రావెల్స్ నవలను,సత్య రాజ పూర్వ దేశ యాత్ర-యను ప్రథమ భాగమును రచించిరి. చదివిన వారు సత్య రాజు పాత్ర సజీవమని నమ్ము చుండిరి. దీనిని ఇంగ్లీషు ,కన్నడముల లోనికి భాషాతరీకరణమును చేసిరి.దీనిని చాలా మంది ఆడ మళయాళమని వాడుకలో పలికెడి వారు. దీని రెండవ భాగము లంకా యాత్ర . ఇది జ్యోతిష శాస్త్ర జాతక ముహూర్త భాగము లందు మూఢ ఆచార విమర్శగా వ్రాయబడి,కన్నడము లోనికి తర్జుమా చేయ బడెను.

1897లో స్త్రీల కొరకు శ్రీ విక్టోరియా మహారాణి జీవిత చరిత్రమును రచించిరి. 1893 లో నీతి కథా మంజరి చిత్ర పటములతో రెండు భాగములుగా వ్రాయబడినది.కథాన్తమున అందలి నీతి నొక పద్యమున వివరించిరి.పద్యోదాహరణము లిందీయ బడినవి. 1889 లో స్త్రీల కత్యంతావశ్యకమగు శరీరారోగ్య ధర్మములను ,దేహారోగ్య ధర్మ బోధినిని చేసిరి.1896 లో ప త్నీ హిత సూచనిని విరచించిరి. దీని యందు గర్భ ధారణ,శిశు పోషణ మొదలగు వానిని గూర్చిన మార్గములను వివరముగా సూచించిరి.సతీహిత బోధిని యను పేర తన పత్రిక యందు వీరు వ్రాసిన పలు ముఖ్య వ్యాసములను కూర్చి ,పుస్తకముగా ముద్రించి,ప్రకటించిరి. స్త్రీ నీతి దీపిక యను నీతి శతక పద్యములను వీరు బాలికలకై రచించిరి. ఇంకను స్త్రీల యుపయోగార్థము సత్యా ద్రౌపదీ సంవాదము,మాతృ పూజ,పితృ పూజ యను ద్విపద కావ్యములను రచించి,వారికి నీతిని బోధించిరి. షేక్స్ పియర్ నాటకములను ల్యామ్బ్ యను నతడు ఇంగ్లీషులో వచన రూపమున వ్రాయగా,నా కథలను పదునాల్గింటిని వీరు స్త్రీలకు వినోదార్థము తెనుగున ప్రకటించిరి. ఇవి పురుషులకును పఠనీయమై,వినోద దాయక మగు చున్నవి.వీనిని కళాశాలవారు ,పాఠశాలల వారు పాఠ్య పుస్తకముగా నుపయోగించుకొనుట వీరి కృషిని గుర్తించుటచే లభించిన సత్కారము కాగలదు. వీనినన్నిటిని కలిపి వీరు రెండు పెద్ద సంపుటములుగా ముద్రి0పించి ప్రకటించిరి.

వచన పద్య సాహిత్య కృషి యనంతరము వీరు ప్రకృతి శాస్త్ర, శరీర ధర్మ శాస్త్రముల రచన యందాసక్తి చూపిరి. 1878 సంవత్సరమునకు పూర్వమే వీరు పదార్ధ వివేచక శాస్త్రమును ప్రశ్నోత్తర రూపమున తెనిగించి ప్రకటించు చుండిరి. దీనిని వీరి మిత్రునకు కులాచార సంస్కార సమాజము వారప్ప గించిరి. వీరిని శరీర శాస్త్రమును వ్రాయ నియమించి నారు. మిత్రుడు పూర్తి చేయలేకనే దివంగతుడగుటచే రెంటిని వీరే పూర్తి చేయ గలిగిరి. మిత్రుల సహాయమున మానవ, జంతు శరీర ఇతర భాగములను వీరు చూచి, వానిని గూర్చి అవగాహన కలవారై, తమ రచనను కొనసాగించిరి. దీనికి వలయు చిత్ర రూపముల నిరువదింటిని ధనము ఖర్చు చేసి కలకత్తా నుండి తెప్పించి ఉపయోగించిరి. వీరి మొదటి ప్రచురణ 4 ఏళ్లలోనే ఖర్చయ్యెను. రెండవ ముద్రణకు 15, మూడవ ముద్రణకు 16 ను క్రొత్త పటములను వీరు ఇంగ్లాండు నుండి తెప్పించి, ఆ ప్రచురణ పుస్తకములలో పొందు పరచిరి. దీని ననేకులు చదివి ఫలితములు బడయు చుండిరి. వీరి ఈ రచనలను శ్లాఘించుచు, 6-4-1899 న హిందు దేశాభిమాని పత్రిక వారు లేఖను ప్రకటించిరి. వీరు పొత్తము చివరన పారి భాషిక సమానార్ధ పట్టికను చేర్చి పఠితల కుపయుక్త విషయములను ప్రకటించుట శుభకరము.

1895 నందు వీరు జ్యోతిష శాస్త్ర సంగ్రహమును పటములతో ప్రకటించిరి. ప్రకృతి శాస్త్రములలో జ్యోతిష్యము ఉత్తమమైనది. దీని ద్వారా గ్రహణములను గూర్చి ప్రచారము నందున్న అపోహలను, మూడాచారములను తొలగించుటకు వీరు యత్నమొనర్చిరి. తైత్తిరేయ ఆరణ్యకము నందు గ్రహముల పేర్లు లేవు. మనుస్మృతి యందును కాన రావు. యవనుల నుండి గ్రహముల పేర్లను మన వారు గ్రహించినారను సత్యము తెలియ వచ్చు చున్నది. మనమే తెలివి గల వారమను గర్వమును వీడి, సత్య సంగ్రహణమునకు మనము ఉద్యుక్తులము కావలయును. లేనిచో క్షీణ దశ రాగలదు. భాస్కరాచార్యు డొక చక్కని సిద్ధాంత గ్రంధమును వ్రాసెను. ఈ గ్రంథ రచనకు వీరు సంస్కృతము నందలి, ఇంగ్లీషు నందలి పలు జ్యోతిష గ్రంధములను చదివిరి. నక్షత్ర శాలాధికారుల సాయమున దూర దర్శక యంత్రములు ద్వారా శని గ్రహాదుల వలయములను దర్శించ గలిగిరి. సులభ శైలినే వీరి రచన యందవలంబించిరి. గ్రహ పటములను సుమారు 50 కి పైగా ధన వ్యయమొనరించి,ఇంగ్లాండు నుండి చేయించి,తెప్పించి ఇందు పొందు పరచి,ప్రకటించి నారు.వీరి నిర్విరామ ,నిరంతర పరిశ్రమ ఇతరుల కసాధ్యము. పట్టుదల,కార్య దక్షత ప్రశంస నీయములు. గ్రహణము లెట్లేర్పడునో శాస్త్ర సమ్మతముగా ప్రకటించిరి. దానికి గల పూర్వ గాధ లన్నియు కట్టు కథలని తేల్చి చెప్పిరి.దురాచారములను జరిపించి ,తరువాత వానినే సత్యమని ప్రజలని నమ్మించు వారిని వీరు ఖండించెడి వారు.కాని,ఆ దురాచారములను సంఘము నుండి తొలగించుట సులభ సాధ్యము కాదు. మూడవది జంతు స్వభావ శాస్త్రము . 1896 లో దీని ప్రథమ భాగమును సుమారరువది చిత్ర పటములతో ప్రకటించిరి. ప్రకృతి శాస్త్రములలో పదార్థ వివేచన శాస్త్రమును,భౌతిక భూగోళ శాస్త్రములను వీరు కొంత వరకే చేసి,పూర్తి చేయ లేదు.

సంగ్రహ వ్యాకరణము,కావ్య సంగ్రహము,అలంకార సంగ్రహము ,ఆ౦ధ్ర తర్క సంగ్రహమును,శాస్త్ర సంబంధ రచనలను వీరు చేసిరి. 1887 లో వీరు"ఆంధ్ర కవుల చరిత్రను"చేసి ప్రకటించిరి. 1450 కి పూర్వము వారు పూర్వ కవులు. 1450–1650 వరకు మధ్య కవులు. 1650–తరువాత వారు ఆధునిక కవులుగా వీరు విభజన చేసిరి. ఈ మూడు భాగము లందును వీరు సుమారు 200 లకు పైగా కవులను గూర్చి వివరములను సేకరించి ,ముద్రణ చేయించిరి. కవుల చరిత్రను తెలిసి కొనుట కడు దుర్లభమైన పని . కవులు తమ రచనలలో తమ జీవిత విశేషములను పదిల పరచ లేదు. కొన్ని శాసనముల ద్వారా వారా కావ్యముల నంకిత మొనరించిన రాజుల కాలమును బట్టి ,కొన్ని లక్షణ గ్రంధము లందు ఉదాహరించిన ప్రబంధ పద్య సూచికల నుండి వీరు కష్టించి,తగిన వివరములను సేకరించిరి. ఒక కవితను రచన యందు మరొక కవిని ప్రస్తుతించగా ,నట్టి కవి ఈ కవి కాలమునకు పూర్వుడని కొంత గ్రహించ గలిగినను ,సరియైన సంవత్సర నిర్ణయము దుష్కర మయ్యెను. అందు చేత,వీరు దేశ మంతయు తిరిగి,పలు గ్ర౦ధాలయము లందలి వివిధ శాసనములను, తాటాకు గ్రంధములను పరిశీలించి,వలయు వివరములను వ్రాసికొని వచ్చెడి వారు. చెన్నపురి,తంజావూరు లందు వీరు పర్యటించిరి. వీరి రచన లన్నిటి కంటే ఈ పుస్తక రచనకు ఎంతయో ఎక్కువగా కష్ట పడ వలసి వచ్చెను. దీనిని పరీక్షా పఠనీయ గ్రంధముగా నెంపిక చేయుటచే వీరి కష్టమునకు తగిన ఫలితము దక్కెనని వీరు సంతోషించిరి. కొన్ని ఇతర కవుల చరిత్రల యభిప్రాయములను వీరు ఖండించిరి. ప్రక్రియా కౌముది నన్నయ రచనగా తెలుప బడగా,వీరు దానిని సహేతుకముగా ఖండించి, నిరూపించిరి. ప్రాసల యందు ర –ఱ ల గూర్చిన వ్యాఖ్యలను వీరు పరిశీలించి,సరియైన మార్గమును తెలిపిరి. పూర్వ ప్రబంధము లందలి శృంగార వర్ణన లందు స్త్రీల

కచ,కుచ విషయములను వర్ణించుట వీరి కసమ్మతముగా తోచెను. మొదట వీరి రచనల యందట్లు వర్ణించినను, వీరా విధానమును తరువాత కాలమున యాక్షేపించి,నిరసించిరి.

కవిత్వము ప్రమాణములు తగ్గి,వృధా పద ప్రయోగాదుల నాడంబరమును చూపు రీతిని విమర్శించి,సరస్వతీ దేవికి బాధ కలుగగా,నారదునితో నా ఖేదమును వివరించుట ఒక అధిక్షేపణ కావ్యము. దీనిని వీరు “సరస్వతీ విలాప”మను పేర చిన్న పద్య పుస్తకముగా ప్రకటించిరి.

హాస్య సంజీవని మూడు భాగములు,వివేక వర్ధని మూడు భాగములు ,ఉపన్యాస మంజరి అనునవి హాస్య రస ప్రధానమును, నీతి మత ధర్మ పోషకములు నైన వాటిని కలిపి,ఒక పుస్తకముగా వీరు ముద్రి0పించిరి. ఇవికాక,వీరు మరికొన్ని హాస్య రస వ్యాసములను రచించిరి. సంఘు సంస్కరణము వీని ఆశయమే. ఇవియే కాక,వీరు పలు సందర్భము లందు వ్రాసి,చదివిన ఉపన్యాసము లనేకము కలవు. వీరు బాగుగా వ్రాయ గలరు కాని ,చక్కగా సభలందు సంభాషింప లేరని,కొందరి అభిప్రాయము. అది సరి కాదని వీరు నిరూపించ గలిగిరి. పలువురు తమ మొదటి భావనలను మార్చుకొని వలసిన వారైరి. అందు చల్లపల్లి రంగయ్య పంతులు గారొక లేఖను కూడా వీరికి వ్రాసిరి. (7-7-1883).వీరుపన్యసించు తరి మూడు విధముల లోపము లుండునని వారే తెలిపిరి. 1)పెద్ద గొంతుక లేక పోవుట. 2)చెప్పునపుడు అభినయము లేక పోవుట. 3)విను వారి వంక చూడక,తల వంచు కొని వీరు తమ ధోరణినే యాగక చెప్పుకొని పోవుట .అయినను పలు విషయములను సూటి గాను,హాస్య ప్రయుక్తము గాను –వీరు తెలుప గలిగెడి వారు. విద్యాధికులు ధర్మములను గూర్చి ఉపన్యసించుచు,మూఢత్వ దేవతను వీడుడని హెచ్చరించిరి.సత్య కవచమును తొడిగికొని, ధర్మ ఖడ్గమును ధరించి,సత్కార్యాచరణ శూరులయి, యువకు లీశ్వర పక్షమున నిలిచి,యుద్ధ సన్నద్ధులు కావలెనని వీరుద్బోధించిరి.

1894–95 సం .లందు వీరు స్వదేశ సంస్థాన చరిత్రాదులను పలు చిత్ర పటములతో పుస్తక రూపమున ప్రకటించిరి. 1894 సం .న వేసవి శలవులకు వీరు చెన్నపురి కేగి నపుడు జీససు చరిత్రమును తెలుగులో వ్రాయ నారంభించి,6 ప్రకరణముల వరకే వ్రాయ గలిగిరి. తిరిగి బెంగుళూరు నందున్న తరి, 1913 ఏప్రిలు నెలలో మిగిలిన రెండు ప్రకరణములు వ్రాసి,పూర్తి చేసిరి. తరువాత శైలి కొంచెము భిన్నముగా నుండెను. ఆంగ్లేయ స్త్రీల చరిత్రను “ఉత్తమ స్త్రీ చరిత్ర”గా పలు చిత్ర పటములతో నున్న 80 పుటల పుస్తకమును వీరు రచించిరి.రాజా రామమోహన్ రాయల చరిత్రను మొదలిడిరి. కాని ,ఇంకను పూర్తి కావలసి యుండెను. ద్వైత,అద్వైత,విశిష్టాద్వైత మత సంగ్రహ ఉపన్యాసములను కలిపి,"సత్య వాదిని"యను పేర 64 పుటల పుస్తకము నొకటి ప్రకటించిరి.ఆంగ్ల కవి గోల్డ్ స్మిత్ గారి “మార్గస్తుడు”అను పద్య కావ్య కథను పద్య రూపమున “పథిక విలాసము” అను నామముతో ప్రకటించిరి. వెంకట రత్నము పంతులు మొదలగు వారది బాగున్న
దని ప్రశంసించినను,పాఠకులు తగ్గుటచే ఆదరణ అంతగా లేదని వీరు భావించిరి.

1883 లో రిప్పను ప్రభువు రాజ ప్రతినిధిగా వచ్చినపుడు బాల బాలికలచే పాడించుటకై కొన్ని పద్యములను వ్రాయుడని కోరగా–కొన్నింటిని వ్రాసి సతీ హిత బోధినిలో వీరు ప్రకటించిరి.

1885 లో చెన్నపురి బ్రహ్మోపాసన మందిర ప్రతిష్టాపన సమయము నందు కొన్ని పద్యములను వీరు వ్రాసిరి.

1887 లో శ్రీ విక్టోరియా మహారాణి పేరున శ్రీ విక్టోరియా జుబిలీ నవరత్న పద్యములను వ్రాసిరి.

1892 లో నవ నాగరిక పంచ రత్నముల నొకరు వ్రాయగా ,దానికి ఖండనగా వీరు ఐదు సీస పద్యములను వ్రాసిరి. మాక్డొనాల్డు గారు విద్యా విచారణాధికారిగా నున్న తరి వీరు రెండవ పాఠ

పుస్తకమును వ్రాసియిచ్చిరి. దానికై వీరికి రు 200/లు ముట్టినవి. మార్సుడన్ దొర గారు కోరగా —4,5,6 వ తరగతి వాచకములను వ్రాసి ఇవ్వగా,దానికై రు 1000/లు లభించినవి. ముద్రణలో కొన్ని భాగములు పోవుట వలన మరల వీరికి సొమ్మొసగి వ్రాయించుకొనిరి. పద్యములు కానీ,గద్యముకానీ ఒక్క సారి మాత్రమే వ్రాయుదురు.దిద్దుబాటు లుండవు. ఆ ప్రతి పోయినచో,మరి చిత్తు ప్రతి యుండక పోవుటచే నది నష్ట మైనదే యగును.

సంఘ సంస్కరణతో పాటు,వీరికి భాషాభివృద్ధికి నూతన ప్రక్రియాచరణల యందు మిక్కిలి అభిలాష యుండెడిది. దానికి వలయు మూల గ్రంధము లప్పుడ0తగా లభ్యము కాలేదు. ఇంచు మించుగా వచన రూపములు లేవనియే చెప్పవచ్చును. అన్నింటికిని స్వయంకృషి ,నూతన సృష్టి తప్పక యవసర మగు చుండెను. అందు చేత, ఇన్ని ఘన కార్యము లొనరించుచు సాహిత్య కృషి నవిరళముగా సలుపుటకు వీరెంత కష్ట పడ వలసి వచ్చినదో మనకు తెల్ల మగును. వీరి ఆరోగ్య మంతంత మాత్రముగా నుండి,దుర్బల శరీరులై,యుండెడి వారు. వీరు ప్రతి ప్రక్రియను ప్రప్రథమముగా చేసి,అగ్ర స్థానము నలంకరించిరి. మొదటి వచన ప్రబంధమును ,మొదటి నాటకమును తెనిగించుటను,మొదటి ప్రకృతి శాస్త్రమును,మొదటి ప్రహసనమును ,మొదటి చరిత్రను,స్త్రీలకై మొదటి వచన పుస్తకమును,వీరు రచించి,భావి తరముల వారి కందించి,ధన్యులైరి. వీరు నూతన పుస్తక రచన మొనర్చుటయే కాక,ప్రాచీన గ్రంధములను కూడా తాటాకుల నుండి సేకరించి, తగు రీతిగా పరిష్కరించి,ప్రకటించిరి. అప్పటికి దొరకని వని ప్రకటించిన పుస్తకముల పట్టిక నుండి పది వరకు వీరు కష్ట పడి సంపాదించి,ప్రకటింప గలిగి
రనుట వీరి కష్ట ఫలమే యగును. పలు ప్రతులను పరిశీలించి,శుద్ధ మొనర్చుట శ్రమతో కూడిన పని. ముద్రిత పుస్తకములను వీరు సంస్కరించి,ప్రకటించినవి 20 కి పైగానే కలవు. హరిశ్చంద్రోపాఖ్యానము,జైమిని భారతము ముద్రింప బడి యుండినను,అవి తప్పుల తడక లగుటచే వానిని శుద్ధ మొనర్చి వీరు తిరిగి ముద్రణ చేయించిరి. వీరు సేకరించిన తాళ పత్రములు చాలా వరకు చెదలు బారిన పడి నష్ట పోయినవి. రక్షణ కష్టమై వీరు మిగిలిన వాని నొక మిత్రుని కొసగిరి. వీరి భాషా సేవ ,రచనల వివరములు,వైశిష్ట్యమును గూర్చి ఈ ప్రకరణమున సవిస్తరముగా ప్రకటిత మైనది. అనేక పద్యములు వీరు వ్రాసి యుండిరి. అందు సరళ తరములు,ప్రౌఢము లైన కొన్ని పద్యములను పరిశీలింపఁదగును.

క. శ్రీ రమణీ హృల్లోలా !
కారుణ్య లతాలవాల కాంచన చేలా!
ఘోరావహ జయ శీలా!
శ్రీ రాజమహేంద్ర వర పురీ గోపాలా!

గీ. తాత ముత్తాత లెంతెంత ధనము కూడ
బెట్టి ,పెట్టెలు ని0డంగ బెట్టి యున్న
కష్టపడి ,తాను న్యాయ మార్గమున బడయు
స్వార్జితం బొక్క గవ్వతో సమము కాదు.

ఉ . ఈ నిశితోగ్ర ఖడ్గ వినివృత్త భవద్గళ నాళికోచ్ఛల
త్సేనిల బుద్బుదౌఘ యుత భీకర శోణిత భూరి ధారలన్
నేనిదె తృప్తి చేసెద వినిశ్చల భక్తికి దుర్గ కిప్డు క్రీ
డా నినదోల్లస డ్డమరు ఢాంకరణాగత భూత వర్గకున్

మ. ప్రచురోద్ధూత రజశ్చటానుమిత శుమ్భద్యాన ధావత్ఖురా
గ్ర చయేష త్వరి చుంబితోర్వ్యపరి భాగంబుల్ మహా వాహముల్
ప్రచలన్మందర మధ్య మాన జలధి ధ్వానోగ్ర ఘోషంబుగా
నుచిత ప్రౌఢిని వ్యోమ మార్గమున నోహో!తేరు గొంపోయెడిన్ .

గీ. వసుధ లోపల నరులను పాడు చేయ
స్తోత్ర పాఠుల మించు శత్రువులు లేరు
లాభ మొంద ముఖ్య స్తుతు ల్సలుపు వారి
వలల దగులక,కనుగల్గి మెలగ వలయు

గీ. పరుల లోపంబులను జక్కపరతు ననెడు
వాడు తీర్చుకో వలె స్వలోపముల తొలుత
తనదు రోగంబునే మాన్పు కొనగ లేని
వైద్యు డొరుల రోగము నెట్లు బాగు చేయు?

గీ. దాపున గరస్థ మయి యున్న దాని విడిచి
దవుల సందిగ్ధమగు దాని దగదు కోర,
మింటి మేఘంబులను నమ్మి,ఇంటి చెరువు
జలము బార జల్లించెడు జడుడు గలడె ?

గీ. ప్రజల నందర సంతోష పఱుప గోరి,
ఎల్లరకు నింపుగ మెలంగ నెంచు వాడు
పిదప నెవ్వరి సంతోష పెట్ట లేక
యన్నిటికి చెడ్డ మతి హీను డగును జుమ్ము .

గీ. విద్య వలనను జ్ఞానంబు వెలయు గాన
నవని నిది మంచి,ఇది చెడ్డ యనుచు తెలియ
బాలురను బోలె దప్పక బాలికలను
విద్య నేర్వ0గ వలయును హృద్యముగను

గీ. పువ్వులను మంచి బట్టలు భూషణములు

సుగుణముల యట్ల ఎన్నడు సుందరులకు
శోభ తేనేర వది గాన సుదతులార!
సుగుణ సంపద గడియింప జూడు డెపుడు

గీ. తాను జేసిన ధర్మంబె తన్ను గాచు
ననెడు లోకోక్తి చిత్తము నందు నిలిపి,
భర్తయును, బంధువులును నియ్య బనిచి నట్టి
ద్రవ్యమున బీద సాదల దనుప వలయు.

గీ. ఆపదలు వచ్చి నప్పుడు నలరు బోండ్లు
తాము ధైర్యంబు విడువక,తక్కు గలుగు
వారి నోదార్చి,దుఃఖంబు బాప వలయు
ధైర్యమున నాపద సగంబు తగ్గి పోవు.

కం. సుందర బహు రస పుష్టి న
మందానందంబు బుధుల మది కిడ దేనిన్
ఛందో బద్ధంబగు పద
బృ0దాటోపంబు తా గవిత్వం బగునే ?

కం. విను ఛందో బద్ధంబను
ఘున కారణముననె బ్రతుకు గన నగు నేనిన్
తనువది వదలి,వెసం జ
క్కని మృతి నొందుటయె లెస్స కవితా సతికిన్ .

కం. రసములు కావే ప్రాణము
లసమాన కవిత్వ కాంత కవనీ స్థలిలో
రసహీన మైన కవితకు
బొసగించు నలంకృతి శవమున కిడు తొడవౌ.

సీ. బాల రండల కాశ పడి చెడి విధవల బెండ్లిండ్లు వలదంచు ప్రేలు వారు ,
రాళ్ళ గొల్చుచు దూలి బ్రహ్మంబు సేవించు వారె భ్రష్టులటంచు వదరు వారు
కన్న కూతుల నమ్మగా గోరి,బాల్య వివాహముల్మేలంచు వాగు వారు
చాటున గలు ద్రాగి చనుదెంచి తేయాకు నీరాను వారి నిందించు వారు

గీ. స్త్రీల వంచించి,మించి బాధింప నెంచి
యబలలకు విద్య కీడంచు నరచు వారు
వీరు పూర్వ నాగరికులౌ పెద్ద లిపుడు

దుష్కులాచార రక్షణోద్యోగు లకట !

మూడవ ప్రకరణము —-విశ్రాంతి దశ (1900–1910)

ఉద్యోగ విరమణ పేరున అధ్యాపక వృత్తిని వీరు మానినను విశ్రాంతి యను పదము వీరికి సరి పడదు. నిరంతర కఠిన దీక్షచే పలు కార్యములను నిర్వహించు నుత్సుకత వీరికి బాల్యము నుండియే యబ్బినది . కావున పరమేశ్వరుని దయ వలన వీరేదియో చేయవలెనను తలపున యోచించు చుండెడి వారు. ప్రథమ వితంతు వివాహము చేసి కొనిన గోగులపాటి శ్రీరాములు గారు తమ ప్రథమ భార్య వలన గలిగిన నాలుగు మాసముల బాలుని వీరికి పెంచుట కప్పగించిరి. ఆ బాలును వీరు సాకి,పెద్దచేసి,చదువు చెప్పించిన వారై,ఉద్యోగ స్థితిని చేకూర్చిరి. మొదట అతడు వితంతు వివాహమున కంగీకరించియు,తదుపరి యతడు ప్రాయశ్చిత్తము చేసికొని బెంగుళూరులో చెరుకు మిల్లి వెంకట రత్నము గారి పుత్రికను వివాహ మాడెను.వీరి ఆస్థి కేవలము ధర్మ కార్యక్రమములకే గాని పెంచు కొన్న కుమారుని కీయనని ముందుగానే వీరు తెలియ చెప్పిరి.వివాహము తరువాత నతడు తిరిగి వీరి కడకు రాలేదు. 1902 నవంబరు 26 న కృష్ణా జిల్లాలో ఉన్నవ లక్ష్మి నారాయణ గారిచే కుదర్చ బడిన వధూ వరులకు రాజమహేంద్రవరము నందు తణుకు వెంకట చలపతిరావు గారి గృహము నందు వీరు వివాహమును జరిపించిరి. వారు నిత్యము తగవులు పడగా,దేశిరాజు బాపయ్య గారను వీరి మిత్రుడు ఆ తగవులను తీర్చబోయి,దూషణలను భరించ వలసి వచ్చెను. వీరు దక్షిణ భారత హిందుస్థాన బ్రహ్మ సమాజమునకు ప్రధానాధ్యక్షులు.బాపయ్య గారు దాని కనుబంధమైన విద్యార్థి సంఘమును స్థాపించిన వారు.తరచుగా వీరి0టికి పలు మార్లు వచ్చి పోవుచుండెడి వారు.ఒకసారి వీరి అత్తగారు తన కుమార్తెను శరభయ్యగారు కొట్టి బాధించు చున్నారని యేడ్వగా, వీరచటికేగి,అది నిజమని తెలిసికొని, ఆమెను తీసుకొని వచ్చిరి. ఈ రీతిగా వివిధ వివాహ దంపతుల వలన పలు బాధలు వీరికి కలుగు చుండెను. మహాలక్ష్మి ,అన్నపూర్ణ యను క0సాలి వితంతువులు తల్లీ కూతుళ్లు వీరి వద్ద నుండెడి వారు. తరచు తగవులు పడెడి వారు.అన్నపూర్ణను 14–2–1903 న గంజాము నివాసి కొత్తూరి నమశ్శివాయ వివాహ మాడెను. 1904 మార్చిలో పదవి విరమణ చేసినను 9 నెల లచటనే చెన్నపురి యందుండి ,1905 ప్రారంభమున వీరు స్వస్థలమైన రాజమహేంద్ర వరమున కరుదెంచిరి.

7,8 సం. ల తరువాత వీరు తిరిగి వచ్చుటచే ఇది యంతయు క్రొత్తగా గోచరించెను. నాటి విద్యార్థులు తోడుగా లేరు. నాటి సహచరులును లేరు. వీరి యుద్యమము నందు పాల్గొని తోడ్పడు వారును లేరు. క్రొత్త వారికి వీరిని గూర్చి పూర్తి అవగాహన లేక పోయెను. అప్పుడచట హిందూ సామ్రాజ్య ప్రాబల్య మధిక మయ్యెను. అయినను,దేశిరాజు పెద బాపయ్య గారు కార్య శూరులై వీరి దరి జేరిరి . మరి కొందరు నూతన మిత్రులతో వీరు పనిని ప్రారంభించిరి. శ్రీ విక్టోరియా బాలికల పాఠశాలను వీరు స్థాపించిరి. సత్య వాదిని యను వార పత్రికను వీరాగ్లాంధ్రములలో ప్రకటింప మొదలిడిరి. పాఠశాలను వీరి గృహము నందే 16–1–1905 న ప్రారంభించిరి. వీరు ఉపయోగించు కొంచెము భాగము తప్ప,మిగిలిన ఇల్లంతయు పాఠశాలకే ఉపయోగింప బడినది. చెన్నపురి యందు వీరు స్థాపించిన విక్టోరియా వితంతు శరణాలయము వీరి వెంటనే రాజమహేంద్ర వరమునకు తరలి వచ్చెను. దాని సంబంధము గానే,వీరీ పాఠశాల నారంభించిరి. స్కూలులో వితంతువులతో పాటు కొందరు గృహిణీ మణులును చదువు నారంభించిరి.

మొదట నొక వృద్ధ ఉపాధ్యాయుడు,నలుగురు బాలికల తోడ నారంభమైన ఈ పాఠశాల 25 దినముల తరువాత,49 కి,సంవత్సరాంతమునకు 90,పై సంవత్సరాంతమునకు 150 వరకు పెరిగినది. 3 ఉపాధ్యాయులు,3 ఉపాధ్యాయినిలును పని చేసెడి వారు. జీతములకు నిధి తగినంత లేకుండెను. వీరి చేతి నుండియే రు 1708-9-9 లు ఖర్చు కాబడినది. 1905 మే లో రామచంద్ర రావు,లక్ష్మీ కాంతమ్మలు మంగుళూరు నుండి వీరిని చూచుటకు వచ్చి,అచట ఉపాధ్యాయులుగా పని చేయుట కొప్పు కొనిరి. భర్తకు 2000 /రు. అప్పు కలదనియు,దానిని వీరిని తీర్చమనియు చెప్పిరి. వీరు మొదట రు. 1000/నిచ్చి,మిగిలినది తరువాత నొసగెద మనిరి. అతడు ఆ ధనముతో పొలము కొని , ఋణమును పెంచెను. మరి 1000/ల నిమ్మనగా వీరంగీకరించ లేదు. కనుక అతడిక్కడ పని చేయుట మాని, మంగళూరుకు పోయెను. అందు చేత,వీరికి రు 1000/ లు నష్టము కలిగినది. ఇట్టి కష్ట నష్టములను వీరనేక సార్లు అనుభవించియే యుండిరి.

ఆ దంపతుల నివాసమునకై రు 600/లు ఖర్చు చేసి, ఒక ఇంటిని కట్టించిరి. చెన్నపురి నుండి వచ్చిన తదుపరి వీరు బ్రహ్మ సమాజములో ననుష్టానపరుడు కావలెనని తలచి యుండిరి. మొదటి వితంతు వివాహమును వీరు చేయించగానే ,శంకరాచార్యుల వారు వీరిని జాతి నుండి బహిష్కరించిరి. అందు చేత వీరి వెంట నున్న వారు చాలా మంది ప్రాయశ్చిత్తములు చేయించుకొని వీరిని విడిచి పోయిరి. వీరింకను హిందువుడుగా నున్నను,మిగిలిన వారెవ్వరు వీరితో భోజనము చేయరు. పరు లందరితో చేయ దలచినను, వీరింకను యజ్ఞోపవీతమును విడువ లేదు. అది విడిచిన తదుపరి వీరి పంక్తిలో బ్రాహ్మణులు చేరి,వివాహ మాడ బోరు. అందరితో మత భేదములు వీడి,భుజి0ప వలెనన్న వీరిక ఇకపై ననుష్టాన పరులు కావలెనని నిశ్చయించు కొనిరి.ఇకపై నీ వితంతు వివాహముల నితర సమాజ సభ్యుల ఇండ్లలో చేయ దలచిరి. ఒక వివాహమును శ్రీ కౌతా శ్రీ రామ శాస్త్రి గారింటిలో వీరు జరిపించిరి. వీరి ఇంటి నానుకొని యున్న వీరి పెత్తండ్రి గారింటి లోను,వీరు జరిపించిరి. వీరి ఇంటికి నానుకొని యున్న వీరి పెత్తండ్రి గారి ఇండ్లను పడగొట్టించి, వితంతు శరణాలయమున కొక ఇల్లు కట్ట తలపెట్టినారు. వీరు రామచంద్రరావు దంపతులతో 1905 లో విహారమునకు బోవు సమయమున నొక విశాలమైన తోటను చూచిరి. అందు వితంతు శరణాలయమును నిర్మించిన చాలా బాగుండ గలదని వారనగా,ఆ ఆలోచన వీరి కుత్సాహ మొదవించెను.అది వీరి మిత్రులైన చల్లపల్లి రంగయ్య గారిదే.వారిని, వారి తమ్ముని సంప్రదించి,రు 2500/లు ఇచ్చెద మనగా ముందుగా వీరు రు 500/లు చెల్లించి,పత్రములను తమ పేర వ్రాయించు కొనిరి. ఇతర ధనము రు 1500/ లుండగా ,దానికి వీరు రు 500/లను జేర్చి,ఇంటినీ ,తోటను కొనిరి. కాని ,ఇంటికి నిర్మాణ ధనమును సేకరించ వలసి యున్నది. చెన్నపట్టణము లోని వీరి ఇళ్లను విక్రయించి,ఈ వితంతు శరణాలయమును కట్ట నిర్ణయించిరి. కొందరు చదువ నెంచిన కుల స్త్రీలకు వీరి మేడ మీద గదిలో ప్రత్యేకముగా వీరు తరగతులను నిర్వహించిరి.

సత్య వాదిని వార పత్రికను వీరు తెలుగు ఇంగ్లీషు భాషలలో ప్రకటించ సాగిరి. మొదటి సారిగా పోలవరం జమీందారు గారు ప్రథమ కళత్రము జీవించి యుండగనే ద్వితీయ వివాహమును చేసికొనిరి. దానిని విమర్శించి,వ్యాసమును వీరు రచించిరి. ఈ జమీందారుగారు సమాజమునకు రు 1000/లను చందాగా నొసగిన వారు.అట్టి వారిపై విమర్శను వ్రాయుట కృతఘ్నుతగా కొందరు వీరి రచనను ఖండించిరి. కాని ,వీరు నీతి,ధర్మములను మాత్రమే పోషించి,అవినీతి,యనాచారములను గూర్చి ఎంతటి వారి నైనను విమర్శి0ప వెనుదీయరు కదా.తోటలో వీరుండిన గాని బాగు పడదని ధనము ఖర్చు చేసి ఫల వృక్షములను,బావిని వేయించిరి. దొంగల భయమైనను కుక్కలను రక్షణకై

యుంచుకొని వీరచట కాపురమునకు తరలి వచ్చిరి. అచటి కాపురము వీరి కలవాటయ్యెను. మిస్ మ్యానింగ్ గారిచ్చిన ధనము రు 659-1–0లును, వీరు మరికొంత జేర్చి ,నూతి పనిని పూర్తి చేయ గలిగిరి. (రు 800/లు). 1906-2-15 న వీరి తండ్రిగారి ఆబ్దికమును బ్రాహ్మ ధర్మ పద్ధతిలో పెట్టిరి. బాపయ్య గారును వీరి ననుసరించిరి. వీరు యజ్ఞోపవీతమును మరి కొన్ని నాళ్లు వేరు కారణముల చేత నుంచు కొనగా, పలువురా చర్యను విమర్శింప సాగిరి.వారికి వివరముగా వీరొక లేఖను సత్య వాదినిలో వ్రాసిరి.
1)సర్వ లోకాని కధిపతి యైన ఈశ్వరు డందరి కొక్కడే.
2)జాతి వర్ణ మత భేదములు ఈశ్వర దృష్టిలో లేవు. పరమాత్మకు మానవు లందరును సమానమే. ఇవి బ్రహ్మ సమాజ ముఖ్య సూత్రములు. తాను మొదటి నుండియు ఈ రెండు ధర్మముల ననుసరించు వాడనే యనియు,పలు వితంతు వివాహముల నీ సూత్రము లాధారముగానే జరిపి0చి నాడ ననియు,మిత్రు లపార్థము చేసికొన వలదనియు –ఆ లేఖ సారాంశము. స్త్రీ విద్య,స్త్రీల సముద్ధరణ,సంఘ సంశ్రేయమునకై నేను నిరంతరము పాటు పడుట మీరెరుగుదురు. నేను శుష్క వాగ్దానములు చేయక, నిశ్చల,నిరంతర కార్యాచరణ,సాధన నియమములు కలవాడ నని మీరెరుగుదురు కదా. –యనియు వీరు వివరించి నారు.బ్రహ్మ సమాజమున కధ్యక్ష పదవి నందున్న వీరు లోక సామాన్య సౌభ్రాతృత్వమునే వాంఛి 0చెడి వారు. వృద్ధ దశకు కూడా వీరు వచ్చి యున్నారు.

చల్లపల్లి రంగయ్య గారి నుండి రు 600/లకు వీరింకొక తోటను కూడా కొని యుండిరి. దానిలో వితంతు శరణాలయము,అనాథ శరణాలయమును వీరు కట్టించుటకు తలపెట్టగా, నా గృహములను ములుకుట్ల అత్యుత రామయ్యగారు తాము కట్టించి ఇచ్చెదమని చెప్పిరి. వీరు వీరేశలింగము గారి శిష్యులు.వీరి యెడ నమిత గౌరవాదరణలు కలవారు. వీరి నొక సారి గుర్రపు బండిలో నూరంతయు నూరేగించి ,పూలమాలలతో సత్కరించిరి. వితంతువుల వాసమునకు వరుస కైదేసిగా ,రెండు వరుసలలో పది గదులు,నాలుగు వర్ణముల వారికి 4 వంట గదులు ,శరణాలయము కార్యములను చూచు వారికి కాపురమునకు మూడు పెద్ద గదులు,దాని ఎదుట పాఠశాల నిమిత్తము విశాలమైన మూడు గదులు —వీనిని వారు కట్టించి ఇచ్చిరి. దీనికి సుమారు రు 5000/ల వరకు వీరికి ఖర్చులై యుండునని వీరు భావించిరి. వేరొక రు 1000/వరకు వెచ్చించి,మరుగు దొడ్లను ,స్నానపు
గదులను కట్టించి,భావి కాల మందు శరణాలయము నడుప లేనిచో–అచ్యుత రామయ్య గారికో, వారి యుత్తరాధికారులకో రు 5000/లు ఇచ్చునట్లుగా వేరొక నిక్షేప పత్రమును వ్రాసి ఇచ్చిరి. 1906 ప్రాంతమున హిందూ దేశాభి వృద్ధిని అను పేర నొక పత్రిక వెలసెను. పోలవరము జమీందారు గారికి గాని,న్యాపతి సుబ్బారావుగారికి గాని దానితో సంబంధము లేదనిరి. ఆ పత్రిక అధిపతిగా శ్యామరావను నతడు ఎనిమిది రు .ల వేతనోద్యోగి.అట్టి వానికే పత్రిక నడుపు సామర్థ్యమే లేదు. ఆ పత్రిక వీరేశలింగము గారు వితంతు వివాహములు చేసి,వారిని పట్టించు కొనక పోవుటచేవారు నిరాశ్రయులగు చున్నారనియు ,కొందరు వ్యభిచారులగు చున్నారనియు —వీరిపై అభియోగమును మోపిరి. దీనిపై పత్రికాధిపతిపై వీరు వ్యాజ్యమును తెచ్చిరి. జవాబుగా వీరికి ప్రత్యక్ష సంబంధ మున్నదని మేము వ్రాయ లేదనియు, మరి వీరెందుకు మాపై కోపించిరో తెలియ లేదనియు మరల వ్రాసిరి. దీనిపైకూడా వీరు వ్యాజ్యమును వేసిరి. ఈ రెంటిని న్యాయస్థానము విచారణ చేసి,

శ్యామారావుకు రు 1000/ల ధన దండనను ,18 మాసములు కారాగార వాసమును విధించిరి.అతడు వేడు కొనగా,ధన దండనను రు 300/ లకు తగ్గించిరి.

15–12–1906 న వీరు 36 మంది సభ్యులతో హిత కారిణీ సమాజమును స్థాపించిరి. వితంతు శరణాలయములు,పాఠశాలలు ,అగతిక శిశు సంరక్షణ శాలలు,శిల్ప శాలలు,---మొదలైన వాటిని స్థాపించి,వానిని జరుపుట ఈ సంఘము యొక్క ముఖ్యోద్దేశము. కొందరు నాస్తికులు సభ్యులుగా నుండుట మాను కొనిరి. సంఘపు విధులను వీరు ఏర్పరచిరి. నడుపుటకు వలయు ధనము రాశిగా నేర్పరచుటకై వీరు తమ యావదాస్థులను వివరించి,దాని వలన వచ్చు ధనము మొత్తమును నిర్వచించి,దీనికి అప్పగించెదనని రిజిస్టరు పత్రమును వ్రాసి ఇచ్చిరి.

1) 6500 2)2000 3)1500 4)6000 5) 6000 6)1000 7)10,000 8)2000 9)2000 10)1000 11)3500 .

ఈ సొత్తును 2-5-1908 న రిజిస్టరు చేసిరి. వీరి జీవిత కాలమంతయు నది వీరి యధీనములో నుండి వలె ననియు, వ్రాసిరి. వితంతు వివాహములను వారిష్ట ప్రకారమే జరుప వచ్చు ననిరి.వితంతువులు కాని వారిని కూడా ఇందు జేర్చుకొన వీలగు ననిరి. తన పుస్తకముల విక్రయ ధనమును .చెన్నపురి యం0దలి వీరి గృహ విక్రయ ధనమును కూడా నిచ్చి వైచిరి. దేశిరాజు బాపయ్య గారు,కారుమూరు కామరాజు గారు ,కామరాజు హనుమంతరావుగారు –వీరితో చేయి కలిపిరి. బందరు నుండి కవికొండల సాంబశివరావు గారును వచ్చి చేరిరి. వీరందరికిని వీరి తోట లోనే కాపురముండుటకై ఇచ్చితిరి.

ఆ కాలమున దేశ స్వతంత్ర వాద మెక్కువయి ,వ0దే మాతరం నినాదము బయలు దేరినది.బంగ దేశీయులైన విపిన్ చంద్ర పాల్ గారు రాజమహేంద్ర వరమున నుపన్యసించగా పలువురు యువకులు,విద్యార్థులు నాకర్షితులైరి. పాఠశాలలు మానుట, గురు ,అధికార ధిక్కార మధిక మయ్యెను. విద్యార్థులను పాఠశాల యాజమాన్యము వారు వెడల గొట్టిరి.వృద్ధుల మాటలు చెల్లుబాటు కావయ్యెను. వీరు మాత్రము బ్రిటిషు వారి చలువ చేత భారత దేశము శాస్త్ర,సాంకేతిక రంగములును, ముద్రణా,రవాణా సౌకర్యములు,తంతి తపాలా ,కొలువులు మనకు లభ్యమై,నాగరికత పెరిగె ననియు,మానవు లందరు కుల మత రహితముగా నై క మత్యమును,మానవత్వమును ,స0ఘ సేవయు,స్త్రీల విద్య,వివాహ సంస్కరణమును వృద్ధి చేసికొని,తెలివిని ,సమర్థతను మనలో పెంపొందించుకొని సుహృద్భావముతో పర దేశీయులతో చర్చించి,మన స్వాతంత్ర్య మును సాధించుట తగిన విధాన మని వ్రాసిరి. ఉపన్యసించిరి. ఉద్బోధించిరి. అందు చేత,వీరిని దేశ భక్తి శూన్యులని ముద్ర వేసి,సంఘ ద్రోహిగా పరిగణించి,బహిష్కరింప దొడగిరి. వీరు చేసిన మంచి బృహత్కార్యములను,సాహిత్య స్త్రీల సేవను,విద్యాభివృద్ధిని మరచి,వీరికి వ్యతిరేకముగా వ్యవహరింప సాగిరి. వీరి యనుయాయి లెల్లరును శత్రు భావమును జూప సాగిరి.కనీసము వీరితో మాటలాడుటయును మాని వైచిరి.

ఇంత మాత్రమున వీరికి రాజ్యాంగ విషయముల నాదరము లేదని భావింప రాదు. వివేక వర్ధనికి పదునారేండ్లకు పైగా విలేఖరిగా నున్న వీరు జాతికి పురోభివృద్ధిని, స్వతంత్రాకాంక్షను గూర్చిన నిశ్చిత వివరణములను,అభిప్రాయములను, శాంతి కార్య సమాచరణమును గూర్చి వ్రాసి యుండిరి. 1887 లో చెన్నపురి యందు వీరీ విషయమును గూర్చి సభలో నుపన్యసించిరి. 1885 లో రాజమహేంద్రవరమున దేశీయ మహాసభ ,దాని

యుద్దేశములను శీర్షికపై వీరుపన్యసించి,ఆ వ్యాసమును ముద్రించి అందరికి అందజేసిరి. మొదట వ్యక్తిగత,మత విషయిక సంస్కారములను సాధించి,యెల్లరును విద్య నభ్యసించి ,తరువాతనే రాజ్యాంగ సంస్కరణల సాధనకై యత్నింప వలయు నన్నదే వీరి ప్రచారము,ప్రబోధమై యుండెను. నిరంతర కృషి,దీక్ష లవసరమని వీరు వెల్లడించిరి. ధనమును సద్వినియోగము చేయ వలెనన్నది నేర్చిన తరువాతనే –ధనార్జనాశయమునకు ప్రయత్నించుట యుక్త మని వీరు తెలిపిరి. ఒకే విషయమున నభివృద్ధి సాధనా యత్నము గాక,వీరు సర్వతోముఖాభివృద్ధికి ముందడుగు వేయ వలె ననిరి. మత మూఢత్వములు,సంఘ దురాచారములను వీడ వలెనని చెప్పిరి. స్త్రీలకు స్వాతంత్ర్య మివ్వ లేక,వారికి విద్య అభివృద్ధి నంద జేయ లేని వారు రాజ్యాంగములను గూర్చి పలుకుట అనుచితమని వీరు వాదించిరి. ఇంట గెలిచి,రచ్చ గెలుచుట యుక్త మనిరి. ఐకమత్యము ,సదవగాహన,సహజీవన సామరస్యములు సాధి0ప ముఖమైనవి.దీని ముఖ్యోద్దేశములు మూడు.

1)దేశాభిమానమును పురి కొల్పుట . 2)జాతి నీతి కులాచార వ్యవహారము లందు సమస్త శాఖలును క్రమ క్రమముగా నభివృద్ధిని కలిగించుట. 3)న్యాయముగాను,శాంతి తోను బ్రిటిషు వారితో సామరస్యముగా స్వతంత్ర సాధనకై యత్నించుట.

ప్రభుత్వము ద్వారా లభించిన సత్ఫలితములను గూర్చి మన దేశపు విద్యాధికులు సామాన్యులకు వివరించి,ప్రభుత్వమునకు సహకరించి,మరిన్ని సౌకర్యములను సంపాదించి,శాంతి యుతముగా రాజ్యమును నడుపు రీతిగా నొనరించ వలెనని వీరు తెలిపిరి. పూర్వపు రాజులు మనలను బీదలనుగా జేసి, పీడించగా,బ్రిటిషు వారి రాకచే మన కెన్నియో సదుపాయములు,సమానత్వము లభించుట సత్యమే కదా. ఎంత దూరమున నున్న వారైనను తంతి ద్వారా సమాచారములను తెలిసి కొనుట లేదా.రైలు మార్గముల ద్వారా శీఘ్రముగా దూర స్థలములకు ప్రజ లేగుట జరుగుట లేదా.విద్య,న్యాయశాస్త్రము గలిపి–రక్షణ నేర్పరుప లేదా. పత్రికలు,ముద్రణ ద్వారా ముఖ్య విషయముల ప్రచారము జరిగి, సాహిత్యము,కార్యక్రమములు నిక్షిప్తము చేయబడుట లేదా. ఇంగ్లీషు విద్య ద్వారా విదేశము లందు విద్య ,వ్యవహారములను జరుప గల శక్తి మనవారి కంద లేదా. అని వీరు ప్రశ్నించిరి. గతములో నున్న పలు ప్రభుత్వముల కంటే వీరి పాలనమే యుత్తమమని మనము గ్రహింప గలము కదా. ఈ రీతిగా వీరి వాదన,ప్రచారము సాగినవి. ఇంగ్లీషు వారిని చంపిన వారిని గౌరవించుటయును ఆనాడు కొనసాగింప బడెను.1907 లో వీరు కుముద వల్లి ,భీమవరముల సభలలోను 18-4-1908 న బందరు నందును ఆస్తిక మహా సభల లోను ప్రసంగించిరి. దేశమున కీనాటి వారి నిరసనల వలన అభివృద్ధి కుంటుపడు చున్న దని వీరు తెలియ జేసిరి. పరనిందను,స్వాభిమానమును వీడి,ప్రగతికై కృషి చేయ వలెనని వీరు పలికిరి. కొందరు వీరిని పిరికి పందగా వర్ణించిరి. వీరితో సహ భోజనమును పలువురు బందరులో నిరసించిరి. ఆతిధ్య కర్త,భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు ,ముట్నూరి కృష్ణారావు గారు,రామాచారిగారు,పావకేశ్వరరావు గారును మాత్రమే వీరా నాడు వీరితో కలసి భోజనము చేసిరి.

సౌభ్రాతృత్వమును గూర్చి పలుకు వారే గాని,నిజ జీవితమున ఆచరించువారు తక్కువ. మామిడి దేవేంద్రుడు గారికి ధనము కావలసి రాగా,వారి మిత్రుడైన నాళము

కృష్ణారావుగారు ధనము కలిగియు నీయ దలఁపక,వీరేశలింగము గారిచే బ్రతిమాలి ఇప్పించిరి. కాని ,దానిని గడువు దాటి పోయినను తిరిగి అత డివ్వలేదు. కృష్ణారావు గారును ఇప్పించ లేదు. వీరు వ్యాజ్యము వేయ బోగా, వలదని వారించి,వారి బంధువులా ధనమును రెండు వాయిదాలలో నిప్పించిరి. ఇక వితంతు వివాహ సమాజమును వీరే స్థాపించి,ఆ యా వివాహములును జరిపించెడి వారయ్యును,కొందరు వీరికి స్వస్తి చెప్పదలచి,ఒక సభ నేర్పరచి,వీరికి సన్మాన పత్రమును చదివి,(27-12-1907న)వారు వేరొక క్రొత్త సమాజమును స్థాపించు వారమని తెలిపిరి. వీరి నగౌరవ పరచినను కోపము కలిగియు ,వీరు వారితో ఫోటో దిగుటకు అసమ్మతిని ప్రకటించిరి. తరువాత,పుల్లాభట్ల గవరయ్య శాస్త్రిగారు వీరిని పిలిచి, తమ క్షమాపణను వ్రాసి తెలిపిరి. ఆ సమాజము త్వరలోనే అంతరించెను. మరి కొందరు వితంతు వివాహములు చేసెద మనగా వారిని హిత కారిణీ సమాజమున చేరి ,సేవ యొనరించుడని సలహా నిచ్చిరి. అయినను వారందు చేర లేదు. వారికి ధనము నందజేసిన పెత్తనము చేయు నుత్సాహము మాత్రమే యుండెను. కానీ,వీరి వితంతు శరణాలయము నందే ఏటేట నాలుగైదారు వివాహములు జరుపబడు చుండెడివి. ఒక సారి వీరు కాకినాడకు పోయి,వితంతు వివాహ మాడని వాని ఇంట భుజించ వలసి వచ్చెను.దానిని చూచిన ఇతర వితంతు వివాహితులు సిగ్గు పడి–వీరిని భోజనమునకు పిలిచి, సత్కరించిరి.ఒకరిద్దరు వీరి సహ పంక్తి భోజనమును నిరసించినను,తరువాత బాధ పడి ,క్షమాపణ లడిగిరి.చింతామణి ముద్రణా యంత్రమును వీరింటిలో నుంచుటకు తావు లేక,దాని కొరకై వీరు నూరు రూపాయలు వ్యయము చేసి,దొడ్డిలో పెద్ద పెంకుటిల్లు వేయ వలసి వచ్చెను. పని వారికి జీతము లిచ్చుట,వ్రాత ప్రతులను దిద్ది సవరించుట కష్ట తరమై ,వీరు వృద్ధులగుట చేత,వారీ ముద్రణ యంత్రమును గున్నేశ్వర రావు సోదరుల కమ్మివేసెను. పది సం .ల వరకు వీరి పుస్తకములను విక్రయించుటకు ననుమతి నొసగి,తరువాత వీరే దానిని తిరిగి పుచ్చుకొనిరి. వీరి కారోగ్యము దిన దినము క్షీణింప సాగెను.

ఒక దినమున వీరింటిలో స్పృహ తప్పి పడి పోయిరి.వీరి భార్య జాగ్రత్తగా సాయ పడెను. తరువాత వీరిని లోనికి గొని పోయెను. ఇల్లు ఇరుకుగా నుండి పలు వస్తువులతో నిండి యుండెను. వీరు వానిపై పడినచో హాని జరిగి యుండెడిది. కాని ,కరుణామయుడగు పరమాత్మ వీరిని కాపాడె నని వీరు నమ్మి యుండిరి. పాఠశాల యందు 4 స్త్రీలు,ఒక పురుషుడు ఉపాధ్యాయులుగా నుండియు, జరుగ వలసినంత విద్యా బోధనము జరుగక పోవుటచే ,వీరికి చింత యధిక మయ్యెను. దీనిని పెంచి,బాలికల యున్నత పాఠశాలగా నభివృద్ధి చేయవలె ననునది వీరి సంకల్పము. అది సాధించుటకు వితంతువులు,అనాధ బాలికలకు విద్య గరపుట యొక్కటే మార్గమని ఎంచి వీరు అగతిక రక్షణ శాలను స్థాపింప నిశ్చయించిరి. 1908 లో వీరు తమ పాఠశాలను పట్టణము నుండి మార్చి,తోటలోని రామచంద్ర రావు గారింటిలో పెట్టిరి.ఇద్దరు ఉపాధ్యాయినులు వారి మధ్యలోవారు తగవు లాడుకొను చుండిరి. అందు చేత,వారిని తొలగించి,పెద్ద వయసు ఉపాధ్యాయులను వీరు నియమించిరి.

పిఠాపురం రాజావారు స్థాపించెదమని తెలుపగా వీరు అగతిక రక్షణ శిశు సంరక్షణాలయ నిర్మాణమును మాను కొనిరి.వీరిప్పుడొక ఆస్తిక పాఠశాలను స్థాపింప నుద్యోగించిరి. పట్టణములో నొక మాధ్యమిక పాఠశాలను చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు

నిర్వహించు చుండిరి. దాని ప్రధమోపాధ్యాయులు సత్యవోలు లక్ష్మీపతి గారు జీతమును గైకొనకయే అందు పని చేయుచుండిరి. వీరడుగగానే నరసింహం గారు తమ పాఠశాలను హిత కారిణి సమాజమునకు సామాగ్రితో సహా 1907 సెప్టెంబరులో వీరికి స్వాధీన పరచిరి.లక్ష్మీపతి గారు పని మానివేసిరి. మిగిలిన మూడు నెలలు వీరికి రు 300/లు ఖర్చు పడెను. దీనిని వీరిక ఉన్నత పాఠశాలగా మార్చుటకు ప్రయత్నించ వలెనని తలచిరి. దానికై యేట్సు దొర గారి సాయమున విద్యా విచారణాధికారి పాఠశాల నంగీకరించెను. పాఠశాల మందిరము కొరకు వీరు రు 200/ల కొక ఇంటిని ,సోమయాజులు గారి దగ్గర కొని, దాని చుట్టు ప్రక్కల నున్న ఇండ్లను కొనుటకు బేర మాడిరి.

అప్పటికి మరి రెండు ఉన్నత పాఠశాల లున్నవి. ఒకటి క్రైస్తవ మతాచార్యులది,రెండవది ప్రభుత్వము వారిది . ఇందులో రెండవది మంచి యభివృద్ధిలో నుండెను. కొందరు వీరి పాఠశాల నంగీకరింప వలదని యేట్సు దొరగారి ద్వారా చెప్పించిరి.అందు చేత వీరి పాఠశాల నంగీకరింప లేదు. వీరు చెన్నపురికి పోయి,స్వయముగా విషయమును వివరింపగా,ఒక కమిటీ వేసి,అందు వారే సభ్యులుగా నుండి నిర్వాహక సంఘము నేర్పాటు చేసి యంగీకారము నొసంగిరి.సాయమున కొక భటుని హిత కారిణీ సమాజము నుండి కోరగా ఒకసారి పంపి,తరువాత వారంగీకరించ లేదు.ఒక ప్రధానోపాధ్యాయుని నియమించు యత్నములో వీరుండిరి. వీరప్పుడు బెంగుళూరునకు పోయి, తిరిగి వచ్చిరి. వెంకట రత్నము గారు వీరిని కలిసి,సంఘము నుండి హంటర్ దొర గారు మానుకొన దలచి నట్లు చెప్పిరి.కారణము వారిని సంప్రదించక,అధ్యాపకులను నియమించుట యని వారు వ్రాసిరి. కానీ,వీరు స్వయముగా నెవరిని నియమించనే లేదు.ఈ విషయములను హంటర్ గారికి వీరు లేఖను వ్రాయగా ,తమకెవరో తప్పుగా చెప్పి,మభ్య పెట్టిరనియు,తాము సంఘము నందుండుట కంగీకరించెద మనియు వ్రాసిరి. తరువాత,4,5,6 ఫారములను పెట్టుటకు వీరి యంగీకారమును లభించెను.

ఇక నా యున్నత పాఠశాల భవన నిర్మాణ కార్యక్రమమునకు వీరు ప్రయత్నింప సాగిరి. పిఠాపురం జమీందారు గారు కుమార మహీపతి సూర్యారావు గారు రు 40,000/ల నిచ్చెద మనిరి.దానితో వీరు కొన్న క్రొత్త స్థలములో నొక భవనమును కట్టుటకు ప్లానును పైవారికి పంపిరి. 3 నెలల వరకు జవాబు రాలేదు. అదే సమయమున “వ0దే మాతరం” ఉద్యమము అధికమై,విద్యార్థులు బడి మాని, వీధులలో కేకలు వేసి,ప్రభుత్వమునకు వ్యతిరేకముగా తయారైరి. దాని ప్రక్కనే యూరోపియనుల నివాసముండుటచే విప్లవము వారు వారిని నిందించి,గొడవలు చేయుదురను వాదనచే –వీరి భవన నిర్మాణమున కంగీకరించ లేదు. వేరొక దానిని కట్టుకొన మని వారు తెలుపగా, వీరంగీకరింపక,అచ్చటనే నిర్మించెదమని గట్టిగా చెప్పిరి.రెవరెండు మెక్రిడీ గారు దారికై తమ స్థలములో కొంత వీరి కొసగిరి. దాని నంటి యున్న పుప్పాల చెరువును హిత కారిణీ సమాజమున కిమ్మని వారు మండలాధికారికి వ్రాసిరి. ఇప్పుడు పాఠశాలకై మరొక స్థలమును వీరికి వెదుక వలసి వచ్చెను.ఇన్నీసు పేటలో రెండు మూడు వేల గజముల స్థలము కలదు.రేటు రు 4/లు. కాని ,అది ఆటలకు చాలదు. ఇంకొకటి కొనుటకై ఇన్నీసు పేట నానుకొని యున్న 6 యెకరముల హుకుం పేట స్థల మొకటి అమ్మకమునకు వచ్చెను. దానిని కొనవచ్చునని హంటర్ గారు చూచి చెప్పిరి. రు 12oo /లకు వీరు దానిని కొనిరి. మధ్యలో రైలు మార్గము ఉండుటచే

అందులో ఒక ఎకరన్నర మాత్రము పాఠశాల కుపయోగ పడ లేదు.దీని కంటె యున్న మరొక ఒకటిన్నర యెకరముల స్థలమును రు 450/లకు వీరు కొనగలిగిరి. ఇవి నల్లరేగడి భూము లగుటచే భవనమునకు పునాదులను చాలా దృఢముగా వేయ వలసిన యవసరము కలిగెను. విద్యార్థు లల్లరి చేయక,యూరోపియన్లను గేలి చేయక,క్రమశిక్షణతో నుండుటకు వీరు చక్కని ప్రార్థనను రచించి,వారిచే నిత్యము పఠింప జేసెడి వారు.వీరి మొదటి పాఠశాలా గృహము చాల నందున దాని నద్దె కొసగి, 1908 లో ఎడ్వర్డు పాఠశాలను కూడా వీరే గైకొని,ఇన్నీసు పేటలో వీరా పాఠశాలను నిర్వహింప సాగిరి.

పాఠశాల వృద్ధి యగుటచే స్థలము చాలక,రు 600/లను ఖర్చు చేసి,దొడ్డిలో 3 పెద్ద పాకలను వేసి, తరగతుల నందుంచిరి.అదియును చాలనందున,మరొక ఇంటిని రు 20/ల కద్దెకు గొని, క్రింది తరగతుల నందుంచిరి. దీనికి దేశిరాజు పెద బాపయ్యా గారిని ప్రధానోపాధ్యాయునిగా నియమించ వలెనని వీరు తలంచిరి.కాని ,వారి కనారోగ్యము కలిగి,చెన్నపురికి వైద్యమున కేగి,9-3-1908 న పరమపదించిరి. పాఠశాల మందిర నిర్మాణమునందు వీరికి కంచుమర్తి వెంకట సీతా రామచంద్ర రావు గారు సహాయ పడిరి. కానీ,వారి యోచన వీరికి నచ్చక, ఆ బాధ్యత నంతను తన పైననే వేసికొనిరి.ఇటుకలు,సున్నము,రాళ్ళను చౌకగా బేరమాడి,వీరే సమకూర్చిరి. పాఠశాల సహాధ్యాపకుడైన కుందూరి వెంకట రత్నము గారు కూలి,ఆదాయము,ఖర్చుల లెక్కలను వ్రాయుట యందు సాయ పడిరి. మొదట రు 20,000/ ల ఇల్లు– తరువాత రు 40,000/లు అవుతుందని తలపగా చివరకు అరువది వేల రూపాయలకు గాని పూర్తి అవలేదు. దానిని చూచిన వారు దాని ఖర్చు లక్షా ఇరువది వేలకు తక్కువ కాకపోవచ్చునని పలికిరి. పాఠశాలపై అంతస్థు నందు వేయేసి మందికి సరిపడు రెండు సభా సదనము లున్నవి. స్త్రీలు కూర్చుండుట కొక ప్రత్యేక గదిని కూడా నిర్మించిరి. ఈ పాఠశాలలో బాలురతో పాటు బాలికలను చదువ వచ్చును.

ఇంగ్లీషు విద్యను కూడా ఇందు నేర్పెదరు. బాలురను బాలికలతో నసభ్యముగా ప్రవర్తింప నీయక, గట్టి కట్టు దిట్టములను వీరేర్పాటు చేసిరి. ఇచ్చట స్త్రీలకు ఉచితముగా చదువు చెప్పుచుండిరి.పంచమ బాలురను సైతము వీరు పాఠశాలలో చేర్చుకొను చుండిరి. వారి యెడ ఎట్టి వివక్షతయు చూప నీయుట జరుగ లేదు. వారి నుండియు జీతములను వసూలు చేసెడి వారు కారు.దీని యున్నతి తరువాత వీరి పట్టణము లోని క్రైస్తవ మతాచార్యులు వారి పాఠశాలను తీసి వేసి,మాధ్యమిక పాఠశాలగా మార్చిరి. వీరి పాఠశాలల ఇరుగు పొరుగున బీదల పాక లుండెడివి. వాతావరణము బాగుండక,పోవుటచే,దాని దగ్గరగా నున్న మరొక 5 వేల గజముల స్థలమును నాలుగు వేల రూప్యముల నిచ్చి,కొనిరి. ఈ ధనమును కూడా పిఠాపురం రాజా గారే యొసగిరి. ఈ పాఠశాల నిమిత్తముగా వారు సుమారు డెబ్బది వేల రూపాయల నొసగి వారి ఔదార్యమును ప్రకటించిరి.

27-11-1911 న పాఠశాల గృహ ప్రవేశ ఉత్సవమును కలకత్తా సిటీ కాలేజీ యధ్య క్షులైన హేరంబ చంద్ర మిత్ర గారు వచ్చి,జరిపించి ఉపన్యాసమును చేసిరి. నాటి సాయంత్రము ప్రముఖు లందరు వచ్చి,ఆనందించి–అభినందించిరి. ఆ సభ యందు పాఠశాల పేరును వీరి పేరుపై అధికారికంగా మార్చి,పిఠాపురం రాజావారి యుత్తరము ద్వారా ప్రకటించిరి. వీరు వలదను కొన్నను,వారి యాదరణను కాదన లేక పోయిరి. ఆ పాఠశాలలో సుమారు 500ల

మంది విద్యార్థులు చదువు చుండిరి.దీని పేరు ఆస్తికోన్నత పాఠశాల యయ్యును,అందులో ఆస్తిక విషయ బోధన ఏమాత్రము జరుగుట లేదని వీరు విచారించ సాగిరి.పాఠశాలకు రైలు కట్ట కవతల నున్న స్థలము నమ్మి ,రు 1250 /లతో ఉత్తరపు వైపున తాటాకుల ఇండ్ల వరుసను కూడా కొని వేసిరి. వితంతు శరణాలయమును కూడా వీరి తోటలో నిర్వహింప సాగిరి. అందలి వితంతువులతో చాలా కష్టనష్టము లెదురైనవి. చదువు కొనక,వారు తమకు శీఘ్ర వివాహములు కావలె ననెడి వారు. వారిలో వారు తగవు లాడెడి వారు. తిండి మాని వైచియు,రోగములకు మందులు సరిగా తినకయు,వేధింపు చేసెడి వారు.అయినను వారి యున్నతికి వీరే పాఠశాల యందు పని చేసియు,మరి ఇద్దరుపాధ్యాయులను ,కుట్టు పని నేర్పుట కొక స్త్రీని నియమించిరి.వీరి భార్య సంగీతమును నేర్పుటయే కాక, ఆనందాశ్రమమున స్త్రీలచే సామూహిక ప్రార్థనలను చేయి0చెడిది. చిత్ర లేఖనమును నేర్పుట కొక ఉపాధ్యాయు నేర్పరచిరి. వీరి మిత్రులైన కనపర్తి యోగానందము గారి వితంతు కుమార్తె (సుందరమ్మ)వీరింటనే యుండి చదువు కొనెడిది. వీరామెను పుత్రికగా భావించి,పోషించిరి. ఆమె ఈ వితంతు శరణాలయము నందు సేవ చేయుట తన ధర్మ మనెడిది. ఆమెకు వీరు ఇంగ్లీషును,బ్రాహ్మమత సిద్ధాంతములను బోధించిరి.

శరణాలయము నందుండు వారి భోజనము వగైరాల ఖర్చులు వీరే భరించెడి వారు.నెలకొక్కరికి 5 రు .ల చొప్పున ఇచ్చెడి వారు.వారికా డబ్బు చాలదని గొడవ చేసెడి వారు. మరొక వితంతువు హనుమాయమ్మ కృష్ణా మండలము నుండి వచ్చి,ఇచటనే చేరినది. ఆమెను వెంట గొని పోయి,వీరు బెంగుళూరు నందు కంటి వైద్యమును చేయించిరి.వితంతువులు వివాహములు జరిపించమని తొందర చేయగా, నీ హనుమాయమ్మను కరగ పురము కొండలరావు గారి దగ్గరకు పంపి వేసిరి.మరి ఇద్దరకు వీరే వివాహము చేసి పంపి వేసిరి. కొందరి వితంతువుల ప్రవర్తన సరిగా నుండక పోవుట వీరిని కలచి వేసినది.కొందరు చెడిపోయి,గర్భవతు లైరి. అట్టి వారి కొరకు వీరు పతిత యువతీ రక్షణ శాల నొకటి నిర్మింప దలచిరి. గర్భవతి యైన ఒక వితంతువును వీరే కాపాడి,పురుడు పోసిరి. ఆ శిశువు చని పోయెను.తరువాత నామె నొక విధురుడైన బ్రాహ్మణ పురోహితుడు పెండ్లాడి ,కొనిపోయెను. మరొక కోమటి వితంతువు వీరి దరికి చేరెను. ఆమెపై నగల అపహరణ కేసు కలదు. దాని సంబంధముగా నున్న నొక పురుషుని పోలీసులు కారాగారమున బంధించిరి. ఆమెను శిక్ష తరువాత వీరు కొని వచ్చి,తమ కడ నుంచు కొనిరి.పురుషుడు శిక్ష తరువాత నీమెను బంప మన్నను వీరంగీకరింపక,నతనిని తరిమి వేసిరి. ఈమెను సలాది కృష్ణమూర్తి యను వాని కిచ్చి,వివాహ మొనరించి,అతనితో పంపి వేయ దలచిరి. కానీ,వారిద్దరూ వీరితోనే యుండి,వితంతు శరణాలయము లోనే పని చేయ సాగిరి. వారు తమ జీతము ఖర్చులకు చాలదని,శరణాలయము వారికి వస్తువుల నమ్మెద మనిరి. కానీ,ఎక్కువ ధరలు వసూలు చేయుచున్నారని వీరికి తెలియగానే, వారినా పని నుండి మాన్పించిరి.తరువాత ,వితంతు శరణాలయము భోజన వ్యవహారమును వీరే నిర్వహించి,తక్కువ ఖర్చుతో నడుప సాగిరి. మిగిలిన ధనముతో రవికల గుడ్డలను,ఇతర వస్తువులను కొని ఇచ్చిరి. ఈ లెఖ్ఖలను వీరు సుందరమ్మ గారిచే నిర్వహింప జేసిరి. మోసమునకు తక్కువ తూకం,కొలత పాత్రలు తప్పుగా నుండుట –కారణములుగా తేలినవి. దీనికి కనకరత్నమే కారణ మని వీరు కనిపెట్ట గలిగిరి. వారికి కోపము వచ్చి,ఇంటిని ఖాళీ చేసి,బయటకు పోయెద మనిరి.అందులో వీరి

పుస్తకములను తెచ్చి,పెట్టెద మను కొనిరి. కానీ,వారు మనసు మార్చుకొని, ఇచటనే ఉండెదమని అర్థించిరి. కనుక,వీరి పుస్తకముల నుంచుటకు తోట మేడ ఇంటి ప్రక్కగా నొక పెద్ద యింటిని కట్టించిరి. మోస మొనరించినను వారిని వీరును,వీరి భార్యయు నాదరించి, చూచిరి. ఆమెకు పురుడు పోసిరి. మరి నలుగురు యువతులు వీరి రక్షణ శాలలో జేరిరి.కొందరు పిల్లలను కని ,చెప్పకుండా పారి పోవ సాగిరి.అలా,పారిపోయిన ఒక బ్రాహ్మణ వితంతువు బిడ్డను వీరి భార్య పెంచెను.

విక్టోరియా వితంతు శరణాలయ విధి విధానములను వీరు ప్రకటించిరి. అందు చేరుటకు కావలసిన విధానము, శరణాలయము నందెట్లుండ వలెను,ఏయే పనులు చేయ వలెను,బయట వారిని కలియుటకు శరణాలయాధికారి అంగీకారమును పొంద వలయును. సత్ప్రవర్తన కలిగి యుండ వలయును. విద్య,పుస్తకములు సం.నకు,రెండు సార్లు బట్టల నుచితముగా నీయ బడును. తగవు లాడరాదు. ఉదయముననే లేచి,పనులు పూర్తి యైన తరువాత ప్రార్థన చేయ వలెను.భోజనము సమయమునకే వచ్చి చేయ వలెను. ధర్మోపదేశములను విన వలెను. ఆదివారము ఉదయము 7—8 గంటలకు మధ్య ప్రార్థన కందరును రావలెను. బయటకు పోయి,వస్తువులను కొన రాదు. ఇంటికి పోదలచిన వారు సంరక్షకుల యంగీకారమును పొందియే పోవలెను. ఆటలు,వ్యాయామము లందు పాల్గొన దగును. శుచిగా నుండ వలెను. అన్ని మతముల వారు వారి వారి ఆచారములను పాటింప దగును. ఇట్టి నియమముల నతిక్రమించిన వారిని బయటకు పంపు అధికారము శరణాలయాధికారికి కలదు. శ్రీ ములుకుట్ల అచ్యుతరామయ్య గారు కట్టించిన నూతన వితంతు శరణాలయము గృహప్రవేశము 15-11-1908 న బాగుగా జరుప బడినది. ఆ సందర్భమున వీరొక ఉపన్యాసము నొసగిరి."దైవ కటాక్షమున నేనీ పనిని శ్రద్ధగా పూర్తి జేసి, నిర్వహింప గలుగు చున్నాను.దీనికి ధన వితరణ చేసిన మహానుభావుల కెల్లరకు నా వందనములు ,కృతజ్ఞతల నంద జేయు చున్నాను.నాకు శరీర బలము,ధన బలము రెండును లేకున్నను, ఇట్టి కరుణ గల వారి సహాయమున నీ యనాధ రక్షణ,సేవలను కొనసాగింప గలుగు చున్నాను.కొందరు పూర్తి వ్యయమునకు ధనమొసగి,తోడ్పడు చున్నారు. అచ్యుత రామయ్య గారీ భవనమును నిర్మించి ఇచ్చిరి. వారికి వందనములు. దీనికి ప్రారంభమున నా దగ్గర గల రు 2000/ లను తెప్పించి,పని నారంభించితిని. ఈ కార్యమునకు పిఠాపురం జమీందారు గారు పూర్తి సహకారము నొసగి,ప్రోత్సహించిరి.నాకు గల ధనము నంతయు హిత కారిణీ సమాజము పేర వాసి,నేను పూర్తి దరిద్రుడ నైతిని. పలు విధము లైన ధనము ఒత్తిడులను తట్టు కొని,పలు రకములుగా సర్దుబాటు చేసి,నేనీ పనిని నిర్వహించ గలుగు చున్నాను. దీనికి సహకరించిన ప్రతి వారిని ఆ పరమేశ్వరుడు ఆయురారోగ్య ఐశ్వర్యముల నొసగి,కాపాడు గాక"--ఇది సారాంశము.

ఈ శరణాలయమున కిక ముందు మనుష్య సాయ మెంతయో అవసర మైనది.నిత్యము తన సేవల నంద జేయు నుత్తమురాలు శ్రీమతి సుందరమ్మ. ఈమె వయసున చిన్న దైనను బుద్ధిమంతురాలు. ఈశ్వర భక్తి కలది. అందరును నాకిచట పుత్రికా సములయ్యును, ఈమె నాకు ఈశ్వర దత్తమైన దత్త పుత్రికగా మేమామె నాదరించు చున్నామని వీరు తెలిపిరి. అట్టి ఈమెతో పాటు శ్రీ మతి కారుమూరి మల్లమ్మ కూడా వితంతు శ్శరణాలయాభివృద్ధికై పని చేసెద నని ప్రతిజ్ఞ పూనినది. స్త్రీలు పూను కొనిన గాని

సత్కార్యములు సఫలము కానేరవు కదా.యువక పురుషు లశ్రద్ధ చేయు చుండిరి. వీరు వయో వృద్ధు లగుట చేత నిక ధనార్జనా ప్రయత్నముల నొనరింపక,శరణాలయము నందే పని చేసి,స్త్రీ జనాభ్యుదయమునకు పాటు పడవలెనని తలంచిరి. వీరి కృషి చేత నొక స్త్రీ యైన విద్యావతియై,పరోపకార చింత బడసిన తమ జన్మ ధన్య మయినట్లే నని వీరు తలపోసిరి. ఈ సత్కార్యము లందు నిరంతరము వీరికి సాయ పడు మిత్రులు కారుమూరి కామరాజు గారు శ్రీకాకుళమునకు పోయి,చని పోయిరి.అంతకు ముందే దేశిరాజు పెద బాపయ్యగారు కాలము చేసిరి. ఆయన భార్య మల్లమ్మ ఇచట సేవ చేయుట కుత్సాహ పడినను —1909 లో పరమ పదించినది.1908 లో దొరతనము వారు వీరిని వివాహములు చేయు రిజిస్ట్రారుగా నియమించిరి. వీరు చేసిన మొదటి వివాహము సుందరమ్మ,కామరాజు హనుమంతరావు గారలది. పులవర్తి వెంకట సుబ్బారావు వివాహమును కూడా వీరు చేయ నిశ్చయించిరి.అది ఒకటి మాత్రమే 18-10-1908 న జరుప బడినది. హనుమంతరావు బందరు పోయి,తిరిగి వచ్చి,మనసు మార్చుకొని, సుందరమ్మను 25-7-1909 న వీరి యనుమతితో వివాహ మాడిరి. ఈ దంపతులలో ఒకరు వితంతు శరణాలయ పర్యవేక్షకురాలు గాను, ఒకరు హితకారిణీ సమాజము సహాయ కార్యదర్శి గానుఇక్కడనే పని చేయ సాగిరి. ఏ రెండే కాక,మూడవ శాసనాధారముగా మరి రెండు వివాహములు జరిగినవి.

1907 లో వీరికి మూర్ఛ వచ్చి, ఒకరాత్రి పడిపోయిన నాటి నుండి,కొంత కాలము వీరు దుర్బలులు గానే యుండిరి.ఆ సమయమున కలకత్తా నుండి పండిత శివనాథ శాస్త్రి గారు రాగా, వారితో కలిసి, భార్యా సహితముగా వీరు కలకత్తా చూడ వలెనని బయలు దేరిరి. భువనేశ్వరులో దిగి,దేవాలయములను దర్శించి, బౌద్ధ గుహలను చూసి,కలకత్తాకు చేరిరి. అచటి బ్రహ్మ సమాజము వారు వీరిని సన్మానించిరి. మరి మూడు సమాజముల ముఖ్యులును వీరిని గాంచి,యాదరించిరి. తిరిగి వచ్చుచు,కటకము నందు దిగి,రావు బహదూరు మధుసూదన రావు గారి కతిథులుగా నుండిరి.మరుసటి దినమున బయలుదేరి,రాజమహేంద్రవరమున కీ దంపతులు చేరిరి. ఆ ఏడు వేసవి కాలమున వీరు మొదటి సారి బెంగుళూరునకు వెళ్లిరి. మైసూరు పత్రిక లన్నియు వీరిని ప్రశంసించి,వ్రాసిరి. అచటి వర్ధమాన సమాజము వారు వీరిని సత్కరించి,ఛాయా పటములను తీసికొనిరి. మైసూరు నందు మహారాణీ కాలేజీలో వీరికి స్వాగత మొసగిరి. శివ సముద్రము,కోలారు బంగారు గనులను చూచి,తిరిగి వీరు బెంగుళూరుకు చేరిరి. 15-6-1917 న వీరికి స్వాగత పత్రమును చదివి, సత్కరించిరి. వీరి సంఘ సంస్కరణ,స్త్రీ సముద్ధరణ,విద్యావ్యాప్తి కార్యక్రముల నన్నిటిని ప్రస్తావించి,ప్రస్తుతించిరి. ఆ తరువాత వీరు బరంపురము నందు వితంతు వివాహమును జరుపుట కేగిరి.ఆ పెళ్ళికి పురప్రముఖు లనేకులు వచ్చిరి. నాడొక (7-7-1917 న) స్వాగత పత్రిక నిచ్చి, సత్కరించిరి. వీరి సత్కార్య సాధన– దక్షతలను శ్లాఘించి, పలువురు ప్రేరణ బడసి, సేవాభావము నలవరచుకొన వలె ననిరి. అంతకు ముందు వీరు బందరున కేగిన తరి,అచటి వారొక సన్మాన పత్రిక నొసగిరి. (17-4-1908). అలాగే బాపట్ల యందును వీరి నాదరించి,సన్మానించిరి. మొదట దూషించి,రాళ్లు వేసినను–వారే నేడు తమను గౌరవించుటను వీరు కాలము మారినదని భావించిరి.

చెన్నపురి నుండి తిరిగి వచ్చిన తరువాత వీరు పుర పారిశుధ్య విచారణ సంఘములో సభ్యుడుగా నుండిరి. మధ్యస్థ కారాగారమునకు(సెంట్రల్ జైలు)వీరిని అనధికారిక

ద్రష్టగా (నాన్ అఫీషియల్ విజిటర్) నియమించిరి. ఒకసారి లాలీ దొర గారు1909 లో వచ్చి,వీరితో నత్యంతాదరముగా మాట్లాడిరి. వీరి వితంతు శరణాలయమునకు వచ్చి, చూచి పోయిరి. 14-4-1908 న వీరికిఅరువది సం!!లు నిండినవి. మిత్రులు వీరికి షష్టి పూర్తి యుత్సవమును జరిపించగా పట్టు పెట్టిరి. పలువురు మిత్రులు,ప్రముఖులు,వితంతు వివాహ దంపతులు వచ్చి సత్కరించి,పూల మాలలను వేసి, పలువురు శాలువలను కప్పి , నూతన వస్త్రముల నొసగి, పద్యములను వ్రాసి,ఛాయాపటములను తీసి,పలు విధములుగా సన్మానించిరి. కొందరు మంగళ గీతికలను పాడిరి. 1909 లో వీరు భార్యను,సుందరమ్మను, జానకమ్మను వెంట పెట్టుకొని,బెంగుళూరు వేసవిలో పోవుచు,చెన్నపురి యందు దిగి , రంగయ్యశెట్టి గారి కతిథులుగా నుండిరి.వీరి ఆదేశముల నాయన శిరసా వహించెడి వారు.శాశ్వత నిధిగా వలెనన్న ధనము నడుగగా, ఒక పత్రము నుండి,రు 1000/ల నిచ్చి,హితకారిణీ సమాజము పేర నొసగిరి. వీరితో కలిసి ఆయన బెంగుళూరు నందొక నెల గడుప వలెనని ఆశ పడిరి. కాని ,వారొక సభకు పోవుచు,జూన్ 19 న అకాల మరణము నందిరి. మరి కొందరు వీరికి తగిన సాయ మొనర్చెదమని వ్రాసిరి. సుందరమ్మ వివాహము తరువాత, జానకమ్మ వితంతు వివాహము చేసికొన్న న్యాపతి శేషగిరిరావు గారి ప్రథమ భార్య పుత్రికకు వివాహము చేయ వలసి యున్నది. 1907 లో వీరు రెండవ సారి బెంగుళూరుకు పోవుచు,మాగంటి వెంకట సుబ్బమ్మను కొని పోయిరి. ఆమెను చెన్నపట్టణము లోని యెన్ ఎస్. శర్మ గారు వివాహము చేసి కొనిరి. వీరికి బెంగుళూరు వాతావరణము నచ్చి,ఆరోగ్యము బాగు కావచ్చునని అచట సం . ములో కొంత కాలము ఇచ్చట ప్రతి సారి ఉండ వలెనని తలచి,ఒక నివాసమును కొనుటకు ప్రయత్నించిరి.అనేక పనుల నిమిత్తము మాటి మాటికీ అప్పులు చేయవలసి వచ్చు చుండెను. హితకారిణీ సమాజమున కావరకే మూడు వేల రూపాయల ఋణ ముండెను. వ్యయము లన్నియు వీరే భరించ వలసి యుండెను. వీరు సమాజమునకు రు 6500/ ల రొక్కమిచ్చి, దాని వడ్డీని మాత్రమే ఖర్చు చేయమని ఏర్పరచిరి. అసలులో రు 2000/లను చెరువు సోమయాజులు గారికిని,రు 1000/లు రామమూర్తి గారికిని అప్పుగా నిచ్చిరి.మిగిలిన పైకము వీరి కడ నుండి,దాని నుండియే కొన్ని వ్యయములను వీరు చేయుచు,దానిని తరువాత తీర్చవలెనని యనుకొనిరి. సమాజమునకు చందాల నిచ్చువారు కాన రాలేదు. అందు చేత,వీరొక ప్రకటనను ముద్రించి,పంచి,తగిన ధనసహాయమును దాతలు దయతో వీరికి త్వరలో నొసగి,ఈ సత్కార్యములు చేయు సమాజమునకు వృద్ధి నందించుమని విన్నపము చేసిరి. (అక్టోబరు 1909 లో)

తదుపరి పర్యటించి,చందాలను సేకరించు నుద్దేశముతో వీరును,వీరి భార్యయును కార్యదర్శి హనుమంతరావు గారును బొంబాయికి బయలు దేరిరి.సికిందరాబాదు నందు దిగి,జి,నాయుడు గారింటికి పోయిరి. అచట రచయిత్రి సరోజినీ నాయుడు గారు అస్వస్థురాలై మంచముపై నుండెను. ఆమె తన బిడ్డలను వీరికి చూపించి,తాత గారు వచ్చినారని చెప్పెను.ఆమె వివాహమును చెన్నపురిలో వీరే చేయించిరి. చెన్నపురిలో వీరు స్థాపించిన స్త్రీ ప్రార్థనా సమాజమును నడిపిన శ్రీమతి కొటికలపూడి సీతమ్మగారు సికిందరాబాదులో నుండుటచే,వారింట బస చేసిరి. ఆమె గర్భవతిగా నుండగా, భర్త యామెను వీరింటికి బంపగా,పురుడు పోసిరి. ఆమెకు వీరు ఛందస్సును,వ్యాకరణమును నేర్పగా,నామె యొక శతకమును కూడా వ్రాసినది.ఆమె వీరికి పుత్రికగా నుండి,మన్ననల నందినది. ఒక

దినము0డి , వీరందరూ బొంబాయికి చేరి, నటరాజయ్యగారింటికి పోయిరి.న్యాయమూర్తి చంద్రార్కరు గారును,వీరి శిష్యులు గంటి లక్ష్మీ నరసింహము గారును, వీరి మిత్రులు న్యాయమూర్తి గణేశ నారాయణ గారును వీరికి విందు నొసగి,సన్మానించిరి. వీరా వారములో రు 900/ల చందాను సేకరించ గలిగిరి. అక్కడ వీరిని పూనా లోని ఇద్దరు బ్రాహ్మణ వితంతువులు కలియగా, వారిని హనుమంతరావు గారి ద్వారా రాజమహేంద్రవరమునకు పంపిరి. వీరిద్దరును పూనాకు చేరిరి.పూనా వితంతు శరణాలయ స్థాపకులగు కర్వే పండితుని ఇంట బస చేసిరి.అచటి కార్యక్రమములను తెలిసి కొని,బళ్ళారి కేగి,మిత్రుడైన కోలాచలము వెంకట రావు గారింటి కేగిరి. వీరి ఖర్చులకై రు 100/లను,శరణాలయము కొరకు మరి రు 2000/లను వీరొసగిరి.తిరిగి రాజమహేంద్రవరమునకు వచ్చి,కాకినాడ కేగి,రు 1332/లను వీరు చందాగా బడసిరి. మరి కొ0దరి ద్వారా రు 3000/లు,200/,100,1116,250,50,116 లు వసూలైనది. ఇట్టి ధనముతో సమాజ ఋణము కొంత తీరినది.

1910 లో వేసవిలో వీరు మరొకసారి బెంగుళూరున కేగుచు, చెన్నపురిలో గోటేటి కనకరాజు గారింట దిగిరి. వీరి వెంట న్యాపతి జానకమ్మను ,కామరాజుగడ్డ మంగమ్మను కొని పోయిరి. తరువాత,బెంగుళూరు నందలి తమ స్వగృహమున కేగిరి. దానిలో నిప్పుడు నీటి గొట్ట ములను విద్దుద్దీపములను వేయించి,సుఖ నివాస యోగ్యముగా జేసిరి. వీరి భార్య అచట ఆరు నెల లుండ నిచ్చగించుటచే,వారికి వలయు పాత్ర సామాగ్రిని బల్లలు,మంచములు,రోళ్ళు,రోకళ్ళను కొనిరి. ఆచట వీరి కిరుగు పొరుగు వారితో సత్ సంబంధ మేర్పడెను.అచట నుండగా న్యాపతి జానకమ్మ వివాహమును జరిపించిరి. ఇది వీరిచే బెంగుళూరు నందు చేయ బడిన మొదటి వితంతు వివాహము. వెంట వచ్చిన మంగమ్మ వీరికి పుత్రికా సమానమై,వీరి ఇంటిలో సాయము చేయుటయే కాక,సమాజము నందును పలు కార్యము లందు సాయ పడెడిది.ఆమెకు వివాహము చేసినను,తమ వద్దనే యుంచుకొన వలయునని వీరిద్దరు దంపతులును నిశ్చయించు కొనిరి.బెంగుళూరును వీడి,వీరు ముగ్గురు తిరిగి క్షేమముగా రాజమహేంద్రవరమునకు వచ్చి చేరిరి.

నాలుగవ ప్రకరణము–అసహాయ దశ **(1910–1913)**

1910 సం . న వీరు బెంగుళూరు నుండి వచ్చిన తరువాత రెండు నెలలకు వీరి కొక కష్టమెదురయ్యెను. (ఆగస్టు 11 వతేదీన)వీరి భార్య పైకి ఆరోగ్యవతి వలె కనిపించు చుండెడిది.వీరికి వలయు పను లన్నియు చక్కగా చేసి పెట్టెడిది.ఆవు ఈనగా, దాని పాలతో జున్నును తయారు చేసి,పంచి పెట్టినది. తాము పెంచుచున్న ప్రేమావతి యను యనాధ వితంతువు బిడ్డను మరునాడు ఆసుపత్రికి కొని పోయెదమని చెప్పినది.అనంతరము వీరు నిద్ర పోయిరి. వీరు ప్రతి రాత్రి 8 గంటలకు భోజనము చేసి,9 గంటలకు నిద్ర పోవుట వారికి అలవాటు. వీరి సతీమణి ప్రార్థన ముగించుకొని,సుమారు 10 గంటలకు నిద్రించెడిది.ఉదయ మామె 4 గంటలకు లేచి,5 గం .ల వరకు వీరితో మాట్లాడి,యీశ్వరప్రార్థనము చేసి,క్రిందికి దిగి,పనులు చేసికొనుటకు పోవు చుండెడిది. ఆ రాత్రి మాత్ర మామె అటుల నిద్దుర లేవనే లేదు. రెండు,మూడు సార్లు పలుకరించినను,మాటలాడ లేదు. అందుచే వీరామెను తట్టి లేపినను,ఆమె లేవక పోగా–శరీరము చల్లపడి పోయినది.శ్వాస లేనట్లుండెను.వీరు గాబరా పడి ,సుబ్బారావు గారి చేత వైద్యుని పిలిపించిరి. అత డామె

పరమపదించిన దని తెలుపగా, వీరికి కాళ్లు చేతు లాడ లేదు. వెంటనే ఈ వార్త శరణాలయ మంతయు ప్రాకినది. అనేక మంది వీరిని పరామర్శించగా వచ్చి,యేడువ సాగిరి.వారందరినీ వీరికే యూఱడింప జేయ వలసి వచ్చినది. వీరు అంతలో క్రింద పడిపోవుదు రన్న భావన కలిగినది. ఈ వృద్ధ దశలో ఇటు లేల జేసె నా యీశ్వరుడని ప్రార్థించి,విచార పడ సాగిరి. అంతలో దుఃఖ పడబోకుము—ఇది మీ ఉభయుల మేలు కొరకే జరిగినదను మాటలు వినిపించినవి.చూడగా నచ్చట ఎవరును లేరు. అది భగవద్వాక్య మని వీరికి తోచినది. వెంటనే మనసునకు ధైర్యము కలిగి,విచారము తగ్గి నట్లయినది.

వారి భార్య చని పోయినను, ఆమె ముఖ కళ తప్పలేదు. కట్టు బట్టలు నలుగ లేదు. పూలు వాడి పోలేదు. ప్రాణము పోవుట కామె ఏ మాత్రము ఆయాస పడినట్లుగా లేదు. అందు చేత నామెకు సుఖ మరణమే కలిగినదని వీరు తలంచిరి. రాత్రి ఏ ఒకటి,రెండు గంటల మధ్య నామె ప్రాణములు పోయి ఉండ వచ్చునని వీరనుకొనిరి. ఆమెకు అంత్య క్రియలకు వలయు నేర్పాట్లు గావింప బడినవి. కుర్చీలో నామెను కూర్చుండ బెట్టిరి. వారి పిల్లి ప్రేమతో నామె ఒడి లోనికి దూకి, కూర్చుండెను. పసి బాలలు,అనాథలు,పేదలతో పాటు జంతు,వృక్షముల యెడ నామెకు కడు ప్రీతి యుండి,వారందరినీ ఆదరించి,రక్షించి,పోషించుట ఆమె కలవాటు.బ్రవునను కుక్కను కూడా వీరమితముగా ప్రేమించి,పెంచెడివారు. ఒకసారి ఆ కుక్క ఆమెను నిలుపు జేసి,పాము బారి నుండి కాపాడెనట . ఇక ఆమె మరణ వార్త విని,సకల మతముల వారు అరుదెంచిరి. దాదాపు రెండు వేల మంది వరకు వచ్చిరి. పాఠశాలలు,పత్రికలు ,న్యాయ స్తానములు మొదలైన వన్నియు గౌరవము చేత నానాడు మూయ బడినవి. పత్రికలు సాను భూతి ప్రకటనలను వ్రాసినవి. పలు చోట్ల నుండి సంతాప సందేశ తంతులు వచ్చినవి. ఆనాడు సాయంత్రము 3 గంటలకు శవమును ప్రార్థనల తరువాత,దహనము చేయగా,7 గంటల ప్రాంతమున పూర్తి యయ్యెను. వీరు పెంచిన గోగుల పాటి వీరేశలింగము కూడా వచ్చెను. అతడు దుఃఖముతో విలపింప సాగెను.వీరి భార్య బెనారస్ చీర నతని భార్య కిమ్మనినదని అతని కివ్వగా,అతడింకను యేడ్చెను. ఆమెకు గల పలు రకముల చీరెలను చాలా వరకు ముఖ్యమైన వారి కొసగి,మిగిలిన వాటిని వీరు వితంతువుల కొసగిరి. గోగుల పాటి వీరేశలింగ మామె అస్థికల లోని కొన్నిటిని గోని పోయెను. అంత్య క్రియలు వీరి తోట లోనే జరుప బడెను. ఆమె అస్థికల నొక పాలరాతి సమాధి యందుంచి, ఆ తోట లోనే రాజ్య లక్ష్మీ నివాసమను నొక గృహము నట నిర్మించిరి. దానిపై ఆమె జనన,మరణ తేదీలను లిఖి0ప జేసిరి.అది చాలా సుందరమైన సమాధి. ఆ సమాధి చుట్టును పలు రకముల పుష్ప వృక్షములను వీరు నాటించిరి. ఆమె కోరిక మేరకు పరుల ప్రయోజనము కొరకై రు 1000/లతో నొక బావిని వీరు త్రవ్వించిరి. మొత్తమచట నాలుగు బావు లేర్పడి,నీటి వసతి హెచ్చెను. ఆ నీటితో పలు రకముల ఫల వృక్షములను నాటించిరి. అది పట్టణము లోనే ఒక గొప్ప తోటగా నేర్పడెను. దానిని చూడగా ప్రజ లరుదెంచెడి వారు.పండ్ల తోటల నుండి ఫలసాయముగా ధనమును లభించెడిది.నూతులకు రు 1350/,రు 900/ లును రెండు సార్లు ఖర్చయినది.

ఈ దంపతులు గోగుల పాటి శ్రీరాములతో పాటు మరొకరిని పులవర్తి సుబ్బారావను వానిని కూడా పెంచి,పెద్ద చేసిరి. మొదటి వాడు మైసూరు సంబంధమును కుదుర్చుకొని, వివాహమాడి
యేగగా,ఈ రెండవ వానికి మంగమ్మ నిచ్చి,వివాహము చేసి,వీరి యొద్దనే యుంచు కొనిరి. అతడు తరచు కోపించుచు ,తన భార్య చేత వంటలు చేయించు చున్నారేల నని వాదించెడి వాడు. వారిరువురును వీరి తోటలోనే ఉండెడి వారు.రాజ్య లక్ష్మి గారు నిత్యము ప్రార్థన చేయుచు ,తనకు

సుమంగళిగా మరణమును ప్రసాదించ మని కోరెడిది. తన ఆరోగ్యము సరిగా నుండకయు,భార్యయే ఆరోగ్యముగా నుండుట చేతను, ఆమె కంటే తానే ముందుగా మరణించెదనేమో యని వీరేశలింగము గారు తలచెడి వారు.కాని ,దైవము ఆమె కోరికనే తీర్చి, ముందుగా నామెకే మరణమును ప్రసాదించి నాడు.ఆమెకు తరచు ధైర్యమును చెప్పి,ముందుగా తాను మరణించిన,నామె బలవన్మరణమున కొడిగట్ట వలదని ఊరడించి,పలికెడి వారు.నూతి పనులు 7-4-1913 న ముగించి,వీరు తిరిగి బెంగుళూరును కేగిరి.

వీరి సతీమణికి పెంచిన మేనమామగారి ద్వారా ఏదుము నేల యరణముగా లభించెను.దాని పై వచ్చు ఆదాయము రు 12/లు మాత్రమే. వారి బావమరిది రెండు మూడేండ్ల నుండి ఫలసాయము నిచ్చుట లేదని ఒకసారి వీరి భార్య తెలుపగా, నామె యంగీకారముతో వీరా భూమిని ఆమె పుట్టింటి వారికి దస్తావేజులు వ్రాయించి ఇచ్చిరి. ఆమె రెండవ సాంవత్సరీక శ్రాద్ధము నాడు వీరు తమ భార్యను గూర్చి ఆమె చరిత్రమును వ్రాసి,చదివిరి. దాని సారాంశము క్లుప్తముగా నిట్లుండెను. “ఆమె జననము నవంబరు 1851 సం . తల్లి దండ్రులు అద్దంకి పట్టాభి రామయ్య,కొండ మాంబలు. మరణము 12-8-1910. తెల్లవారు ఝామున. మాతృ మరణానంతరము ఆమెను పెంచినది మేనమామ కాతేరు కరణ మైన వెన్నేటి వెంకట రత్నము గారు.వారి భార్య లచ్చమాంబ. మొదట ఆమె పేరు బాపమ్మ. పెళ్లినాటికే ఆమె విద్య నేర్చినదై,యుండెను. తరువాత నమక చమకాదులను నేర్చి,స్వయముగా పూజాదులను నిర్వహించ గలిగిన దయ్యెను.వివాహము తరువాత వీరి తల్లియైన పూర్ణమాంబ ఆమెకు రాజ్య లక్ష్మి యను నామ మొసగెను.దాని తోనే చివరి వరకు నామె ప్రసిద్ధి గాంచెను. పదమూడవ యేట నీమె కాపురమునకు వచ్చినది.వీరితో కాపురము చేయగా,నామె వీరి బుద్ధులను ఆలోచనలను పొంది,గౌరవించి,వీరికి వెన్నంటి యుండి,తోడు నీడగా సర్వ కాల సకల విషయము లందును మెలగెను. “కార్యేషు దాసీ——---ఖలు ధర్మ పత్నీ” యన్నరీతిగా నామె వీరికి సకల విధములుగా సాయ పడెను. వీరిది కోప స్వభావము.ఆమెది కడు శాంత స్వభావము. వీరి కోప సందర్భము ల0దామె తగు రీతిగా శాంతి0ప జేసి,స్వస్థచిత్తుని చేయు చుండెడిది. అందుకు వీరి యందామెకు గల దృఢానురాగము,పరిపూర్ణ విశ్వాసములే కారణములు. వీరితో వివాహము వలన ఆమె అనేక కష్ట నష్టములకు,బాధలకు,శారీరక శ్రమకు గురి య్యెను.వీరి ఉపన్యాసముల వలన, సంస్కరణోద్యమముల వలన సంఘములో పలు సమస్యలు వచ్చి,ఆమెకు కష్టము లేర్పడెను. ఆమె బ0ధువులును ,వీరి బంధువులును ఆమెను భయపెట్టి, వారి ఉద్యమమును వీడునట్లు చేయమని కోరగా,నీమె అంగీకరించక,వారి ఆలోచనలును ,కార్య విధానమును సరియైన వని తాను నమ్మి, తప్పక సహకరింప వలెనని నిర్ణయించినానని గట్టిగా చెప్పి వారిని పంపినది. వితంతు బాలికల నాదరించి,దగ్గరకు చేర్చి,ఆదరించెడిది. వారికి చదువు,ఇతర విద్యలు ,పనులను నేర్పెడిది. వారి దురభ్యాసములను మాన్పించుటకు యత్నించెడిది. కన్న తల్లి వలె వారికి బుద్ధులు నేర్పెడిది.అందరిని పిలిచి,భోజనము పెట్టెడిది. వితంతు బాలికలకు ధైర్యమును చెప్పి,వారికి మాతృ ప్రేమ నందించెడిది.

పతిత విధావాశ్రయము నొక దానిని వీరి ఇంటి కెదురింటిలో స్థాపించి,ఆమెయే నిర్వహించెడిది. . అనాధ వితంతువులైన గర్భ వతుల నాదరించి,పురుడు పోసి, వారికి రక్షణ నొసగె డిది. ఆ శిశువుల నామెయే పెంచి,పెద్ద చేసెడిది. వారికి సమస్తోపచారముల నామెయే చేసెడిది.శూద్రులను కూడా నీమె చేరదీసెడిది. స్త్రీలకే కాక,పురుషులను కూడా దయతో నాదరించి, పోషించెడిది. పతితయైన స్త్రీ యొకతె విటునిచే విపరీతముగా కొట్ట బడగా,ఈమె ఆస్త్రీకి

వైద్యమును,ఆహారమునిడి ,దయ జూపినది. ఒక మాల వానిని కొని తెచ్చి, అతనికి సాయ మొనరించినది. ఈశ్వర సంతానమైన స్త్రీ,పురుషు లందరు నామెకు సోదరీ,సోదర తుల్యులని భావించి,నిత్యము పరోపకార పరాయణ కార్యము లందు నిమగ్నమై,సంతోషముతో పాటు పడెడిది. ఆమె ఈశ్వర భక్తురాలు. ఆమె కీర్తనలను వ్రాసి,ఏకేశ్వరోపాసన చేయించి,స్త్రీ ప్రార్థనా సమాజమును స్థాపించి,నడిపినది. స్త్రీల కట్టి ప్రత్యేక ప్రార్థనాలయము మరెక్కడను లేదు. ఆమెతో పాటు కొందరు వితంతువులను కొనిపోయి, ప్రతి శని వారమును ,ప్రతి సాయంకాల మానందాశ్రమములోను ప్రార్థనలు చేయి0చెడిది.ప్రతి సంవత్సరోత్సవమును జరిపి,కుంటి ,గ్రుడ్డి, నిరుపేదలకు అన్న సంతర్పణ చేయించెడిది. ప్రయాణము లందు వికాలా0గులకు ధన దానమును చేసెడిది. ఈశ్వర భక్తి విశ్వాసము లామెనే కష్టములను లెక్క చేయని ధైర్యము నొసగెను. వితంతు వివాహ సమయము నందు పనివారు,వంట వారు పారి పోయినను ,ఆయా పనులన్నియు నీమెయే యొంటి చేతితో నిర్వహించి,సాయ పడెడిది.

సోమరి తనమన్న కోపించెడిది. తాను ఉదయము 4 గంటల నుండి రాత్రి పది వరకు నిత్యము ఏదో ఒక పనిని చేయుచునే యుండెడిది. ధనమును జాగ్రత్తగా ఖర్చు చేయు శ్రద్ధ గలదైనను,దాన,ధర్మము లందు విశాల హృదయము కలది.విరామ సమయము నేదో విషయములను,పాటలను ఆమె రచించెడిది.భర్తను కంటికి రెప్పలా కాచి,పోషించి,వారి ప్రధాన కార్యక్రమములందు నిరతము తోడ్పడెడిది. తన భర్తను సంఘము వారు బహిష్కరించినను,వారు ధనమును ఆస్తిని ధర్మ కార్యములకు వెచ్చించి,మిగిలిన దంతయు హితకారిణీ సమాజమునకు వ్రాసి ఇచ్చినను ఆమె బాధ పడలేదు. అడ్డు పడనూ లేదు. వీరామెకు తన తదనంతరమున ఖర్చుల కొక రు 1000/లను,నెలకు రు 30/ల జీవన భృతియు,ఆమె నివాసమునకు ఊరిలో గాని,తోటలో గాని ఆమెకు నచ్చిన ఇల్లొకటి ఇచ్చునట్లుగా నొక దాన పత్రమును వ్రాసి,తగిన ఏర్పాటులను చేసిరి. ఆమెకు పూవులన్న ప్రీతి . భావములు నవీనము లయ్యెను, పూర్వ కాలపు యువతి వలె చీరలను ,నగలను, బొట్టును ధరించెడిది. ఆమె శీలగుణ ,పరోపకార పారీణ సంపదలను మెచ్చి ,యా పరమాత్మ సునాయాస మరణము నొసంగుటచే నామె ధన్యురాలయ్యెను.దేశ వ్యాప్తముగా పలువు రామెకు మరణానంతర పరామర్శ,సానుభూతి లేఖలను వ్రాసిరి. ఆమె ఆత్మకు శాంతి,శాశ్వతానందములు కలుగు గాక."ఇదియే ఆ లేఖ సారాంశము.

భార్య మరణానంతరము వీరికి పలు కష్టము లెదురయ్యెను. వంట చేయువారు,పనిచేసి స0రక్షణ చూచు వారు లేరైరి. పులవర్తి సుబ్బారావు గారింట కొద్ది రోజులు భోజనము చేసిరి.రెండవ వితంతు వివాహపు రాచర్ల రామచంద్రరావు భార్య రత్నమ్మ వీరికి వంట చేయుటకు వచ్చినది. భర్త పోయిన తరువాత ఆమె వీరింట నుండి పుత్రికా సమానముగా నుండుటచే,వీరి ఆహారపు అలవాట్ల నామె యెరుంగును.అందుచేత,సుబ్బారావు ఇంటి ఎదుట హనుమంతరావు ఖాళీ చేసిన ఇంటిలో తనకు,రత్నమ్మకు వసతిని యేర్పాటు చేసిరి. వితంతువులను జాగ్రత్తగా చూచుచు నీమె వారిని ప్రార్థనామందిరమునకు గొని పోయెడిది. ఇది యంతయు సుబ్బారావుకు నచ్చలేదు.రత్నమ్మ తల్లికి జబ్బుగా నుండుటచే కుమార్తెను రమ్మని వ్రాయగా,నీమె ఇంటి కేగెను. కాని ,మరల నామెను వీరి దగ్గరకు రానీయక,ఆమె తల్లి ఆపు చేసెను.మరల వీరికి సుబ్బారావు ఇంటి వంట తిన వలసి వచ్చెను.తరువాత పుత్రికా సమానముగా వీరు పెంచిన కామరాజు గడ్డ మంగమ్మ వీరి పోషణ బాధ్యతను స్వీకరించెను.

వీరిని బాబయ్య గారని పిలుచుచు,వితంతువు ల0దరును ఎంతయో ఆదరముగా చూచెడి వారు. వలదన్నను భార్య మరణానంతరము నాలుగు నెలల వరకు వీరి కభ్యంగన స్నానమును చేయించిరి. మంగమ్మ వీరి భార్య మరణమునకు చింతించి,బెంగ పెట్టు కొనెను. ఒకసారి వీరి కారోగ్యము చెడి, విరోచనములై నీరసించి పోయిరి. పలువురు వచ్చి,వీరిని పరామర్శించి పోయిరి. (1911లో). నయమైన తరువాత వీరు ప్రతి దినము బండిలో పోయి,పాఠశాల భవన నిర్మాణమును చూచి వచ్చెడి వారు.వీరితో స్థిరముగా నుండి, వీరికి పను లొనర్చి సాయపడు వారు కావలెనని యోచించగా,సుబ్బమ్మ, దుర్గమ్మ,మంగమ్మలు ము0దుకు వచ్చిరి. మంగమ్మ వివాహమైన తరువాత తన భర్త కూడా వీరితో నిచటనే యుండుట కంగీకరించి నట్లయినచో –వివాహము చేసికొనెద ననెను. అట్ల0గీకరించిన పోతరాజు సూర్య ప్రకాశ రావున కిచ్చి వివాహము (8-10-2011 న) చేసిరి.27-3-2011న వీరు మంగమ్మతో బెంగుళూరు స్వగృహమున కేగిరి.అచట వీరికి తమ భార్య జ్ఞాపకములు వేధించగా,నా ఇంటిని విక్రయించిరి. తిరిగి వచ్చి మంగమ్మకు వివాహము చేసిరి. ఆమెకు,ఆమె భర్తకును వీరి యొద్దనే ఉద్యోగముల నిచ్చి, తమ దగ్గర నుంచు కొనిరి.

వారు సహాయముగా వీరి వెంట నున్నను, వీరికి సదుపాయములు కలుగక,బాధలు హెచ్చెను. నీరసము వచ్చెను.వీరిని చూచుటకు వెంకట రత్నం నాయుడు గారు,రెబ్బాప్రెగడ పాపయ్య గారు (3-1-1912న),జయంతి గంగన్న గారు,కుందూరు వెంకట రత్నము గారును వచ్చిరి. ఆ సమయమున వీరు స్పృహ తప్పి పడి పోయిరి. సుమారు పావు గంట తరువాత గాని స్పృ హ రాలేదు. ప్రాణము పోయిన దేమో నని వారందరు భయ పడిరి.24-1-1912 న రాత్రి అందరును మేడపై తోడుగా పండు కొనిరి. మంగమ్మ,ప్రకాశరావు కూడా నచ్చటనే పరుండిరి. ఆమె వీరికి పలు సేవలు చేసి, అన్నపానాదులను జాగ్రత్తగా నొసగెడిది. మెల్లగా వీరి కారోగ్యము కొద్దిగా మెరుగయ్యెను.డాక్టరు గోపాలాచార్యుల వారు వచ్చి,వైద్యము చేసిరి. తమకు సాయపడిన వారికి వీరు కృతజ్ఞతలను తెలిపిరి. పరమాత్మ వీరిని బ్రతికించి,రక్షించి,తనను దయ జూచి నందుకు పూజించి,తన ప్రార్థనల నందించు చున్నాడనని వీరు తన డైరీలో వ్రాసి కొనిరి. తామింకను కొంత వరకు పని చేసి,ఉపయోగ పడెదనని తలపోసినారు.

మరునాడు వ్రాయవలెనని యత్నించగా,వీరి వ్రేళ్ళు పట్టు నీయక పోవుటచేత నేమియు వ్రాయ లేక పోయిరి. రెండు,మూడు ఉత్తరములను మాత్రమే వీరు వ్రాయ గలిగిరి. సమాజము వారిని,పురము నందలి వారిని ,వితంతువులను,ఇతర స్త్రీ పురుషుల నందరిని ఆనందాశ్రమమున వీరు సమావేశ పరచి,ఈశ్వరునకు ప్రార్థనలు చేసిరి. తన జీవితమున పలు కార్యక్రమములను చేయించి నందుకు ధన్య వాదములను తెలిపిరి. కాని ,సుబ్బారావు భార్య మాత్రము వీరిని చూచుటకు రానే లేదు. 3-4-1912 న వీరు గర్భవతి యైన మంగమ్మను వెంట గొని, బెంగుళూరునకు చేరిరి. తరువాత,27 న ఈమె భర్త ప్రకాశరావు వచ్చి,వీరిని కలిసెను. వీరి భార్య సమాధిని ఒక సం .రం లోనే కట్టించితిరి గాని,మిత్రుడైన దేశిరాజు పెద బాపయ్య సమాధి తరువాత నాలుగేళ్లకు గాని చేయించ వీలు కలుగ లేదు. గవర్రాజు బసవరాజు గారి మరణానంతరము అతని భార్యయు,నల్లుడును రు 900/లు , కనపర్తి శ్రీరాములు గారి పత్రములను (1100/లను)వీరి కొసగిరి. శ్రీరాములు గారింకను ధనము నీయ లేదు.పలు రకము లైన వ్యయముల నన్నిటిని వీరే భరించ వలసి వచ్చెను.అప్పటికే రు 6000/లు దాటి పోయెను. పైగా సమాజమునకు నెలకు నూరేసి రూపాయలను కూడా వీరే ఇచ్చు చుండిరి. వీరి కాదాయము తగ్గి,వ్యయము పెరిగెను. అందు కొరకు రు 3000/ల నప్పు చేసిరి. వీరికి 24 రూపాయల పెన్షన్ వచ్చెడిది. కొంత సొమ్ము వీరి పుస్తకముల విక్రయము ద్వారాను ,మరి కొంత

సర్వ కళాశాల పరీక్షకత్వము ద్వారాను వీరికి లభించెడిది.కొంత వరకు దయ కలిగిన పిఠాపురం రాజా వారు ధన సహాయము నొనరించిరి.ఇప్పుడు వీరి పుస్తక విక్రయములు తగ్గి పోయినవి.

1887 నుండి వరుసగా 25 ఏళ్ళు వీరు సర్వ కళా పరీక్షకులుగా ఆర్జించిన రు 20,000 /ల నంతయును పరార్థముగానే ఖర్చు చేసిరి . భార్య మరణానంతరము వీరు పరీక్షకత్వమును వలదని మాను కొనిరి. (1911నుండి),వీరి ఆదాయ మంతయు వితంతు శరణాలయాదుల పోషణార్థమే వ్యయమైనది. వృద్ధులను,దుర్బలు లగుటచే మృత్యు వెప్పుడు వచ్చునో యని వీరు వేచి యున్నాననిరి. ఒకటి,రెండు పుస్తకములు తప్ప,మిగిలిన కార్యము లన్నియు వీరు తలపెట్టిన రీతిగా పూర్తిగా నెరవేరినవి. వీరి కిపు డాదాయము తగ్గి,పోవుటచే సమాజ శరణాలయము నిర్వహణ కష్ట సాధ్య మగు చున్నది. కాని ,వీరి యూపిరి యున్నంత వరకు వానిని కొనసాగించ వలెనను ప్రయత్నమును మాను కొనరైరి. కావున,నీ భారమును కరుణ గల దాతలు స్వీకరించి,ముందుకు రావలెనని వీరు అర్థించి యొక విజ్ఞాపనమును వ్రాసిరి. అందు వీరు మొదటి నుండియు చేసిన సంఘ కార్యక్రమములను,వితంతు వివాహ కార్య క్రమములను,సాహిత్యసేవయును,దేశసేవయును ,సర్వ మత మానవ సమానత్వమును,ఐకమత్యమును,స్త్రీ విద్యా సముద్ధరణములను, ఇతర సాంఘిక ముద్ర విశ్వాస దురాచార,లంచగొండితన నిర్మూలనములనుగూర్చి వివరించిరి. వారు పడిన కష్టములను వారికి తోడుగా నిలిచిన విద్యార్థులను ,ధన సహాయము,మాటసాయము,మానవ శక్తి సహాయముల నొనరించిన వారికి కృతజ్ఞతలను తెలిపిరి. తాను కీర్తికి ,ధనాశకు లొంగక,పరు లెంత దూషించి,బహిష్కరించినను కార్యైక దీక్షను కొనసాగించి,సంకల్ప బలమున ,దైవ కృప వలన కార్య సాధన చేయ గలిగితి నని వివరించి చెప్పిరి.పేదలకు ,నిరాశ్రయులకు,దీనులకు,వికలాంగులకు తగిన సాయ మొనర్చుట ప్రతి పౌరునకు ,నాయకునకు గల బాధ్యత యనిరి. పరమాత్మను ప్రార్థించి,జనులకు దయను ,దానగుణమును ప్రసాదించుమని ,ఈ సత్కార్యమునకు సాయపడ నుత్తేజము ననుగ్రహించుమని వీరు ప్రార్థించిరి.

వీరి తోట న0టిన దారికిని,వీరి తోటకును మధ్య పుప్పాల చెరువని సుమారు 3 యెకరముల భూమి కలదు. దానిని తోటకు కలుపుటకై పలుసార్లు వీరు ప్రయత్నించగా,1912 నందు దొరతనము వారు దానిని హితకారిణీ సమాజమున కీయ నగీకరించిరి.వీరి రెండు తోటలకు నడ్డముగా మరి యొక్క ఎకరము 30 సెంట్లు భూమి ఇతరులది కలదు. దానిని కూడా కొని,వీరి తోటను ఒకే స్థలముగా పెద్దది చేయ వలెనని వీరు సంకల్పించిరి. వీరి కంత్య దశ దగ్గరగు చున్న భయముచే దానిని వీరు రు 500/ల నిచ్చి, తమ పేర కొని వేసిరి.ఇప్పుడు తోట మొత్తము విస్తరించి ,నీటి సదుపాయము కలిగి,పలు రకముల ఫలముల నొసగు వృక్షములతో —సదుపయోగ మగుటకు వీరెంతయో సంతసమును ,తృప్తిని బడసిరి.

ఈశ్వర ప్రార్థన

తనను జీవిత కాల మంతయు పరోపకార సేవకు,అభ్యుదయమునకు ,సంస్కరణలకు కృషి చేయు భాగ్యమును కల్పించిన ఈశ్వరుడు తనకు శేష జీవితకాలమున ఇతోధిక ఆరోగ్యము నొసగి,ఇంకెన్నియో సత్కార్యముల నొనరించు సంకల్పమును,శక్తిని దయ చేయు గాత! నా కృత్యము లన్నియు నాచే యొనరింప బడినవి కాక, దైవ బలముచే నాయనచే పూర్తి చేయ బడినవని నేను సవినయముగా విన్నవించు కొను చున్నాను. నాకిప్పటికిని స్వార్థ పరత్వము

లేకుండ జేయుము.పలు సద్గుణములను కృపతో ప్రసాదింపుము. నీకు కృతజ్ఞుడనై యున్నాను. అని వీరు చరిత్ర చివరగా ప్రార్థించిరి. వయో భారముచే వీరు శేష జీవితమును గడుపు చున్నారు. .

శుభమస్తు!

అనుబంధములు

(ఎ)   రాజమండ్రి హితకారిణీ సమాజము

1. పేరు 2.ధ్యేయము —9 పనులు 3.కమిటీ మెంబర్ల పేర్లు —వృత్తులు. 11 మంది.
నియమ నిబంధనలు . —6 మెంబర్లను నియమించు విధానము.
7. కమిటీ అధికారములు 8. విశేష అధికారములు -9–16. కమిటీ కార్య క్రమములు. 17.లెక్కలు–వివరములు. 18.ధన సేకరణ 19/20. ఆడిటు చేయుట 21 . అభియోగములు. (సూట్స్). 22/23. సమాజ సమావేశములు.

అనుబంధము(బి)

సమాజము —ప్రమాణ పత్రము (డీడ్ ఆఫ్ ట్రస్ట్) 02-5-1908.----1–18 పేరాలు.
సమాజపు ఆస్తి వివరములు 1—11 పేరాలు. మొత్తము రు 41,500/లు.

సాక్షులు 1)ఆర్ .వెంకట రామయ్య. 2)పి. వీరభద్రయ్య.

ముగింపు

శ్రీ కందుకూరి వీరేశ లింగము పంతులు గారు చిన్నతనము నుండియు చాలా తెలివి గలవారు.4 వ తరగతి వరకే పాఠశాలలో చదివిరి.విద్యార్థి గానే వారు తమ ఉపాధ్యాయులచే నాదరింప బడి,ఆయా తరగతులందు తెలుగు,లెక్కలు,ఇంగ్లీషు భాషలను బోధించిరి. దొరలకు తెలుగు బోధి0చి ,కొంత ధనమును ఆర్జించిరి. ఛందస్సు నేర్చి,పలు గ్రంధములను విశిష్ట రీతిని వ్రాసిరి. మూఢ నమ్మకములను,చాందస ఆచారములు వీరు ఖండించిరి. సమాజమున గల లంచగొండితనమును,ఆశ్రిత పక్షపాతమును ,ఇతర అన్యాయములను వీరు నిరసించెడి వారు.

విత౦తు వివాహములు చేయుట నారంభించిరి.సనాతనులు,మత గురువులు వీరిని వెలి వేసినను ,లెక్కసేయక , విద్యార్థుల సాయమున ముందునకు సాగిరి. తన స్వంత ధనమునే ఖర్చు చేసి,వితంతువులను తన దరికి రప్పించుట,వరులను వెదకి,వివాహములును కుదిర్చి, చేయుట,వీరే నిర్వహించెడి వారు. కొందరు సహాయముగా వచ్చినను ,బంధు గణముల విరోధముచే వీరిని విడిచి,ప్రాయశ్చిత్తములు చేసికొని పోయెడి వారు. వీరు తమ భావ ప్రకటనలకు,సంఘ దురాచార ఖండనకు పత్రికలను

స్థాపించి,ముద్రించెడి వారు. దానిపై వచ్చు పలు అభియోగములను న్యాయ స్థానములలో నిరతము నెదుర్కొని,విజయము నందెడి వారు.వీరి గ్రంథ రచనల వలన ,విశేష ఖ్యాతి నార్జించ గలిగిరి. పండితుల ప్రశంసల నందిరి. వదాన్యులు ,రాజాగార్లు వీరికి కొంత ధన సహాయము నందించెడి వారు.

మదిలో మెదిలిన సంస్కార భావములను వెంటనే యాచరణలో పెట్టుటకు ప్రారంభించెడి వారు. అవి పూర్తి యగు వరకును విశ్రమించెడి వారు కాదు. గొప్ప అధికారులును,దొరలును,న్యాయ వాదులను వీరికి సహాయము గావించి,యాదరించెడి వారు. వీరు గ్రంథ రచనమందు పలు క్రొత్త త్రోవలను త్రొక్కిరి.అన్ని ప్రక్రియలో వీరివే తొలి గ్రంధములు.తమ పొత్తములను వారే ముద్రించి,అమ్మెడి వారు. 10.12 సంపుటముల రచనలు వీరు చేసిరి.ప్రకృతి శాస్త్రము,శరీర శాస్త్రము,జ్యోతిష శాస్త్రము కూడా వీరు రచించిరి . స్త్రీలకు నీతి బోధకు పుస్తకములు వ్రాసిరి. సంఘమున దోషులను విమర్శించుటకు హాస్యముతో పలు ప్రహసనములను వ్రాసిరి. నాటకములను వ్రాసి,ప్రదర్శింప జేసిరి. ఇంగ్లీషున ,సంస్కృతమున,తెలుగు నందు వీరి పాండిత్యము ప్రశంస నీయము.

కలక్కత్తా,బొంబాయి,బెంగులూ రుల మధ్య వీరి ఖ్యాతి విస్తరించినది. పలు చోట్ల వీరికి సత్కార,సన్మానములు జరిగినవి. వీరికి రావు బహదూర్ బిరుదమును దొరతనము వారొసాగిరి. అనేక సంఘములందు వీరు సభ్యులు.సర్వ కళాశాల పరీక్షకులుగా చాలా యేళ్లు పని చేసిరి. పలు సంస్థలను స్థాపించి,పోషించి,నిర్వహించిరి. ఎంత వ్రాసినను తక్కువయే కాగలదు. వీరిది ఏక యోద్ధ సైన్యము.(సింగిల్ మాన్ ఆర్మీ). అంతయు నన్నిటను వీరై చరించి,నిర్వహించి సఫలులై కీర్తి గడించి,ధన్యు లైరి. వీరి శిష్యులందరును ఉన్నతోద్యోగము లందుండి, వీరికి సాయ పడిరి.

సంపూర్ణము

వీరేశలింగ ప్రశస్తి

కందుకూరి వీరేశలింగమను వ్యక్తి
రాజమండ్రిని జనియించి,రాణ కెక్కె
సంఘ సంస్కరణ మొనర్చె సాహసమున
పతిత వనిత వితంతు వివాహములనొ
నర్చి,మేలొనర్చె బ్రతుకు నంద మంద
నాటి చాందస వాదుల ధాటి నడచె 1

కవుల కాదర్శ మూర్తియై కవిత లెన్నొ
రీతుల రచించి,మేధా ధురీణు డగుట
 ప్రజ్ఞ జేపట్టి,వెలయించె ప్రతిభ జుపి
ఎదిరి తోడను పోరాడి,బెదర జేసె 2

విద్య నభివృద్ధి సేయ తా విస్తరించె
పాఠశాల లనేకంబు ప్రజల కొరకు
నాణ్యమౌ పౌరులుగ జేయ నడత నేర్పి
భారతీయ సంస్కృతి బెంచె భవ్య రీతి 3

నవల,నాటకము ,ప్రహసన0బు లెన్నొ
కావ్యముల్ ,ప్రబంధములను ఖ్యాతి గూర్ప
స్వీయ చరితంబు రచియించె వివర మొప్ప
కవుల చరితయు, పలు విధ గ్రంథములను
వెలయఁజేసె మహాకవి ,విమల యశుడు. 4

అడ్డు పడువారి నెదిరించె నతడు సింగ
మగుచు,నసమాన పటిమతో తెగువ జూపి
పట్టుదల తోడ నెరవేర్చె పనుల నెల్ల
నేతగా నొప్పె మహనీయు డాతరమున
నేటి జనులకు సత్పథ నీతి గఱపె 5

కవియు,పండితు డాదర్శ కార్య ధుర్యు
డమల చరితుండు,సంస్కర్త విమల కీర్తి
శక్తి యుక్తు0డు,యుగ కర్త ,యుక్తి పరుడ!
భవ్య వీరేశ లింగమా!వందనములు . 6

స్వస్తి

జీవిత కాలము **—16-4-1848—-27-5-1919.**

రచన కాలము–ప్రథమ భాగము**—1911**న ,ద్వితీయ భాగము**—-1915**న వెలువడినవి**.**

పీఠిక—చిలకమర్తి లక్ష్మీ నరసింహము గారిచే**(22-4–1937)**

అంకితము—కీ .శే ,రాజ్య లక్షమ్మ గారికి

ద్వితీయ భాగము**—1915**

ద్వితీయ ముద్రణ**—1936**లో**.** హితకారిణీ సమాజము వారిచే**.**

1949–1953 మధ్య వీరి రచనలన్నియు పునర్ముద్రితములు**.**

ఆఖరున **1952-1953** లో స్వీయ చరిత్రము ముద్రితము**.**

తృతీయ ముద్రణ **1954** లో**.** (సంగ్రహ కర్త రచన **—-13-7-13-**నుండి **19-8-1913**వరకు)

======================================